www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 27 సెప్టెంబరు 2024

5

ఏలూరు

నేడు ద్వారకాతిరుమలలో రాష్ట్ర రైతు సదస్సు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ఈ నెల 27వ తేదీ శుక్రవారం స్థానిక శ్రీ కృష్ణ యాదవ కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర రైతు సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక యుటిఎఫ్ భవనంలో సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర రైతు సదస్సులో అన్ని పంటల రైతులు పాల్గొనాలని కోరారు. ముఖ్యఅతిథులుగా వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఏపి రైతుసంఘం రాష్ట్ర పూర్వ కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, పలువురు రాష్ట్ర నాయకులు విచ్చేస్తున్నారని తెలిపారు. సదస్సు అనంతరం మూడు రోజులపాటు జరిగే కార్యకర్తల రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు.

నమ్మించారు.. విస్మరించారు..!

- నామినేటెడ్ పదవుల్లో టిడిపి కీలక నేతలకు మొండిచెయ్యి
- అధికారంలోకొచ్చాక పదవులిస్తామని నాడు చంద్రబాబు హామీ
- జిల్లాస్థాయి నేతలు గన్ని, తోటకు దక్కని అవకాశం
- టిక్కెట్ త్యాగం చేసిన నేతల పరిస్థితి అయోమయం
- జనసేన నేతల భవిష్యత్తూ ప్రశ్నార్థకమే

తోట సీతారామలక్ష్మి

గన్ని వీరాంజనేయులు

వలవల బాబ్జి

ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి, జనసేనలో నామినేటెడ్ పదవుల చిచ్చు రగులుతోంది. కూటమి ప్రభుత్వం ఇటీవల పలు కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమిస్తూ జాబితా విడుదల చేసింది. టిడిపిలో కీలక నేతలుగా ఉన్న జిల్లా నాయకులకు పదవులు దక్కకుండా పోయాయి. జనసేనలోనూ అదే పరిస్థితి నెలకొంది. కష్టకాలంలో పార్టీకోసం కష్టపడిన నాయకులను పట్టించుకోకపోవడంపై టిడిపి, జనసేన నాయకుల్లో అసంతృప్తి జ్వాలలు రేగుతున్నాయి. టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షుడుగా గన్ని వీరాంజనేయులు ఉన్నారు. గతంలో ఉంగుటూరు ఎంఎల్ఎగా పని చేసిన గన్ని గడచిన ఎన్నికల్లోనూ ఆదేస్థానం నుంచి టిక్కెట్ ఆశించారు. ఆఖరి క్షణం వరకూ టిక్కెట్ ఆయనకే అన్నట్లు పరిస్థితి సాగింది. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం సైతం నిర్వహించారు. టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో భాగంగా ఉంగుటూరు టిక్కెట్ జనసేనకు కేటాయించారు. దీంతో గన్నికి టిక్కెట్ లేకుండాపోయింది. దీంతో ఆయన పెద్దఎత్తున హడావుడి చేయడంతో టిడిపి అధినేత పిలిపించుకుని పార్టీ అధికారంలోకొస్తా మంచి పదవి ఇస్తామని బుజ్జగించారు. టిడిపి నుంచి తాడేపల్లిగూడెం టిక్కెట్ ఆశించిన వలవల బాబ్జి పరిస్థితి అదేవిధంగా సాగింది. ఆఖరు నిముషంలో తాడేపల్లిగూడెం టిక్కెట్ జనసేనకు కేటాయించారు. దీంతో ఐదేళ్లుగా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పార్టీ కోసం పని చేసిన బాబ్జికి మొండిచేయి మిగిలింది. ఆయనకు న్యాయం చేస్తామని చెప్పారు. నూజివీడు నియోజకవర్గంలో టిడిపికి వెన్నుదన్నుగా ఉన్న ముద్దరబోయిన వెంకటేశ్వరరావును ఆఖరు నిముషంలో తప్పించి, కొలుసు పార్థసారధికి టిక్కెట్ ఇచ్చారు. దీంతో ముద్దరబోయిన ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు సిద్ధమై నామినేషన్ సైతం వేశారు. అధికారంలోకొచ్చాక న్యాయం చేస్తామని చెప్పి నామినేషన్ విత్‌డ్రా చేయించారు. ఇటీవల ప్రకటించిన కార్పొరేషన్ ఛైర్మన్ పదవుల జాబితాలో వీరిలో ఏఒక్కరికీ పదవి దక్కలేదు. తమ నాయకులకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్మన్ పదవి దక్కుతుందని ఆశించిన నాయకుల అభిమానులు తీవ్ర అసంతృప్తిలో మునిగిపోయారు. మాజీ ఎంపీ, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మికి సైతం ఎటువంటి పదవీ ఇవ్వలేదు. ఆమెకు గతంలో మాదిరిగా రాజ్యసభ పదవి ఇస్తారా.. లేక మొండిచేయి చూపిస్తారో వేచిచూడాలి. పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఎటువంటి పదవులూ లేకపోవడంతో సదరు నేతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకు అవకాశం ఉండటం లేదు. ఏదైనా పనిపై అధికారులకు ఫోన్ చేసినా స్పందన అంతంతమాత్రంగానే ఉంటుందనే అభిప్రాయం నేతల్లో వ్యక్తమవుతోంది. ఎన్నికల ముందు న్యాయం చేస్తామని చెప్పి.. ఇప్పుడు సామాజిక అంశాలను తెరమీదకి తెచ్చి పక్కన పెడుతున్నారనే అభిప్రాయం నేతల్లో వ్యక్తమవుతోంది.

జనసేన నేతల భవిష్యత్తు ప్రశ్నార్థకమే

జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న నేతలకు సైతం నామినేటెడ్ పదవుల్లో న్యాయం జరగని పరిస్థితి నెలకొంది. 2019లో జనసేన తరపున పోటీ చేసిన నాయకులు ఆర్థికంగా ఎంతగానో నష్టపోయారు. అయినప్పటికీ గడిచిన ఐదేళ్లూ పార్టీని అంటిపెట్టుకుని ఉన్నారు. అధినేత ఇచ్చిన పిలుపును అందిపుచ్చుకుని ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. అధినేత పవన్‌కళ్యాణ్ పర్యటనల్లో పెద్దఎత్తున సొమ్ము ఖర్చు పెట్టారు. జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న రెడ్డి అప్పలనాయుడు అందులో ఒకరు. గడిచిన ఎన్నికల్లో ఏలూరు నుంచి జనసేన తరఫున పోటీ చేసేందుకు ఆయన అన్ని ఏర్పాట్లూ చేసుకున్నారు. పొత్తులో భాగంగా ఏలూరు టిక్కెట్ టిడిపికి వెళ్లింది. అయినప్పటికీ రెడ్డి అప్పలనాయుడు టిడిపి అభ్యర్థికి తన సహాయ సహకారాలు అందించారు. రెడ్డి అప్పలనాయుడికి నామినేటెడ్ పదవి వస్తుందని అంతా ఆశించారు. జనసేనకు ఇచ్చిన పదవుల్లో రెడ్డి అప్పలనాయుడుకు అవకాశం లేకుండాపోయింది. దీంతో ఆయన అనుయాయుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. జనసేన దెందులూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న ఘంటసాల వెంకటలక్ష్మి పరిస్థితి అదే. చింతమనేని ప్రభాకర్ వంటి నాయకుడిని ఎదుర్కొని ఆ నియోజకవర్గంలో జనసేన తరఫున నిలిచిన మహిళా నేతను పార్టీ పట్టించుకోకపోవడం లేదని విమర్శలు విన్పిస్తున్నాయి. చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న మేకా ఈశ్వరయ్య పరిస్థితి అదేమాదిరిగా తయారైంది. కష్టకాలంలోనూ పార్టీని వీడకుండా నిలబడిన నాయకులను జనసేన అధినాయకులు పట్టించుకోవడం లేదని విమర్శలు విన్పిస్తున్నాయి. ఇక ముందు నియమించబోయే నామినేటెడ్ పదవుల్లోనైనా వీరికి న్యాయం జరుగుతుందో, లేదో వేచిచూడాలి.

కౌలు రైతులకు రుణాలపై ప్రత్యేక విధానం

రబీ నుంచి వ్యవసాయాధికారులచే గుర్తింపు కార్డులు జారీ

మంత్రి కొలుసు పార్థసారధి

మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్రంలో కౌలు రైతులకు పంట రుణాలు అందించడంలో మరింత మేలు జరిగేలా ప్రత్యేక విధానాన్ని రబీ నుంచి తీసుకొస్తామని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం బ్యాంకర్ల జిల్లాస్థాయి సమీక్షా సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ వ్యవసాయరంగంలో 80 శాతానికిపైగా కౌలు రైతులు సాగు చేస్తున్నారని, అయినప్పటికీ వార్షిక రుణ ప్రణాళికలో ప్రాధాన్యతా రంగాలకు రూ.16 వేల కోట్ల రుణాలు లక్ష్యంగాను, కౌలు రైతులకు అందులో కేవలం ఒక శాతం రూ.240 కోట్లు లక్ష్యానికిగాను రూ.101 కోట్లు మాత్రమే పంట రుణాలుగా అందించడం నిజంగా బాధాకరమైన విషయమన్నారు. గత ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీలో భూయజమాని అంగీకారం ఉండాలని పెట్టిన నిబంధనతో కౌలు రైతులకు రుణాలు అందించడంలో బ్యాంకర్లకు సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. 2024-19 తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో రాష్ట్రంలో 18 లక్షల మందికిపైగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులిస్తే, గత ప్రభుత్వం కేవలం 8 లక్షలమంది కౌలు రైతులకే గుర్తింపుకార్డులు జారీ చేసిందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్ది, భూ యజమాని అంగీకారంతో పని లేకుండా, వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో సాగుచేసే కౌలు రైతులను గుర్తించి భూయాజమాన్య హక్కులకు ఎటువంటి భంగం కలగని రీతిలో గుర్తింపు కార్డులు జారీ చేస్తారని, సదరు కార్డును పరిగణనలోకి తీసుకుని బ్యాంకర్లు రుణాలు అందిస్తారని తెలిపారు. వచ్చే రబీ సీజన్ నాటికి కొత్త విధానాన్ని అమలులోకి తీసుకొచ్చి, అర్హులైన ప్రతి కౌలు రైతుకీ పంట రుణాలు అందించేలా సిఎం కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. జిల్లాలో ప్రాధాన్యతారంగాలైన వ్యవసాయం, అనుబంధ రంగాలకు బ్యాంకర్లు చక్కని సహకారంతో రుణాలు అందిస్తున్నారన్నారు. జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి బ్యాంకర్లు సహకరిస్తున్నాయన్నారు. జిల్లాలో ప్రాధాన్యతా రంగాలైన వ్యవసాయం, అనుబంధ రంగాలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.16,600 కోట్లు లక్ష్యానికిగాను మొదటి త్రై మాసికంలో రూ.3223 కోట్లు రుణాలుగా అందించారన్నారు. జిల్లాలో పొగాకు రైతులకు రుణాలను బ్యారెన్‌కు రూ.8 లక్షల వరకు రుణాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులే కాకుండా ప్రయివేటు బ్యాంకులు కూడా సామాజిక బాధ్యతతో చిరు వ్యాపారులకు ముద్ర రుణాలు అందించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్కర్ తొలగింపును నిరసిస్తూ ఆశాల ఆందోళన

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆశా వర్కర్ కాసగాని మంగను విధుల నుండి తొలగించడాన్ని నిరసిస్తూ స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద ఆశా వర్కర్లు గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశాలపై రాజకీయ వేధింపులు నివారించాలని, ఆశా కార్యకర్త లక్ష్మీ మంగను వేధించిన ఎంఎల్‌హెచ్‌పిపై చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆమెకు న్యాయం జరిగే వరకూ తమ పోరాటం సాగుతుందని స్పష్టం చేశారు. ఈ ఆందోళనలో వై.విజయలక్ష్మి, ఇ.లక్ష్మి, ఎన్.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు

నేటి నేతలకు ఆదర్శనీయులు సీతారాం ఏచూరి

సంస్మరణ సభలో ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

సభలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చంటి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మార్క్సిస్టు ఉద్దండుడు, మేధావి, మాజీ ఎంపీ, సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నేటి రాజకీయ నాయకులకు ఆదర్శనీయుడని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని శ్రీ కాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపంలో గురువారం సాయంత్రం సీతారాం ఏచూరి, రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) సంస్మరణ సభ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన జరిగింది. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, ఆర్ఎస్ చిత్రపటానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎంఎస్.నాగరాజు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీతారాం, చంటి మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఒక గొప్ప రాజకీయ నాయకుడని, దేశ రాజకీయాల గురించి, మతోన్మాదం గురించి, పీడిత ప్రజల కష్టాల గురించి తెలిసిన నాయకుడని కొనియాడారు. కేవలం సిపిఎం, వామపక్ష పార్టీల వారే కాకుండా ఇతర రాజకీయ పార్టీల వారంతా గౌరవించే నాయకుడు సీతారాం ఏచూరి అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో బిజెపికి వ్యతిరేకంగా యుపిఎ ప్రభుత్వ ఏర్పాటులో ఆయన కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని, అటవీ హక్కుల చట్టాన్ని, సమాచార హక్కు చట్టాన్ని రూపొందించడంలో ఆయన పాత్ర ప్రముఖమన్నారు. రాజకీయంగా ప్రత్యర్థి పార్టీల నాయకులు సైతం ఆయన సూచనలను, సలహాలను అంగీకరించేవారని అన్నారు. దేశంలో లౌకికవాదాన్ని బలంగా వినిపించి, మతోన్మాదానికి వ్యతిరేకంగా నికరంగా పోరాడినటు వ్యక్తి సీతారాం ఏచూరి అని కొనియాడారు. జిల్లాలో సీనియర్‌నేత, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) సుమారు 70 సంవత్సరాలు సుదీర్ఘ రాజకీయ జీవితంలో నికరంగా సిపిఎం సిద్ధాంతాలకు కట్టుబడి తుదిశ్వాస వరకు పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. ఆర్ఎస్ మతోన్మాదులు, దోపిడీవర్గాల పట్ల కఠినంగాను, తోటి కమ్యూనిస్టులు, కార్యకర్తలు, నాయకులు, ప్రజల పట్ల అత్యంత ప్రేమతో మెలిగేవారని తెలిపారు. సీతారాం ఏచూరి, ఆర్ఎస్ జీవితాలు నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. సభలో సిపిఐ జిల్లా జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఎంఎస్.నాగరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహనరావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఒక్క సిపిఎంకే కాకుండా వామపక్షాలకు వేగుచుక్కలా వ్యవహరించారని, ప్రపంచ దేశాల్లో పేరు గడించారని అన్నారు. గతంలో నేపాల్‌లో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పాటుకు సహకారం అందించారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, పి.కిషోర్, జి.రాజు, డిఎన్‌విడి.ప్రసాద్ తదితరులు మాట్లాడారు. సభలో టిడిపి నాయకులు, మున్సిపల్ కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నంనాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎ.రవి

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

'స్వచ్ఛతా హి సేవ'లో అందరూ భాగస్వాములవ్వాలి

జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, డిఆర్ఒ పుష్పమణి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటే దేశాభివృద్ధి సాధ్యమని, గాంధీజీ ఆశయానికి అనుగుణంగా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ప్రజా పరిషత్ ఛైర్ పర్సన్ పద్మశ్రీ అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక కొత్త బస్టాండ్, జన్మభూమి పార్కుల వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మానవహారం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి ప్రతిజ్ఞ చేయించారు. ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, డిఆర్ఒ డి.పుష్పమణి మొక్కలు నాటారు. చీపురు పట్టి రోడ్లపై చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్ పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ మహాత్మ గాంధీ కలలుకన్న స్వచ్ఛమైన భారతదేశం, అభివృద్ధిని సాధించే దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. మన ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో మనచుట్టూ ఉన్న పరిసరాలను అంతే శుభ్రంగా ఉంచాల్సిన భాద్యత అందరిపై ఉందన్నారు. పరిసరాల పరిశుభ్రతతో అనేక అనారోగ్యాలను దూరం పెట్టవచ్చన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన భారతదేశాన్ని నిర్మించడానికి ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఇందుకోసం కొంత సమయం కేటాయించాలన్నారు. పచ్చదనం వల్లే పర్యావరణ సమతుల్యత సాధ్యమౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, మున్సిపల్ కమిషనరు ఎన్.భానుప్రతాప్, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, ఐసిడిఎస్ పీడీ కె.పద్మావతి, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ట, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్‌కుమార్, బిసి కార్పొరేషన్ ఇడి ఎన్.పుష్పలత, సెరీకల్చర్ డీడీ డి.వాణి, సెట్ వెల్ సిఇఒ ప్రభాకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి, పశుసంవర్థక శాఖ జెడి జి.నెహ్రూబాబు, మెప్మా సంఘాల మహిళలు, పలువురు మహిళలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లను శుభ్రం చేస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్, డిఆర్ఒ

ఆదర్శ ప్రజానేత ఆర్ఎస్

సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, నేతలు, ప్రముఖులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) ఆదర్శ ప్రజా నేత అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం కొనియాడారు. గురువారం స్థానిక రోటరీ హాలులో ఆర్ఎస్ సంస్మరణ సభ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత ఆర్ఎస్ చిత్రపటానికి, సిపిఎం పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి మంతెన సీతారాం, ఎ.రవి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో మంతెన సీతారాం మాట్లాడుతూ ఉన్నత కుటుంబంలో పుట్టినప్పటికీ పేదల పక్షాన నిలబడి ఎర్రజెండా నేతృత్వాన ఎనలేని పోరాటాలు, భూఉద్యమాలు నిర్వహించిన ఘనత ఆర్ఎస్‌కే దక్కుతుందని కొనియాడారు. చిన్నతనంలోనే కమ్యూనిస్టు ఉద్యమంలో చేరి నర్సాపురం ఏరియాలో లంక భూముల పోరాటం చేసి వ్యవసాయ కార్మికులకు భూములు అప్పగించిన ఘనత ఆర్ఎస్‌దేనన్నారు. ఆయన ఎంఎల్ఎగా గెలిచి పేదల పక్షాన నిల్చొన్నారని, అసెంబ్లీలో రైతు, కార్మిక, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం గళమెత్తారని గుర్తు చేశారు. సిపిఐ మండల కార్యదర్శి కె.రమణరాజు, సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు ఎంఎస్.నాగరాజు, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కెవి.రమణ, తలారి ప్రకాష్, రామలక్ష్మి నర్సింగ్ హోమ్‌కు చెందిన ప్రముఖ వైద్యులు డి.ప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఐక్య ఉద్యమాల నిర్వహణలో, ఏజెన్సీలో భూఉద్యమాలు నిర్వహించడంలో వేలాది ఎకరాల భూములు గిరిజనులకు అప్పగించడంలో ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఎమర్జెన్సీ సమయంలో గిరిజనులపై, పార్టీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి నిర్బంధించినప్పటికీ మొక్కవోని దీక్షతో కార్యకర్తలను, గిరిజనులను కాపాడుకుంటూ పోరాటాలు నిర్వహించడంలో ఆర్ఎస్ పాత్ర చాలా కీలకమన్నారు. పేద ప్రజల కోసం జైలుకెళ్లడానికీ ఆయన అండగా నిల్చారన్నారు. ఎలాంటి ఒత్తిళ్లు, ఒడిదుడుకులొచ్చినా అత్యంత నిబ్బరంతో ప్రజా ఉద్యమాలను ముందుకు నడిపిన ధీశాలి అని కొనియాడారు. ఆర్ఎస్ మృతి ఉమ్మడి జిల్లాలో ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న మతోన్మాద, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, అదే ఆర్ఎస్‌కు నిజమైన నివాళి అని అన్నారు. సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మరణం దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాలకు, ప్రజలకు తీరని లోటని, ఇండియా వేదికను కూడగట్టడంలో ఎనలేని కృషి చేశారని తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలో సృష్టిస్తున్న మతోన్మాద రాజకీయాలకు ఎదుర్కొనే సత్తా కమ్యూనిస్టు పార్టీలకే ఉందని, ఈ సందర్భంగా కమ్యూనిస్టు మేధావి ఏచూరి మనమధ్య లేకపోవడం బాధాకరమని అన్నారు. సభలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.జీవరత్నం, తెల్లం దుర్గారావు, వై.నాగేంద్రరావు, గుడెల్లి వెంకట్రావు, అందుగుల ఫ్రాన్సిస్, పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు, కొయ్యలగూడెం మండల కన్వీనర్ ఎస్.రాంబాబు, నేతలు జి.సూర్యకిరణ్, అందుగుల ప్రభాకర్‌రావు, బి.రాంబాబు, వంగ గోపీ, ఎస్‌కె.సుభాషిణి, జోడే సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

దాతలు ముందుకు రావాలి : ఎంఎల్ఎ చంటి

బెంచీలను, షెడ్డును ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజోపయోగ సేవలను విస్తృతం చేసేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఏలూరు బడేటి చంటి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగుల సహాయకులుగా వచ్చేవారి కోసం ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సమకూర్చిన బెంచీలను, ప్రముఖ వ్యాపారవేత్త కెకె.గుప్తా ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన షెడ్డును ఎంఎల్ఎ బడేటి చంటి ప్రారంభించారు. గురువారం ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల అమల్లో ఏలూరు నియోజకవర్గం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచేలా ప్రతిఒక్కరూ తమ తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు కెకె.గుప్తా మాట్లాడుతూ రోగులు, వారి సహాయకులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే ఈ ఆలోచనలకు శ్రీకారం చుట్టామన్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ఆశయాలకు అనుగుణంగా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిహెచ్.సుధాకర్, డాక్టర్ బంకా రవికుమార్, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, 42వ డివిజన్ ఇన్‌ఛార్జి రాజేష్, ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దివ్వెల జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తత అవసరం : సిఐ వెంకటేశ్వరరావు

మాట్లాడుతున్న సిఐ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిఐ బి.వెంకటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. సైబర్ నేరాల వల్ల కలిగే అనర్థాలపై ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో సోషల్ మీడియా ప్రభావం యువత మీద తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఆన్‌లైన్ షాపింగ్‌ల పేరుతో రకరకాల యాప్‌ల ద్వారా ఆఫర్స్‌ను పంపిస్తూ మాయ చేసి డబ్బులు కాజేస్తున్నారన్నారు. యూట్యూబ్ వీడియోలకు లైక్, షేర్ చేస్తే డబ్బులు ఇస్తామని ఆశ చూపుతూ ఫోన్లకు కాల్స్ రూపంలో కాని మెసేజ్‌ల రూపంలో కాని నకిలీ సందేశాలు పంపుతుంటాని, అలాంటివారి పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఎస్ఐ నవీన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థినుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా మాట్లాడడం, ఫోన్‌లలో బెదిరించడం వంటివి చేస్తే కళాశాల యాజమాన్యం దృష్టికి, తల్లితండ్రుల దృష్టికి కాని, టోల్ ఫ్రీ నెంబర్112కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఒకవేళ సైబర్ నేరానికి గురైతే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. 15 నిమిషాల వ్యవధిలో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.సతీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వినతి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో గృహనిర్మాణ శాఖలో పొరుగు సేవల విధానంలో పని చేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అటెండర్లు తమను పొరుగుసేవల విధానం నుండి తప్పించి ఉద్యోగ భద్రత కల్పించాలని, సీనియారిటీ ప్రకారం ఎన్ఎంఆర్ లేదా హెచ్ఆర్ ఉద్యోగులుగా పరిగణించా లని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధిని కోరారు. స్థానిక రెవెన్యూ అతిథిగృహంలో గురువారం వారు మంత్రిని కలిసి తమ సమస్యలు వివరించారు. తాము ఎన్నో సంవత్సరాల నుండి పొరుగుసేవల విధానంలో గృహనిర్మాణ శాఖలో పనిచేస్తున్నామని, తమకు ఉద్యోగ భద్రత లేదని వాపోయారు. తమతో పాటు నియమితులైన డిఆర్‌డిఎ, డ్వామా, ఎన్ఆర్ఇజిఎస్ శాఖల్లోని వారికి హెచ్ఆర్ పాలసీని అమలు చేస్తున్నారని, తమనూ సీనియారిటీ ప్రకారం ఎన్ఎంఆర్ లేదా హెచ్ఆర్ ఉద్యోగులుగా పరిగణించాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సమస్యను పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ సిబ్బంది కె.నాగభూషణం, పావని, చంద్రశేఖర్, కె.పోసుకుమార్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

నిటలాక్షరామకు పలువురి అభినందన

యుఎన్ఎ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన నిటలాక్షరామ

స్థానిక కొయ్యలగూడెనికి చెందిన దాసరోజు నిటలాక్ష రామకు యుఎన్ఎ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. మూడేళ్ల వయసులో మూడు నెలల కాలంలో ఐదు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందడం ఒక అరుదైన రికార్డని అని గుర్తించి, అతి చిన్న వయసులో, అతి తక్కువ సమయంలో ఐదు వరల్డ్ రికార్డ్స్ సాధించినందుకు, ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చూపించినందుకు యుఎన్ఎ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు బహుముఖ ప్రజ్ఞా పాటవాలు కలిగిన చిన్నారి అని ఈ వరల్డ్ రికార్డ్స్ అందించిందని నిటలాక్ష రామ తల్లిదండ్రులు శ్రీకాళ్యాణిశ్రీ పీఠ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ దాసరోజు శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులు తెలిపారు. నిటలాక్ష రామ ప్రతిభను సంతోషిస్తూ స్థానిక ప్రముఖులు, ప్రముఖ రచయిత ప్రొఫెసర్ పూతకూరి వరప్రసాద్ మాట్లాడుతూ ఇంత చిన్న వయసులోనే నిటలాక్ష రామ కనబరిచే ప్రతిభను దేవుని వరముగా అభివర్ణించారు. సిద్ధ ఒబిసి మెర్సీ కర్పూర సభ్యులు అడ్వకేట్ మేడిపల్లి నాగు, విద్య ఓపెన్ మైండ్స్ స్కూల్ యాజమాన్యం, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు దార్ల రాంబాబు, పెద్దోట శ్రీనివాసాచార్యులు, జవ్వాది శ్రీనివాస్, పలువురు స్థానిక ప్రముఖులు నిటలాక్ష రామకు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ ఆటల పోటీలకు 14 మంది విద్యార్థులు ఎంపికైనట్లు అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డి.వి.ఎస్.బి.శంకరరావు గురువారం తెలిపారు. ఈ నెల 24న జిల్లా కేంద్రంలోని సీతారామ స్టేడియంలో అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్ ఆటల పోటీలు రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, షాట్ పుట్, జావలిన్ త్రో గురుకుల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు, వీరిలో ఐదుగురు బంగారు పథకాలు, ఆరుగురు సిల్వర్, ఐదుగురు విద్యార్థులు బ్రాంజ్ మెడల్స్‌తో మొత్తం 14 మంది విద్యార్థులు పథకాలను సాధించారని తెలిపారు. వీరందరూ కూడా జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు.

కేతవరం విద్యార్థిని ఎంపిక

రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు కేతవరం హైస్కూల్ విద్యార్థిని కొలుకులూరి హేమశ్రీ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఎం.వి.అప్పారావు గురువారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన జిల్లాలోని పెదవేగి గురుకుల పాఠశాలలో నిర్వహించిన బేస్‌బాల్ పోటీల్లో బాలికల అండర్-14 విభాగంలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని కొలుకులూరి హేమాశ్రీ మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ముసునూరు విద్యార్థులు

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు ఎపిఆర్ఎస్ గురుకుల పాఠశాల విద్యార్థినులు 34 మంది వివిధ విభాగాల్లో జిల్లా స్థాయి అండర్-14, అండర్-17 పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ జి.నాగమల్లేశ్వరమ్మ చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయులు మార్గదర్శకత్వంలో తమ విద్యార్థినులు క్రీడల్లో రాణిస్తున్నారని తెలిపారు.

ఈదులగూడెం విద్యార్థులు ఎంపిక

ఆగిరిపల్లి : జిల్లా స్థాయి క్రీడలకు మండల పరిధిలోని ఈదులగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.ప్రసాద్ తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నూజివీడు ఎస్ఆర్ఆర్ బాలుర హైస్కూల్‌లో నిర్వహించిన ఖోఖో, వాలీబాల్, కబడ్డీల్లో పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

నేడు నియోజకవర్గస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు డిఎఆర్ కాలేజీలో ఈ నెల 28 వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివిఎన్.సత్యనారాయణ తెలిపారు. అండర్-14, అండర్-17 బాల బాలికలకు పోటీలు జరుగుతాయన్నారు. నూజివీడు నియోజకవర్గంలోని ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల నుంచి అథ్లెటిక్స్ క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, జావిలిన్, డిస్కస్, ట్రిపుల్ జంప్, రిలే స్, హ్యామర్ త్రోలో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. క్రీడాకారులుకు మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశామని తెలిపారు.

మార్చి లోపు ఇల్లు కట్టుకున్నవారికే బిల్లులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఇంటి నిర్మాణాలు ప్రారంభించి వివిధ స్థాయిల్లో నిలిచిపోయిన వాటిని మార్చి నెలాఖరులోగా పూర్తి చేసుకుంటేనే బిల్లులు వస్తాయని లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసేలా కార్యదర్శులు, ఇంజినీరింగు అసిస్టెంట్లు కృషి చేయాలని ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్ కోరారు. ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ కాలంలో ఇంటి నిర్మాణాలు ప్రారంభించి సగంలో నిలిచిపోయిన వాటికి 1.0 స్కీములోనే బిల్లులు వస్తాయన్నారు. ఏప్రిల్ నుంచి ఈ ప్రభుత్వ మంజూరు చేసిన ఇళ్లకు మాత్రమే 2.0 స్కీము వర్తిస్తుందని, ఈ మేరకు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని హౌసింగ్ ఎఇ సురేష్‌బాబు అన్నారు.

ఘనంగా వేదవ్యాస్ పుట్టినరోజు

ప్రజాశక్తి - ముదినేపల్లి

పండ్లు అందిస్తున్న సత్యనారాయణ

పెడన మాజీ ఎంఎల్ఎ, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక స్పామ్ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ కూనపరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. గురువారం వేద వ్యాస్‌ను సత్యనారాయణ ఆయన స్వగృహంలో కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సంస్థ, కుటుంబ అభ్యున్నతికి వేదవ్యాస్ చేసిన సహాయం ఎన్ని జన్మలకైనా మరువలేనన్నారు. వేద వ్యాస్ రాజకీయ భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ముదినేపల్లిలో అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి తండ్రి డాక్టర్ అంబుల మనోజ్ హాస్పిటల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంబుల మనోజ్, ఓలేటి మణిభీమరాజు, (టిఐ) బోయిన కృష్ణ, మోహన్ (డిటిఐ) గంధం నాగ వెంకట శివ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

చెరువులో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. చింతలపూడి ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేచర్ల గ్రామానికి చెందిన ఏలూరి నాగరాజు (26) మూడు రోజులు క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఈ క్రమంలో చెరువులో అతని మృతదేహాన్ని గమనించిన పశువుల కాపరి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సీతారామపురం గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్ తన సిబ్బందితో గురువారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.17,700 నగదు, ఏడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

వైద్యుల కొరత... రోగుల అవస్థలు

అందని మెరుగైన వైద్య సేవలు
చింతలపూడి ప్రభుత్వాసుపత్రిలో పరిస్థితి
ప్రయివేట్ ఆసుపత్రికి వెళ్లలేక పేదల ఇబ్బందులు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వాసుపత్రిలో సాధారణ డెలివరీ సంఖ్య పెంచాలని అటు ప్రభుత్వం ఇటు అధికారులు నిత్యం చెబుతూనే ఉంటారు. కాని వైద్యాధికారులు, గైనకాలజిస్ట్ లేకుండా డెలివరీ సంఖ్య ఎలా పెంచుతారనేది పెద్ద ప్రశ్నగా మారింది. చింతలపూడి ఏరియా ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల కొరతతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

తాళం వేసి ఉన్న కంటి పరీక్ష కేంద్రం

చింతలపూడి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో వైద్యుల కొరత ఉండటంతో ప్రజలకు అరకొర వైద్య సదుపాయాలు అందుతున్నాయి. చింతలపూడి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో జనరల్ సర్జన్ 2, గైనకాలజిస్ట్ 2, చిన్నపిల్లల వైద్యనిపుణులు 1, కంటి వైద్య నిపుణులు 1, దంత వైద్య నిపుణులు 1, జనరల్ మెడిసిన్ 1, రేడియాలజీ 1 మొత్తం తొమ్మిది మంది వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో సరైన వైద్యం అందడంలేదని రోగులు వాపోతున్నారు. చింతలపూడి ఏరియా హాస్పిటల్‌కి ఇటు కృష్ణా, అటు తెలంగాణ నుంచి కూడా చింతలపూడి ఏరియా హాస్పిటల్‌కి వస్తుంటారు. ఆసుపత్రిలో ప్రతిరోజు 500 పైగా ఒపి ఉంటుందని, అంతేకాకుండా వార్డుల్లో కూడా నిత్యం రద్దీగా ఉండడం, వైద్యాధికారుల కొరతతో ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లి రూ.వేలకు వేలు డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. చింతలపూడి ఎస్‌సి నియోజకవర్గం అవ్వడంతో, ప్రయివేట్ ఆసుపత్రికి వెళ్లేందుకు ఆర్థిక స్తోమత సరిపోక ప్రభుత్వాసుపత్రికి వస్తుంటారు. కాని ఇక్కడ సంబంధిత డాక్టర్లు లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఒక్క నెలలోనే పది డెలివరీలు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ చెబుతున్నారు. ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ ఉంటే రెట్టింపు సంఖ్యలో డెలివరీ సంఖ్య పెరుగుతుంది. ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉన్నా జిల్లా అధికారులు ఎందుకు ఖాళీలను భర్తీ చేయడం లేదో అర్థం కాని పరిస్థితి. డిప్యూటేషన్‌పై వారానికి రెండు రోజులు వైద్యులు వచ్చినా రోగులకు, ప్రజలకు పెద్దగా తెలియకపోవడంతో వైద్య సేవలు అందుకోలేకపోతున్నారు.

జనరల్ డ్యూటీ అటెండర్ల కొరత ఉండడంతో ఆసుపత్రిలో ఎమర్జెన్సీ కేసులు వచ్చినప్పుడు, వీల్‌చైర్ పైన గాని స్ట్రక్చర్ పైన గాని తీసుకెళ్లేవారు లేక రోగికి సంబంధించిన బంధువులే వార్డులోకి చేతులతో తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. జనరల్ డ్యూటీ అటెండర్ పోస్టులు నాలుగు ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేస్తే రోగులకు కొంత సహాయంగా ఉంటుందని చెబుతున్నారు. రక్త పరీక్ష కేంద్రం వద్ద ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్ల కొరత ఉంది. దీంతో రక్త పరీక్షలు చేయించుకున్న రోగులకు ఫలితాలు రావడానికి గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆసుపత్రిలో కంటి పరీక్ష కేంద్రానికి తాళం వేసి ఉండడంతో కంటి వైద్యం నిమిత్తం వచ్చే రోగులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. పేదలు ప్రయివేట్ ఆసుపత్రికి వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆచింతలపూడి ఏరియా హాస్పిటల్‌లో సుమారుగా రోజుకు 140 మంది పరీక్షలు చేయించుకుంటున్నారు. ల్యాబ్ టెక్నిషన్ కొరత ఉండడంతో ప్రస్తుతం ఉన్నవారిపై ఒత్తిడి పెరిగి ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడ సరిపడా టెక్నీషియన్ ఉండగా వారిని వేరే మండలానికి బదిలీ చేయడంతో ఇక్కడ రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు, వైద్యాధికారులు సిబ్బంది కొరతను వెంటనే భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యుల కొరత ఉంది
ఎ.నారాయణరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్

చింతలపూడి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో వైద్యుల కొరత ఉంది. అదేవిధంగా సిబ్బంది కొరత కూడా ఉంది. కొంతమంది వైద్యాధికారులు డిప్యూటేషన్‌పై వారానికి రెండు రోజులు వస్తూ వెళ్తున్నారు. ఇది జిల్లా అధికారులు దృష్టిలో పెట్టాము. స్థానిక ఎంఎల్ఎ దృష్టిలో కూడా పెడతాము.

ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్తాం
కొండ్రు దేవ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ వైస్ ఛైర్మన్

ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతపై చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ దృష్టిలో పెడతాను. ఆసుపత్రి అభివృద్ధిలో పలు మార్పులు తీసుకొస్తాం.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం : మంత్రి

మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

చిరు వ్యాపారులు, కుల వృత్తిదారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. నూజివీడు రోటరీ క్లబ్ ఆడిటోరియంలో నూజివీడు కోసం అనే ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా పశు సంవర్ధక శాఖ, జాతీయ లైఫ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో ఔత్సాహిక రైతులకు, నిరుద్యోగులకు ప్రభుత్వ రుణాలపై అవగాహనా సదస్సు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పార్థసారధి మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఆర్థిక రుణాలను అందిపుచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీ రుణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చేతి వృత్తులవారికి, చిరు వ్యాపారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందుబాటులో ఉంచిన అనేక ప్రోత్సాహకరమైన రుణాలపై అవగహన పెంచుకుని రుణాలను పొందాలన్నారు. తద్వారా వ్యాపారాభివృద్ధి చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. రుణాల లబ్ధిపై, వాటిని పొందే విధానంపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ బ్యాంకర్స్, వ్యవసాయ, ఇతర సంక్షేమ శాఖాధికారులు కలిసి ప్రతి నెలా ఒక సమావేశం నిర్వహించుకోవాలన్నారు. గొర్రెలు, మేకలు, మూగ జీవాల ఫామ్స్ నిర్మాణానికి కోటి రూపాయల వరకు రుణం 50 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తుందన్నారు. దానిని అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం అందించే రాయితీ రుణాలను విస్తృతంగా గ్రామ స్థాయిలో ప్రచారం, అవగాహన చేయాల్సిన బాధ్యత బ్యాంకర్స్, ప్రభుత్వ అధికారులపై ఉందన్నారు. ఏ ఒక్క రైతుకు గాని, చిరు వ్యాపారులకు గాని, బ్యాంకర్స్ రుణాలు ఇవ్వమని చెప్పిన పక్షంలో తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే బ్యాంకర్స్‌తో మాట్లాడి రుణాలు ఇప్పించే బాధ్యత తనదని మంత్రి స్పష్టం చేశారు. బ్యాంకర్లు అందించే రుణాలపై అవగహన కల్పించేందుకు, రుణాలు పొందేందుకు త్వరలో నూజివీడులోని తమ క్యాంపు కార్యాలయంలో ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖాధికారులు, బ్యాంకర్స్, రైతులు, చిరు వ్యాపారులుచ కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు రహదారి భద్రతా నియమాలు పాటించాలని నూజివీడు రూరల్ సిఐ కె.రామకృష్ణ అన్నారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో మన పోలీస్-మన రక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ వల్ల సమాజానికి జరిగే మంచి పనుల గురించి, గుడ్, బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, సోషల్ మీడియా మాధ్యమాల్లో అపరిచిత వ్యక్తుల పరిచయాలు, జరిగే మోసాలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి.పుష్పలత, ఎస్ఐ కె.శుభశేఖర్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

రైతులకు కిసాన్ కార్డులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని కొన్నంగుంట గ్రామంలో రైతులకు గురువారం కిసాన్ సభ కార్డులు అందించారు. ఈ సందర్భంగా మండల కో-ఆర్డినేటర్ ఎం.భూలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కిసాన్ సభ ప్రాజెక్టు ద్వారా రైతులు సకాలంలో వారు పండించిన పంటకు గిట్టుబాటు ధర నిర్ణయించుకుని అమ్ముకునే విధంగా చేస్తారని చెప్పారు. కిసాన్ సభ ప్రాజెక్టు ఎస్‌బిఐ బ్యాంకు వారిచే ఇన్సూరెన్స్ నమోదు చేస్తారని, కిసాన్ సమ్మన్ నిధి యోజన ద్వారా రాయితీ లోన్లు ఇప్పించటం, మండల కేంద్రం ద్వారా ఎరువులు, పురుగుమందు విత్తనాలు కంపెనీ నిర్ణయించిన ధరకు కొనుగోలు చేసుకునే విధంగా చేస్తారని చెప్పారు.

బొరగం శ్రీనివాస్‌కు పలువురి అభినందన

ప్రజాశక్తి - కుక్కునూరు

ఎపి ట్రై కార్ ఛైర్మన్‌గా నియమితులైన టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్‌కు ఆ పార్టీ కుక్కునూరు మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని శ్రీధర్ గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు తుళ్లూరి సురేష్, మారేడుబాక గ్రామానికి చెందిన ముప్పాల శివయ్య బొరగాన్ని కలిసి పుష్ప గుచ్ఛాలను అందించారు. బొరగం శ్రీనివాస్‌ను ఈ పదవిలో నియమించిన సిఎం చంద్రబాబుకు పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి నేతల సన్మానం

టి.నరసాపురం : ఎపి ట్రైకార్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన టిడిపి పోలవరం కన్వీనర్ బొరగం శ్రీనివాసులును బుధవారం టిడిపి మండల నాయకులు ఎపి సచివాలయంలో సన్మానించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ, తెలుగు రైతు సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వాసిరెడ్డి రామ్మోహన్, పలువురు టిడిపి నాయకులు అభినందనలు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

ప్రజాశక్తి - భీమడోలు

దేశానికి ప్రయోజనం చేకూరాలంటే ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగతంగా సైతం పరి శుభ్రంగా ఉండాలని, ఇతరులను చైతన్య పరచాలని భీమడోలు ఎంపిడిఒ పద్మావతి దేవి కోరారు. భీమడోలు గీతాంజలి జూనియర్, డిగ్రీ కళాశాల ఆవరణలో కరస్పాండెంట్ ఎం.గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా స్వచ్ఛభారత్ ఉప అంశాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపిడిఒ తొలుత విద్యార్థులతో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. అక్టోబర్ రెండో తేదీ నాటికి ఈ కార్యక్రమంలో చేపట్టిన అంశాలు పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భీమడోలు పంచాయతీ విస్తరణ అధికారి ఎ.సుందరి, గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, కళాశాలల ప్రధాన ఆచార్యులు ఉదయ్ కిరణ్, సత్యనారాయణతోపాటు యూనిసెఫ్ సభ్యులు సైదులు, ఐఎస్‌డి ఎస్‌జి సభ్యులు పాల్గొన్నారు.

సహకార సంఘ సేవలను వినియోగించుకోవాలి

మహాజన సభలో మాట్లాడుతున్న సిఇఒ భుజంగరావు

ప్రజాశక్తి - టి.నరసాపురం

సహకార సంఘం అందిస్తున్న సేవలను రైతులు వినియోగించుకోవాలని సంఘ ఛైర్‌పర్సన్ యర్రా ఏసుకుమార్ తెలిపారు. స్థానిక సహకార సంఘం ఆవరణలో గురువారం సిఇఒ జి.భుజంగరావు అధ్యక్షతన గురువారం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వ్యాపారాల నిర్వహణ లాభ, నష్టాలను సిఇఒ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం సొసైటీ అనేక సేవలు అందిస్తుందని తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు, ధాన్యం కొనుగోలు కేంద్రా లు, పంట రుణాలు, బంగారంపై తక్కువ వడ్డీకి అప్పులు ఇస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని వ్యాపారాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సభలో పర్సన్ ఇన్‌ఛార్జి ఏసుకుమార్, మాజీ అధ్యక్షులు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

మక్కినవారిగూడెంలో...

మండలంలోని మక్కినవారిగూడెం సహకార సంఘ ఆవరణలో గురువారం సహకార సంఘం మహాజన సభ ఛైర్‌పర్సన్ యర్రా ఏసుకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సిఇఒ యువి.సత్యనారాయణ సంఘ లావాదేవీలు పలు అంశాలపై చదివి వినిపించారు. నూతనంగా చేపట్టబోయే వాటిని మహాజన సభలో ఆమోదించినట్లు సిఇఒ తెలిపారు.

అసలైన నిందితులను శిక్షించాలని వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

వినతిపత్రం అందిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

జనవరి ఆరో తేదీన రెడ్డిగూడెం సమీపంలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదం కేసులో అసలైన నిందితులను శిక్షించాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ చలపతిరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్ మాట్లాడుతూ టిడిపి బుట్టాయగూడెం అధ్యక్షులు, ఎఎంసి మాజీ ఛైర్మన్ మూగపర్తి సోంబాబు, మార్కెట్ యార్డ్ మెంబర్ గద్దె అబ్బులు, టిడిపి నాయకులు కలిసి దళిత యువకుడిని రోడ్డు ప్రమాదం కేసులో ఇరికించారన్నారు. ఈ కేసుపై సమగ్రమైన దర్యాప్తు జరిపించాలని, నిజమైన నిందితుడిపై కేసు నమోదు చేయాలన్నారు. అమాయకుడైన దళితుడు మరపట్ల చింతారావును విడిపించాలని కోరారు. గిరిజన యువకుడి చావుకు కారణమైన, దళితుడిని యాక్సిడెంట్ కేసులో ఇరికించిన మగపర్తి సోంబాబు, గద్దె సత్యనారాయణ (అబ్బులు)లపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - భీమడోలు

గత ఆర్థిక సంవత్సరం భీమడోలు మండలంలో ఉపాధి హామీ చట్టం కింద రూ.12.98 కోట్ల విలువైన 1589 పనులను చేపట్టగా, సామాజిక తనిఖీల సందర్భంగా సుమారు రూ.90 వేలు రికవరీ చేయాల్సి ఉంటుందని గుర్తించినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఎ.రాము తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలు మండల ఉపాధి హామీ పిఒ పద్మావతిదేవి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులుతో పాటు, ఉపాధి హామీ జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, భీమడోలు మండల పరిషత్ అధ్యక్షులు కనమాల రామయ్య, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కరణం పెద్దిరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు మాట్లాడుతూ మండలంలో గత ఆర్థిక సంవత్సరం రూ.11.33 కోట్ల విలువైన 1555 ఉపాధి హామీ పనులు జరిగాయన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.1.47 కోట్ల విలువైన 30 పనులను చేపట్టారన్నారు. గ్రామీణ నీటి సరఫరా పథకం శాఖ ద్వారా రూ.15.61 లక్షల విలువైన నాలుగు పనులు చేపట్టారని తెలిపారు. మండల పరిధిలోని 13 గ్రామపంచాయతీలో నిర్వహించిన సామాజిక తనిఖీల సందర్భంగా సుమారు రూ.90 వేల విలువైన పనులు నిబంధనలకు అతిక్రమించే జరిగినట్లు గుర్తించి వాటి రికవరీకి ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ భీమడోలు ఎపిఒ కె.పద్మ పాల్గొన్నారు.

పలుచోట్ల 'ఇది మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వందరోజుల కూటమి సుపరిపాలనలో ప్రజాసంక్షేమ యజ్ఞం నిరాటంకంగా కొనసాగిందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఏలూరులోని రెండో డివిజన్ భూలోకమ్మ తల్లి ఆలయం వద్ద గురువారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ బడేటి చంటి, మేయర్ నూర్జహాన్ పాల్గొన్నారు. భూలోకమ్మ తల్లిని దర్శించుకున్న తర్వాత ప్రతి ఇంటికి వెళ్లిన వారు వందరోజుల పాలనలో కూటమి ప్రభుత్వం సాగించిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ప్రతి ఇంటికీ ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అంటించారు.

చింతలపూడి : పేదల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని చింతలపూడి మాజీ ఎంపిటిసి రాజా అన్నారు. మండలంలోని ముక్కంపాడు గ్రామంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రగడవరంలో ఎంపిడిఒ మురళీకృష్ణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు, అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలను అందించారు. స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బుద్ధాల నాగు, శ్రీనివాసరెడ్డి, కొమ్ము తిరుపతిరావు, కొప్పెర్ల నాగరాజు, మానేపల్లి రాజారావు, మారేష, గంజి పవన్, రాంబాబు, పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని లోపూడి గ్రామంలో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఇంటింటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన అభివృద్ధి, అమలు చేసిన హామీల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లక్కపాము కాంతారావు, నక్కా చెన్నారావు, పి.వెంకటరత్నం, డాక్టర్ గంగాధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి

ప్రజాశక్తి - ఏలూరు

పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా నియమితులైన వి.శ్రీలక్ష్మి రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధిని రెవెన్యూ అతిథి గృహంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరించాలన్నారు.

హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి : ఎఐఎస్ఎఫ్

దెందులూరు : మండలంలోని కొవ్వలి ఎస్‌సి బాలుర వసతి గృహ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వసతి గృహాల సమస్యలపై కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం సాయికుమార్ మీడియాతో మాట్లాడుతూ కొవ్వలి ఎస్‌సి బాలుర వసతి గృహంలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకొని వసతి గృహంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పలుచోట్ల 'స్వచ్ఛతా హి సేవ'

ప్రజాశక్తి - కామవరపుకోట

ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలో ఏలూరు జిల్లాలో ఎన్ఎస్ఎస్ విభాగం, భారత ప్రభుత్వ యువజన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ రెండో తేదీ వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, ఇందు నిమిత్తం కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాత్రమే ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.విజయబాబు తెలిపారు. గురువారం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు.

నూజివీడు టౌన్ : నెహ్రూపేట సచివాలయం వద్ద టిడిపి నాయకులు ఇళయరాజా ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని 10, 19, 20 వార్డు ప్రజలకు తడి, పొడి చెత్తను వేరు చేయడంపై అవగాహన కల్పించారు.

పాస్‌పోర్టు పోయినది

ప.గో.జిల్లా, ఆచంట మండలం ఆచంట పెద్దపేట గ్రామానికి చెందిన వసంతాడ ట్వింకిల్ రత్న భరత్, తండ్రి: దేవదానం కు చెందిన, K 2753568 నెంబర్ గల పాస్‌పోర్ట్ ఆచంట వేమవరం నుంచి ఆచంట మోటార్ సైకిల్ పై వస్తుండగా పాస్‌పోర్ట్ కలిగిన కవరు మార్గ మధ్యలో పడిపోయినది. ఆ కవర్లో విశాఖపట్నం వారు జారీ చేసిన K 2753568 పాస్‌పోర్ట్ కలదు. కావున ఒరిజినల్ పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికినచో ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

వసంతాడ ట్వింకిల్ రత్న భరత్
తండ్రి: దేవదానం
ఇంటి నెం. 19-133,
ఆచంట పెద్దపేట, ఆచంట మండలం
ప.గో.జిల్లా. పిన్‌కోడ్ నెం. 534123
సెల్: 95504 67567

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, ఏలూరు తూర్పువీధి, 8వ డివిజన్, డోర్ నెం. 7బి-7-2 రు కాపురస్థుడు షేక్ భాషామియా గారి కుమారుడు, షేక్ నిజాంమియ్యా - ఆధార్ నెం. 6497 4461 7129 - షేక్ అమీర్‌జాని గారు వారి తాలుకు ఆస్థిని నా వద్ద తనఖాను వుంచినారు. వారి తాలూకు దస్తావేజులు ఫొటోస్టాట్ నిమిత్తము ఏలూరు, పెద్దపోస్టాఫీసు సెంటర్ వద్ద ఫొటోస్టాట్ సెంటర్‌లో ది.25-09-2024వ తేదీ ఉదయం 10-30 గంటలకు వెళ్ళి ఫొటోస్టాట్ తీయించి వారికి ఫొటోస్టాట్ కాపిలు ఇచ్చి, ఇంటికి వెళ్ళినాను. బండికి తగిలించిన సంచిలోవున్న వారి తాలుకు దస్తావేజు నెం. 509/2017రు పారిఖత్తు దస్తావేజు కనిపించలేదు. నేను వచ్చిన మార్గములోనే వెళ్ళి వెతికివున్నాను. వారిని అడిగినాను. అది దొరకలేదు. ఎంక్వయిరీ చేసినాము. సదరు పారిఖత్తు దస్తావేజు 509/2017రు దస్తావేజు ఏవరికైన దొరికిన యెడల పై అడ్రస్ మరియు క్రింద తెలియపరచిన ఫోన్ నెంబరుకు తెలియపరచిన తగిన బహుమతి ఇవ్వగలవాడను.
ది. 27-09-2024

షేక్ నిజాంమియ్యా
ఏలూరు
సెల్: 96763 01643

వేలం ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.38/2017 in O.S.No.165/2016
DHR: Konijeti Venkata Satyanarayana Anjaneyulu
VS
JDR: Smt. Javvaji Girija Kumari

డిక్రీ బాకీ రాబట్టుకొనుటకు గాను ఈ దిగువ తెలియపర్చిన ఆస్థిని ది.14-10-2024వ సం॥రం తేదీ ఉదయం గం॥10:30 నిమిషములకు పై కోర్టు వారి ఎదుట వేలం వేయబడును. కావలసిన వారు వచ్చి పాడుకొనవచ్చును.

SCHEDULE

West Godavari District, Palakol Mandal, Palakol Sub-Registry, Palakol Town & Vacant site at nearest D.No.38-4-39/A, with Asst. No. 1079005922 in an extent of 59-4-00 Sq. Yards in R.S.No.210 situated at 19th Ward Karumuri Vari Street, Palakol within the following Boundaries:
1st Item: East: Site of Narikadavilli Veera Pushpavathi and Joint Way. West: House wall belongs to Chunduri Venkatarami Reddy and his brothers. North: Compound wall of Emmidi Lakshmi Narasimha Murthy. South: Site of Sikhakollu Venkateswara Rao.
2nd Item: East: Site of Davaleswarapu Ramachandra Rao and others. West: Site of Emmidi Satya Venkata Bhaskara Rama Rao. North: Municipal Road. South: 3rd Item herein.
3rd Item: East: Site of Mamidi Venkateswara Rao. West: Site of Emmidi Lakshmi Narasimha Murthy. North: 1st Item herein and the site of Ippiri Mahalakshmi and others. South: 4th Item herein and site of Emmidi Lakshmi Narasimha Murthy.
4th Item: East: Site of Mamidi Venkateswara Rao. West: Site of Emmidi Lakshmi Narasimha Murthy. North: 4th Item herein. South: Site of Emmidi Satya Venkata Bhaskara Rama Rao and Others.
DHR Value : Rs.10,00,000/-
Ammin Value : Rs.10,00,000/-

వై.డి.ఫణికర్
నరసాపురం, అడ్వకేట్, నరసాపురం.
25-9-24. సెల్: 70134 75668

ఇక సెలవ్ కామ్రేడ్స్..

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

కామ్రేడ్ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్.ఎస్) సంస్మరణ ప్రత్యేక అనుబంధం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా

25 సెప్టెంబర్ 2024 28 పేజీలు

ఆదర్శ ప్రజా నేత ఆర్.ఎస్.

ఆర్ఎస్.. ఆ పేరు వింటేనే కార్మికులకు.. పేదలకు ఒక ధైర్యం.. శత్రువర్గాల గుండెల్లో గుబులు.. తెల్లని దుస్తులు ధరించి సన్నగా.. పొడవుగా ఉండే ఆర్ఎస్ నడిచొస్తుంటే ఆత్మీయ నేతగా అందరినీ ఆకర్షించేవారు. ఆయన ఆత్మీయ పలకరింపు.. పని పట్ల నిబద్ధత.. గంభీర స్వరం.. సమరశీలత.. చురుకుదనం.. సమయపాలన.. కచ్చితత్వంతో కూడిన మార్గనిర్దేశం ఆయన నైజం. అంతకుమించి కార్యకర్తలైనా.. నేతలైనా.. ఇతర పార్టీల నేతలైనా.. అధికారులైనా తొలుత యోగక్షేమాలు అడగడం, కుటుంబ సభ్యుల యోగక్షేమాలు వాకబు చేసే తీరు అందరినీ కట్టిపడేసేది. అందుకే అంతా అంటుంటారు.. ఆర్ఎస్ రంగంలోకి దిగితే ఏ అంశమైనా.. ఎవరైనా.. 'ఓ.. ఎస్' అనడమే తప్ప 'నో' అనే పరిస్థితి ఉండదనేది.

విద్యార్థి జీవితం నుంచి ఉద్యమాల బాట పట్టిన ఆర్ఎస్ ఏ దశలోనూ వెనుదిరగని ధీరుడు. స్వగ్రామంలో భూస్వాముల దాడులను తట్టుకుంటూ పేదల పక్షాన నిలిచి అందరి ఆదరాభిమానాలు చూరగొన్న నేత. అందుకే ఆ గ్రామంలో పంచాయతీ, సొసైటీ, ఇతర పదవులన్నీ కమ్యూనిస్టులనే వరించాయంటే దానిలో ఆర్ఎస్ పాత్ర మరువలేనిది. నరసాపురం ఎంఎల్ఏగా పని చేసిన సమయంలో నియోజకవర్గంలోని వివిధ తరగతుల ప్రజల సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించడమే కాకుండా వాటిని పరిష్కరించే వరకూ పట్టువీడకుండా పనిచేసిన ప్రజాప్రతినిధి. ఎంఎల్ఏగా పని చేసినా ఏనాడూ అధికార దర్పం ప్రదర్శించకుండా కార్యకర్తలతో, వారి కుటుంబాలతో, ప్రజలతో మమేకమైన నేత ఆర్ఎస్. ఏదైనా కార్యక్రమాల్లో ఎవరైనా.. ఏ పొరపాటు చేసినా వెంటనే సరిదిద్దడం ఆయన ప్రత్యేకత. అందుకే ఆయన కార్యకర్తలను మందలించినా ఓ కుటుంబ పెద్దగా భావించారు తప్ప బాధపడిన దాఖలాల్లేవంటే అతిశయోక్తి కాదు. జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలోనూ, ఎన్నికల వ్యూహ రచనల్లోనూ ఆయన సవ్యసాచి. అందుకే అన్ని పార్టీల నేతలకు ఆర్ఎస్ అంటే అభిమానం. కార్మికులు, రైతులు, పేదల సమస్యల పరిష్కారానికి ప్రత్యక్ష పోరాటాల్లో పాల్గొనడంతోపాటు అన్ని ప్రజారంగాల్లోనూ జోక్యం చేసుకుని ఉద్యమాభివృద్ధికి విలువైన సూచనలిచ్చేవారు. వయస్సు మీద పడుతున్నా.. విశ్రాంతి కోరుకోని ప్రజానేత ఆర్ఎస్. 2018లో తీవ్ర అనారోగ్యం పాలైనప్పటి నుంచి ఇంటి వద్దనే ఉంటున్నా పార్టీ కార్యక్రమాలు తెలుసుకుంటూ ప్రజాసంఘాల నేతలను ఇంకా బాగా చేయండంటూ నిరంతరం ప్రోత్సహించిన ఆదర్శ నేత.

Red Salute



ఆదర్శమూర్తికి అశ్రునివాళి...

మా కుటుంబ ఉన్నతికి అహర్నిశలు శ్రమించడమే కాకుండా
పేద మధ్యతరగతి రైతాంగా సమస్యలపై అలుపెరగని
పోరాటం చేసి ప్రజలందరి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన
మా తండ్రిగారు సిపియం సీనియర్ నాయకులు నరసాపురం
మాజీ శాసన సభ్యులు
కామ్రేడ్ "రుద్రరాజు సత్యనారాయణరాజు"
(ఆర్.ఎస్) గారికి అశ్రునివాళి...

జోహార్

జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, రైతు, కార్మిక నేత, మాజీ ఎంఎల్ఏ

కామ్రేడ్ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్.ఎస్)

జననం: 06-06-1927

మరణం: 05-09-2024

కుమార్తెలు - అల్లుళ్ళు:

అల్లూరి భారతి (లేటు) - నరసింహరాజు
రిటైర్డ్ ఆంధ్రాబ్యాంక్ మేనేజర్

పొత్తూరి సుశీల - రామకృష్ణంరాజు
రిటైర్డ్ ఎస్.బి.ఐ. క్యాషియర్

వేగేశ్న స్వరాజ్యమాత - కృష్ణమూర్తిరాజు
రిటైర్డ్ ఆంధ్రాబ్యాంక్ మేనేజర్

మనవలు - మనవరాళ్ళు
ముని మనవళ్ళు

ఆర్.ఎస్ గారి సహాయకురాలు
విజయ

మా ఆర్ఎస్ తాతయ్యతో అనుబంధం ఇలా..

తాతయ్య అందర్నీ ఒకేలా చూసేవారు

పెన్మెత్స మాధవి, ఆర్ఎస్ పెద్ద మనవరాలు

ప్రజాశక్తి - భీమవరం

తాతయ్య అందర్నీ ఒకేలా చూసేవారు. ఆడ, మగ అనే తేడా చూపించేవారు కాదు. మేమంతా ఆడుకుంటున్న సమయంలో ఐస్ బండి వస్తే అందరికీ ఐసులు కొనిచ్చేవారు. మాతోపాటు చుట్టుపక్కల పిల్లలు 50 మంది ఉన్న అందరికీ కొనిచ్చేవారు. మమ్మల్ని ఎప్పుడూ ఏమీ అనేవారు కాదు. నాపై ఎప్పుడూ కోప్పడలేదు. తాతయ్య హైదరాబాదు వచ్చినప్పుడు పదేసి రోజులపాటు మా ఇంట్లోనే ఉండేవారు. ఆ సమయంలో తాతయ్యను ఎలా ఉన్నారు.. ఏమి చేస్తున్నారు అని అడిగేదాన్ని. జైల్లో ఎలా ఉండేది తాతయ్య అని ఒకసారి అడిగాను. అప్పుడు చాలా విషయాలు నాకు చెప్పారు. జైల్లో భోజనం అసలు బాగుండేది కాదని చెప్పారు. భోజనం బాగోలేదని ధర్నా కూడా చేశామని తాతయ్య చెప్పారు. అలా చాలా విషయాలు చెప్పుకొచ్చారు. నెల్లూరు ఆస్పత్రిలో తాతయ్య చికిత్స పొందుతుండగా మా చిన్న మనవరాలు పెళ్లి ఉంది.. అప్పటి వరకు నన్ను బతికించండి అని వైద్యులను తాతయ్య అడిగిన తీరు ఎప్పటికీ మరిచిపోలేను.



తాతయ్యకు చేపల కూర అంటే ఎంతో ఇష్టం

భూపతిరాజు సత్యజ్యోతి, ఆర్ఎస్ మనవరాలు

ప్రజాశక్తి - భీమవరం

చిన్నప్పటి నుంచి మమ్మల్ని తాతయ్య ఎంతో బాగా చూసుకున్నారు. మమ్మల్ని అనే కాదు అందరినీ ఒకే విధంగా చూసేవారు. ఎవరింటికి వెళ్లినా పండ్లు తెచ్చి అందరికీ పంచేవారు. అమ్మమ్మ, తాతయ్య ఎక్కువగా అమ్మ వాళ్ల ఇంటికి వచ్చేవారు. కొన్ని రోజులు ఉండి వెళ్తూ ఉండేవారు. తాతయ్య ఆరోగ్యం బాగోలేని సమయంలో మా కుటుంబాలన్నీ తాతయ్యను చూసుకోవడం జరిగింది. అలాగే సిపిఎం నేతలు కూడా దగ్గరుండి తాతయ్య ఆరోగ్య పరిస్థితులను చూసుకున్నారు. సిపిఎం నేతలంతా వచ్చి ఎంతో ఆప్యాయంగా పలకరించి వెళ్లేవారు. ఆరోగ్యం దెబ్బతిన్న దగ్గర నుంచి అంతా బాగానే ఉన్నప్పటికీ చనిపోయే వారం రోజులు ముందు నుంచే తాతయ్య ఇబ్బంది పడ్డారు. చనిపోయే వారం ముందు మా అబ్బాయి తాతయ్యా.. బిర్యానీ తింటావా అని అడిగితే తీసుకురమ్మని చెప్పారు. చికెన్ ఉంటుంది కదా అని అంటే పర్లేదు ఒక పీస్ తింటాను అని చెప్పి తాతయ్య బిర్యానీ తిన్నారు. తాతయ్యకు చేపల కూర అంటే ఎంతో ఇష్టం. చనిపోయే ముందు కూడా చేపలు తింటాను అని అడిగితే నేనే వండి పంపిస్తే పెద్ద చేప ముక్క వేసుకుని భోజనం చేశారు. 'మళ్లీ చేపల కూర పంపించమ్మా అని నాతో చెప్పారు. ఏం భయపడనవసరం లేదు. నేను నూరేళ్లు బతుకుతాను అని చెబుతూనే నాకు 97 సంవత్సరాలు 98, 99, 100 ఇంకా మూడేళ్లేగా బతికేస్తాను' అని చెబుతూనే తాతయ్య ఒక్కసారిగా మమ్మల్ని వదిలివెళ్లడం ఎంతో బాధగా ఉంది.

ఆ రోజు సంఘటన.. ఇంకా కళ్లల్లోనే మెదులుతోంది

కొత్తపల్లి సునీత, ఆర్ఎస్ చిన్న మనవరాలు

ప్రజాశక్తి - భీమవరం

తాతయ్య ఆర్ఎస్ అందరికీ సిపిఎం నేత అయినప్పటికీ నాకు మాత్రం తాతయ్యే. ఎందుకంటే నాతో తాతయ్య అలా ఉండేవారు. నాకు చిన్నప్పుడు జ్వరం వచ్చింది. అప్పుడు తాతయ్య ఎంతో ఏడ్చారు. నేనంటే తాతయ్యకు అంత ఇష్టం. నాకు ఏడేళ్ల వయస్సులో నరసాపురం కోర్టుకు తాతయ్యని తీసుకొచ్చారు. నేను తాతయ్యను చూడడానికి అక్కడికి వెళ్లాను. అప్పటికే తాతయ్యని చూసేందుకు చించినాడ, నర్సాపురం చుట్టుపక్క ప్రాంతాల నుంచి వందలాదిమంది అక్కడికి వచ్చారు. వారందరినీ చూసి తాతయ్య కోసం ఇంతమంది వచ్చారా.. అయ్యబాబోయ్ అనుకున్నా. ఇప్పటికీ ఆ సంఘటన నా కళ్లలో మెదులుతూనే ఉంది. మేము వైజాగ్‌లో ఉంటున్న సమయంలో తాతయ్య మా ఇంటికి వచ్చేవారు. అక్కడకు ఎంతోమంది తాతయ్యని చూడడానికి వచ్చేవారు. వాళ్లంతా తాతయ్య కోసం ఎంతో గొప్పగా చెప్పేవారు. ఇంటికి వచ్చిన వాళ్ల కోసం కూడా తాతయ్య పార్టీ నేతలు అక్కడ అది చేశారు.. ఇక్కడ ఇది చేశారు అని చెబుతూ ఉండేవారు. తాతయ్య లేకపోవడం చాలా బాధగా ఉంది.

నన్ను సొంత మనవరాలిగా చూశారు

రావుల విజయ, ఆర్ఎస్ సేవకురాలు

ప్రజాశక్తి - భీమవరం

2017లో ఆర్ఎస్ తాతయ్య ఇంట్లో వంట చేయడానికి చేరాను. అప్పట్లో తాతయ్య ఆరోగ్యం బాగానే ఉండేది. 2018లో తాతయ్య అనారోగ్యానికి గురయ్యారు. కరోనా సమయంలో తాతయ్యకు అన్నీ నేనే చూసుకున్నాను. నన్ను సొంత మనవరాలిగా చూసేవారు. మా కుటుంబ విషయంలో తాతయ్య అన్ని విధాలుగా సహకారం అందించేవారు. తాతయ్య కుటుంబ సభ్యులు కూడా నా విషయంలో, నా భర్త, పిల్లల విషయంలో పూర్తి సహకారం అందించారు.. అందిస్తున్నారు. ఇంట్లో సామాను, ఆస్తి అంతా నీకే రాస్తాను విజయా.. అని తాతయ్య అంటుండేవారు. పార్టీకి చెందిన వారు ఎవరొచ్చినా మొత్తం విజయకి ఇచ్చేస్తారా అని ఆర్ఎస్‌గారిని ఆట పట్టించేవారు. తాతయ్య రుణం తీర్చుకోలేనిది. ఎంత విసిగించినా పల్లెత్తు మాట అనేవారు కాదు. మీ ఆయన, పిల్లలు వచ్చి ఇక్కడే ఉండిపోండి అని అంటుండేవారు. అటువంటి గొప్ప మనిషి మాతో లేకపోవడం ఊహించుకోలేకపోతున్నాను. ఎవరూ పట్టించుకోని ఈ రోజుల్లో ఎవరో తెలియని నన్ను సొంత మనిషిలా చూడడం తాతయ్య గొప్పతనం.

ఒక దేశం అనేకానేక కుటుంబాల సమాహారం. ఇంట్లో న్యాయం, సమానత్వం సాధించకుండా అవి ప్రజా జీవితంలో మాత్రం వుండాలని ఆశించలేము. ఇంట్లో అణచివేతకు పాల్పడే పురుషుడు వీధిలోకో, చట్టసభల్లోకో, న్యాయస్థానాల్లోకో వచ్చేసరికి హఠాత్తుగా మారిపోయి సాధువు కాలేడు.

- సుబ్రమణ్య భారతి,
రచయిత, సంఘసంస్కర్త.

మా నాన్న ఆర్ఎస్ అంటే..

పెద్ద దిక్కు కోల్పోయాం

పొత్తూరి సుశీల, ఆర్ఎస్ రెండో కుమార్తె

ప్రజాశక్తి – భీమవరం

మేము ముగ్గురు అక్కా చెల్లెళ్లం.. అయినా నాన్న ఇంకో ఇద్దరు ఆడపిల్లలు ఉంటే బాగుండు అనేవారు. ఆడ పిల్లలంటే ఆయనకు ఎంతో ఇష్టం. ఆడ మగ అని తేడా లేకుండా అందర్నీ సమానంగా చూస్తారు. ఎప్పుడూ మేము నాన్న వెంటే ఉండేవాళ్లం. మా కుటుంబానికి నాన్నే అన్నీ. మా కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. మేము దూరంగా ఉన్నప్పటికీ మా బాగోగులు రోజూ అడుగుతుండేవారు. చాలా బాగా చూసుకునేవారు. ఎంతలా చూశారంటే మాటలతో చెప్పలేను. 'నాన్న లేరనే ఆలోచన వస్తుంటేనే తట్టుకోవడం మా వల్ల కావట్లేదు' అంటూ ప్రజాశక్తి వద్ద కన్నీరు మున్నీరయ్యారు.

చివరి వరకూ పార్టీ ఆశయాల కోసమే జీవించారు

వేగేశ్న స్వరాజ్యం మాత, ఆర్ఎస్ మూడో కుమార్తె

ప్రజాశక్తి – భీమవరం

నాన్నను చిన్నప్పటి నుంచి మేము ఏమీ అడిగే వారం కాదు.. ఆయన కూడా మాకు ఏమీ చెప్పేవారు కాదు. కానీ నాన్న మా చిన్నప్పటి నుంచి చివరి వరకు పార్టీ ఆశయాల కోసమే జీవించారు. మా అక్కాచెల్లెళ్ల పెళ్లిళ్లకు నాన్న కాళ్లు కూడా కడగలేదు. మా పెదనాన్న రామరాజు, పెద్దమ్మ అన్నపూర్ణ కాళ్లు కడిగారు. మా పురుడ్లు కూడా మా పెద్దమ్మ, పెదనాన్నలే పోశారు. అయినా మేము ఏమీ అనుకునే వాళ్లం కాదు. ఆయన కూడా ఏమీ అనేవారు కాదు. అయినా మా నాన్నంటే మాకు ఎంతో గౌరవం. మాది ఉమ్మడి కుటుంబం కావడంతో పెదనాన్న వాళ్లు మమ్మల్ని బాగా చూసుకునేవారు. నాన్నను జైల్లో పెట్టినప్పుడు అమ్మ ఎంతగానో ఏడ్చింది. అమ్మ ఎందుకు ఏడుస్తున్నావు.. ఏడవొద్దు అని చెప్పి అమ్మకు ధైర్యం చెప్పేదాన్ని. 2015లో అమ్మ చనిపోయింది. అప్పటి నుంచి నాన్న మా ఇంట్లోనే ఉండేవారు. అమ్మ చనిపోయిన ఐదేళ్ల తర్వాత నాన్న మంచం పట్టారు. అప్పటి నుంచి నాన్నకు అన్నీ నేనే దగ్గరుండి చూసుకున్నాను. నాన్న ఉండడంతో ఎక్కడికీ వెళ్లేదాన్ని కాదు. వెళ్లడం కూడా కుదిరేది కాదు. 1977లో చించినాడ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రత్యర్థులు దాడికి తెగబడ్డారు. నాన్న ఏమో జైల్లో ఉన్నారు. ఇదే అదును చూసుకున్న ప్రత్యర్థులు కత్తులు, కర్రలతో దాడికి సిద్ధమయ్యారు. కనీసం రోడ్ల వెంట కూడా తిరగనిచ్చేవారు కాదు. పంచాయతీ కార్యాలయానికి వెళ్తే రావొద్దని హెచ్చరించేవారు. ఆ సమయంలో జరిగిన ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థి తక్కువ ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అప్పుడు గ్రామస్తులంతా ఆలింగనం చేసుకుని కన్నీటిపర్యంతమయ్యారు. నా భర్త వేగేశ్న కృష్ణంరాజు అంటే నాన్నకు ఎనలేని ప్రేమ. ఎప్పుడూ నాన్న వెంటే నా భర్త ఉండేవారు. నాన్నకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందించేవారు. తండ్రి ఆర్ఎస్ కోసం వివరిస్తూ కుమార్తె స్వరాజ్యం కన్నీటి పర్యంతమయ్యారు.

ఆర్ఎస్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు విస్తరించాలి

బి.గోపీమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజల పక్షాన.. సమస్యల పరిష్కార వేదికగా ఎర్రజెండా నిరంతరం రెపరెపలాడుతూనే ఉంటుంది. అటువంటి ఎర్రజెండా నుంచి పుట్టుకొచ్చిన ఎర్ర సూరీడు ఆర్ఎస్. ఆయన చేసిన ప్రజా పోరాటాలు, ఉద్యమాలు చరిత్రలో ఎప్పటికీ నిలిచే ఉంటాయి. ఆర్ఎస్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను విస్తరించాల్సిన అవసరం, ఆవశ్యకత నేడు ఎంతో ఉంది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రైతులు, కౌలు రైతులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న తీరు అత్యంత దారుణంగా ఉంది. ఈ తరుణంలో వామపక్షాలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు అంతా కలిసి ఐక్యంగా పోరాడాల్సిన సమయం మన ముందుంది. జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో, ప్రజా ఉద్యమాల నిర్మాణంలో ఆర్ఎస్‌తోపాటు ఎంతోమంది కమ్యూనిస్టు యోధులు విశేష కృషి చేశారు. చివరకు ఆర్ఎస్‌తోపాటు అనేకమంది జైలు జీవితం కూడా గడిపారు. అటువంటి మహాయోధులను స్మరించుకోవడమే కాకుండా వారు ఎంచుకున్న లక్ష్యం, వారి ఆశయ సాధన కోసం నిరంతరం పాటుపడాలి. ఆర్ఎస్ లాంటి గొప్ప నేత లేకపోవడం బాధాకరమైనప్పటికీ ఆయన అందించిన సేవలను గమనంలో పెట్టుకుని ఆయన అడుగుజాడల్లో నడిచినప్పుడే ఆర్ఎస్‌కు నిజమైన నివాళులు అర్పించిన వారమవుతాం.

ఆర్ఎస్.. మా మంచి మావయ్య..!

పేరుకే మావయ్య.. తండ్రిలా చూసేవారు

అల్లూరి వెంకట నరసింహరాజు, ఆర్ఎస్ పెద్ద అల్లుడు

ప్రజాశక్తి - భీమవరం

మా మావయ్య ఆర్ఎస్‌కు ముగ్గురు అల్లుళ్లం. పేరుకు మేము అల్లుళ్లమైనా మావయ్య మాత్రం మమ్మల్ని తండ్రిలా చూసేవారు. మాపట్ల మావయ్య వ్యవహరించిన తీరు మరువలేనిది. నేను నరసాపురం కళాశాలలో చదువుతున్న సమయంలో మాజీ ఎంఎల్ఎ ప్రసాద్‌రాజు తండ్రి ఎస్ఎఫ్ఐలో మంచి నాయకుడిగా ఉండేవాడు. ఆ సమయంలోనే ఎన్నికలు వచ్చాయి. అప్పట్లో ఎంఎల్ఎగా ఆర్ఎస్ పోటీ చేశారు. మేము ఉదయం అంతా కళాశాలలో ఉండి సాయంత్రం పూట మావయ్య కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొనే వాళ్లం. ఆయన చిన్న విషయానికే కోప్పడేవారు. ఆ కోపం ఎక్కువసేపు కూడా ఉండేది కాదు. వెంటనే కోపాన్ని మరిచిపోయి సౌమ్యంగా మాట్లాడేవారు. రెండు, మూడుసార్లు నేను ఢిల్లీ వెళ్లాను. అప్పట్లో ప్రస్తుత తెలంగాణ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం క్వార్టర్స్‌కు వెళ్లాను. మావయ్య వీరభద్రానికి చెబితే రెండు, మూడు రోజులు క్వార్టర్స్‌లోనే ఉన్నాను. మావయ్య ఎంఎల్ఎ అయిన తర్వాత నరసాపురం కళాశాలలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వచ్చింది. అప్పట్లో ఎంఎల్ఎగా మావయ్య ఎంతోమందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. అంత గొప్ప వ్యక్తిని మావయ్య అనడం కంటే తండ్రిలానే నేను భావిస్తాను.

మా కుటుంబానికి అన్నీ మావయ్యే

పొత్తూరి రామకృష్ణంరాజు, ఆర్ఎస్ రెండో అల్లుడు

ప్రజాశక్తి - భీమవరం

మా మావయ్య, మేము దగ్గర బంధువులం. మా కజిన్‌ని మావయ్య ఆర్ఎస్‌కు ఇచ్చారు. మా కుటుంబాలకు అన్నీ మావయ్యే చూసుకునేవారు. మావయ్య ఎక్కడికి వెళ్లినా ప్రతిరోజూ ఎక్కడున్నారు, ఏం చేస్తున్నారు అని అడిగి తెలుసుకునేవారు. అన్ని విషయాల్లో అనేక సూచనలు, సలహాలు అందించేవారు. మావయ్య పని మీద వేరే ఊరు వెళ్లిన సమయంలో మా అత్తయ్య మా ఇంట్లోనే ఉండేవారు. అత్తయ్య కూడా మా పట్ల ప్రేమానురాగాలతో ఉండేవారు. ప్రజలకు సేవలందించే నేతగా మావయ్యను చూసి ఎంతో సంతోషించే వాడిని. ఆయన అందరి మన్ననలు పొందారు. గొప్ప మనిషిగా చరిత్రలో నిలిచారు. మావయ్య లేకపోవడం ఎంతో బాధగా ఉంది.

ఆర్ఎస్ అల్లుడా మీరు.. అనేవారు అంతా

వేగేశ్న కృష్ణమూర్తిరాజు, ఆర్ఎస్ చిన్న అల్లుడు

ప్రజాశక్తి - భీమవరం

నాకు పెళ్లి అవ్వక ముందు నుంచి మా మావయ్య ఆర్ఎస్‌తో పరిచయం ఉంది. నేనంటే ఆయనకు చాలా ఇష్టం. పెళ్లయిన తర్వాత నాపై ఇష్టం మరింత పెరిగింది. నేను బ్యాంకులో ఉద్యోగం చేసే సమయంలో బ్యాంకు ఖాతాదారులు, బ్యాంకు ఉద్యోగులు, ఇతరులు అంతా మీరు ఆర్ఎస్ అల్లుడా అనే వారు. నన్ను వాళ్లు ఎంతో గొప్పగా చూసే వారు. నాకు వాళ్లు ఎంతో గౌరవం ఇచ్చేవారు. ఇదంతా మా మావయ్య వల్లే. నాకు అనుకోని రీతిలో ప్రమాదం జరిగింది. ఆ సమయంలో మావయ్య, అత్తయ్య ఏలూరులో నివాసం ఉంటున్నారు. నాకు ప్రమాదం జరిగిందని తెలిసి మావయ్య వెంటనే భీమవరం వచ్చేశారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించేలా ఏర్పాట్లు చేశారు. నేనంటే మావయ్యకు అంత ఇష్టం మరి. మావయ్య ఆర్ఎస్‌కు ఎటువంటి అనుమానం వచ్చినా నన్నే అడిగేవారు. చివరకు ఆర్థికపరమైన అవసరం ఏర్పడినా ఎంతో చొరవతో ఫోన్ చేసి అడిగేవారు.

సహాయకునిగా అవకాశం నా అదృష్టం

జక్కంశెట్టి లోక్‌చరణ్ తేజ

భీమవరం: మాది పార్టీ కుటుంబం కావడంతో చిన్నప్పటి నుండి ఆర్ఎస్ తాతయ్యతో అనుబంధం ఉంది. నన్ను ముద్దుగా పండు అని పిలిచేవారు. మా పట్ల ఎంతో ప్రేమ కనబరిచేవారు. సొంత కుటుంబ సభ్యుడి మాదిరి మా యోగక్షేమాలు ఆయన పట్టించుకునేవారు. వివిధ సందర్భాల్లో ఆయనకు సహాయకుడిగా పనిచేసే అవకాశం లభించడం నా అదృష్టం. ఉమ్మడి రాష్ట్రం వరంగల్‌లో జరిగిన పార్టీ రాష్ట్ర మహాసభలో పాల్గొనేందుకు వెళ్లిన ఆయనకు సహాయకుడిగా వెళ్లాను. ఆర్ఎస్ తాతయ్య నడవడిక, క్రమశిక్షణ, నిబద్ధత చాలా దగ్గరగా చూస్తూ పెరిగాను. నాయకుడు అంటే ఇలానే ఉండాలి అని చాలాసార్లు అనిపించేది. తాతయ్య మరణం నాకు, మా కుటుంబానికి చాలా దుఃఖాన్ని మిగిల్చింది.

ఆదర్శ ప్రజానేత ఆర్‌ఎస్

బి.బలరాం, సిపిఎం ప.గో జిల్లా కార్యదర్శి

ట ఉత్తమ ప్రజా నాయకునికి, కమ్యూనిస్టు నేతకు ఉండాల్సిన అన్ని మంచి లక్షణాలు కామ్రేడ్ ఆర్.సత్యనారాయణరాజు (ఆర్‌ఎస్) గారిలో పుష్కలంగా ఉన్నాయి. సమస్యలపై తనకు తానుగా చొరవతో స్పందించడం, పార్టీ శ్రేణులను ధైర్యంతో.. ఉత్తేజంతో కార్యాచరణలోకి దించడం ఆయనకున్న ప్రత్యేక లక్షణం. అందుకే సమస్యలతో సతమతమయ్యే వివిధ తరగతుల ప్రజల మన్ననలు ఆయన పొందగలిగారు. సమస్యలపై పని చేయాల్సిన కార్యకర్తలు కర్తవ్య నిర్వహణలో నిమగ్నమై కార్యశీలురుగా ఉత్సాహం, ఉత్తేజం పొందేవారు. కష్టాలొచ్చినప్పుడు కుంగిపోకుండా ఆటుపోట్లు తట్టుకునేలా రాటుదేలిన ఆయన కార్యకర్తలను అదే స్ఫూర్తితో రాటుదేలేలా చేశారు. చించినాడ అమరవీరుల స్ఫూర్తితో ప్రారంభమైన ఆయన ఉద్యమ ప్రస్థానం కడవరకూ అదే పంథాలో ఉత్తేజపూరితంగా సాగింది. చించినాడ, కలగంపూడి, కాజ గ్రామాల్లో పేదల పోరాటానికి నాంది ప్రస్తావన నుండి పేదలు తమ ఆత్మ గౌరవాన్ని, హక్కులను నిలబెట్టుకునేలా సాగిన పోరాటంలో పడ్డ కష్టాలు, ఎదుర్కొన్న నిర్బంధం, కేసులు, జైలు జీవితం దీనికి తార్కాణం. కామ్రేడ్ ఆర్‌ఎస్‌తోపాటు కామ్రేడ్ కేతా సూర్యారావు, కామ్రేడ్ పోతురాజు కృష్ణారావు, కామ్రేడ్ మల్లుల వెంకట్రావు, కామ్రేడ్ మల్లుల సత్యం, కామ్రేడ్ పెచ్చెట్టి బాబ్జీ, కామ్రేడ్ తెన్నేటి సంపతరావు, కామ్రేడ్ రుద్రరాజు సూర్యనారాయణరాజు, కామ్రేడ్ పెచ్చెట్టి సత్యనారాయణమ్మ, కామ్రేడ్ గంటా దీనమ్మ, కామ్రేడ్ కేతా చారుమతి, కామ్రేడ్ చింతపల్లి చంద్రరావు, కామ్రేడ్ బూసి శారమ్మ, కామ్రేడ్ బుడితి వజ్రమ్మ, కామ్రేడ్ చిట్టూరి శేషమ్మ, కామ్రేడ్ మునగాల గాంధారి, కామ్రేడ్ వేండ్ర మహాలక్ష్మి వంటి అనేకమంది ఆణిముత్యాలు ఈ పోరాటం నుండే అభివృద్ధి అయ్యారు. ఉద్దరాజు రామం, అల్లూరు సత్యనారాయణ, అన్నే వెంకటేశ్వరరావు, అన్నే అనసూయ, దిగుపాటి సాల్మన్‌రాజు, మహ్మద్‌మీరా, అల్లూరు మన్మోహిని (అమ్మాజీ) వంటివారు ఈ పోరాటానికి, ప్రజలకు నాయకత్వం వహించి దన్నుగా నిలబడ్డారు.

చించినాడ పేదల పోరాటం, అమరవీరుల-బలిదానం, అమరజీవుల కృషి చించినాడను జిల్లాలో, రాష్ట్రంలో ఒక గొప్ప పోరాట గ్రామంగా కొన్ని దశాబ్దాలపాటు ఆదర్శ పంచాయతీగా, ఆదర్శ సొసైటీగా గుర్తింపును పొందేలా నిలబెట్టాయి.

కార్యకర్తలతో ఆప్యాయత, ఇతరులతో మంచి సంబంధాలు

ఎంత పని ఒత్తిడిలో ఉన్నా పార్టీ సభ్యులు, కార్యకర్తల కుటుంబాలతో ఆర్‌ఎస్ ఆప్యాయత, ప్రేమపూర్వక సంబంధాలు నిరంతరం సాగించేవారు. తగు సూచనలు, సలహాలు ఇచ్చేవారు. అవసరమైన సహాయం అందించేవారు. ఈ తీరు ఎంతగానో ఆకట్టుకునేది. కార్యకర్తలకు, కిందిస్థాయి నాయకులకు ఒక భరోసాగా ఉండేది.

ఇతర రాజకీయ పార్టీలు, సంస్థలు, సంఘాలు నాయకులతోనూ స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించేవారు. తాను బాధ్యత చూస్తున్న సిపిఎం సిద్ధాంతం, ఆచరణ, వర్గ దృక్పథానికి ఏమాత్రం భంగం కలగనిచ్చేవారు కాదు. అందుకే ఇతరుల్ని ఆకట్టుకునేవారు. గౌరవం పొందేవారు. ఇతర పార్టీల నాయకులు కూడా ఎంతగానో అభిమానించేవారు.

ఆర్థిక వనరుల సేకరణలో దిట్ట-ఆదర్శ ప్రజాప్రతినిధి

పార్టీకి ఆర్థిక వనరులు సమకూర్చడంలో దాతల నుండి విరాళాల సేకరణలో తాను స్వయంగా ముఖ్యపాత్ర వహించి కార్యకర్తలకు, కిందిస్థాయి నాయకులకు నేర్పేవారు. పార్టీకి ఆర్థిక లోటు లేకుండా నిరంతరం మంచి కృషి చేసేవారు.

ప్రజాప్రతినిధిగా ఎంతో ఆదర్శవంతమైన కృషి చేశారు. చించినాడ గ్రామ పంచాయతీ అధ్యక్షునిగా (సర్పంచి) మొదలు నర్సాపురం ఎంఎల్‌ఎగా, కొంతకాలంపాటు సిపిఎం శాసనసభాపక్ష ఉప నాయకునిగా, నాయకునిగా ఆయన కృషి ఎంతో చెప్పుకోదగ్గది. సమస్యలను సూటిగా ప్రస్తావించడం, చర్చించడంతో నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి దృష్టిని సైతం ఆకర్షించారు. ఆకట్టుకున్నారు.

ప్రజాక్షేత్రంలో డైనమిక్ నాయకునిగా, పార్లమెంటరీ రంగంలో ఆదర్శవంతమైన ఉత్తమ ప్రజాప్రతినిధిగా పేరు తెచ్చుకున్నారు.

జిల్లా పార్టీ నిర్మాణంలో ముఖ్యపాత్ర

జిల్లాలో పార్టీ, ప్రజాసంఘాల నిర్మాణంలో ప్రేరేప మృత్యుంజయుడు, ఎస్ఆర్.దాట్ల, ఉద్దరాజు రామం, అల్లూరు సత్యనారాయణ, అన్నే వెంకటేశ్వరరావు, అనసూయ, దిగుపాటి సాల్మన్‌రాజుతోపాటు ముఖ్యపాత్ర పోషించారు. 1980కు ముందు పాత నర్సాపురం తాలూకాతోపాటు 1980 తర్వాత నిర్మాణ రీత్యా ఏర్పడిన నర్సాపురం-భీమవరం డివిజన్, భీమవరం-తణుకు డివిజన్లలో సిపిఎం నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. శాఖలను, సభ్యులను, కార్యకర్తలను కమిటీలను చురుగ్గా కదిలించడం, క్రియాశీలంగా చురుకైన పాత్ర నిర్వహించేలా, సమరశీలంగా (మిలిటెంట్) ఉద్యమాలు నిర్వహించేలా ప్రోత్సహించడంలో ముఖ్యపాత్ర వహించారు. జిల్లాలో కార్మిక నేతగా ముఖ్యపాత్ర పోషించారు. తదనంతరం పార్టీ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యునిగా జిల్లా పార్టీ, ఉద్యమాల నిర్మాణంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలోనూ ఆర్‌ఎస్ ముఖ్యపాత్ర వహించారు.

రైతు నేతగా..

జిల్లా రైతు ఉద్యమ నిర్మాణంలో ఆర్‌ఎస్ ప్రధాన పాత్రధారి, సూత్రధారి. భోగవల్లి రాజారావు అధ్యక్షులుగా, ఆర్‌ఎస్ కార్యదర్శిగా జిల్లా రైతు ఉద్యమం 1982లో పున:నిర్మాణం జరిగింది. రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సభ్యునిగా పని చేశారు. జిల్లాలో దేవాలయ కౌలురైతులు, పలు అఖిలపక్ష రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. వరదలు, తుపాన్లు సంభవించినప్పుడు, ఉప్పుటేరు, కొల్లేరు, గోదావరి పెరుగులంకల భూములు, ఏజెన్సీ ప్రాంత గిరిజన, గిరిజనేతర పేద రైతులు, పేదల సమస్యలపై జరిగిన ఉద్యమాల్లో ముఖ్యపాత్ర పోషించారు. పాలకొల్లు చక్కెర ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలపై నాటి ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావును స్వయంగా కలిసి ఒప్పించారు. తరువాత కాలంలో చక్కెర మంత్రి పెన్మెత్స సాంబశివరాజుతో యూనియన్ పరంగా ..6లో



పోరాటయోధుడు ఆర్‌ఎస్

సిహెచ్.నరసింగరావు, సిఐటియు
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఆర్‌ఎస్ ఆజానుబాహుడు. ఆయన జీవితం.. వర్గపోరాట సిద్ధాంతాన్ని రంగరించి కాచి వడబోసిన అనుభవాల పుట్ట. ఆర్‌ఎస్‌గారికి పశ్చిమగోదావరి జిల్లా ప్రజాతంత్ర ఉద్యమంలో ఉద్దరాజు రామంగారితో కలసి పని చేసిన నాటి నుంచి వారి అనుభవాలు సముద్రపు అలల్లాగా ఉంటాయి. నేను 80వ దశకం నుంచి పార్టీ రాష్ట్ర కమిటీలోను, సిఐటియు రాష్ట్ర కమిటీల్లో వారితో ప్రత్యక్షంగా పరిచయం ఏర్పడింది. వారి అనుభవాలు పంచుకునే అవకాశం లభించినందుకు నేను గర్వపడుతున్నాను. అందుకే 97వ సంవత్సరంలో ఆర్‌ఎస్‌గారి మరణం బాధాకరం. గత మూడు మాసాల్లో నేను భీమవరం వెళ్లిన మూడుసార్లు ఆర్‌ఎస్ గారిని స్వయంగా చూసి రావడంతో ఆయన పాత స్మృతులు నా మదిలో రీళ్ల లా తిరిగాయి. పశ్చిమగోదావరి జిల్లా ఉద్యమంలోని కార్మిక రంగంలో ఆయనకు సంబంధం లేని రంగం లేదనడం ఆశ్చర్యం కాదు. అన్ని రంగాలకు పునాది వేశారు.

ఆర్‌ఎస్ వర్గ పోరాటాల్లో దిట్ట. జిల్లాలో జరిగిన రెండు ఉద్యమాల గురించి నేను క్లుప్తంగా చెప్పగలను. గతంలో రాష్ట్రంలోనే అత్యంత బలోపేతమైన రైస్‌మిల్లు కార్మికుల ఉద్యమాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో ఉమ్మడి రాష్ట్రంలో అగ్రభాగాన నడిపించడంలో ఆర్‌ఎస్, అల్లూరి గార్లు కృష్ణార్జునులుగా వ్యవహరించారు. ఒకరు ఎత్తుగడలు రూపొందిస్తే, మరొకరు ప్రత్యక్ష పోరాటంలో అర్జునుడి పాత్ర వహించారు. 50 సంవత్సరాల ఆ ఉద్యమం నేటికీ బలోపేతంగా ఉండటానికి వారిరువురు వేసిన పునాదే కారణం. పాలకొల్లు షుగర్ ఫ్యాక్టరీ సంఘ నిర్మాణం నుండి 85వ దశక కాలంలో మూసివేసిన అనంతరం కార్మికులకు నష్టపరిహారం ఇప్పించే వరకు నిరంతరం కృషి చేశారు. తణుకులో సిఐటియు జెండాను నిలబెట్టేందుకు 40 రోజుల సిటీ బస్సుల పోరాటం, అక్కమాంబ, ఎస్‌ఎస్ మిల్లుల్లో యూనియన్ల ఏర్పాటు స్వయంగా ఆయన చొరవ, పాత్ర మరువలేనిది. వేంద్ర డెల్టా పేపర్ మిల్లు యూనియన్ ఏర్పాటులో కార్మిక ఐక్యత కాపాడుతూ అనేక వేతన ఒప్పందాలు, కార్మికుల రోజూవారీ సమస్యలపై కూడా జోక్యం, అనేక ఇతర బాధ్యతల్లో ఉండి కూడా పాల్గొని సమర్థవంతంగా పరిష్కరించిన తీరు స్ఫూర్తిదాయకం. బజారు జట్లు, కొబ్బరి హమాలీ, గొడౌన్ హమాలీ, భవన నిర్మాణ కార్మికుల ఆందోళనల్లో, పోరాటాల్లో చొరవ, పలు సందర్భాల్లో మార్గదర్శకత్వం వహించడంలో, యాజమాన్యాలను ఒప్పించడంలో సమయస్ఫూర్తి వర్గ ఐక్యతను కాపాడేదిగా ఉండేది. రాష్ట్ర రంగాలు ఆర్‌టిసి, అంగన్‌వాడీ, ఆశా, విద్యుత్ వంటి రంగాల్లో జిల్లాలో విస్తరించడానికి 1995 తర్వాత జిల్లాలో ప్రభావితం చేయగలిగిన మొనగాడిగా సిఐటియు ఉద్యమం నడిపించడంలో, యువ కార్యకర్తలను తయారు చేయడంలో ముఖ్యపాత్ర వహించారు. కోఆపరేటివ్ ఉద్యోగుల జిల్లా సంఘం నిర్మాణంలో గౌరవాధ్యక్షులుగా ఉండి జిల్లా అంతా విస్తరించడంలోను, ఇక్కడి నుండే రాష్ట్ర సంఘ నిర్మాణానికి పునాది వేయడంలో ముఖ్యపాత్ర వహించారు. నిరంతరం కార్మికులతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి వాళ్లందరినీ అంచనా కట్టడంలో, దానికి తగిన ఎత్తుగడలు వేయడంలో దిట్టగా జిల్లా కార్మికోద్యమంలో చిరస్థాయిగా ఆయన పాత్ర నిలిచిపోతుంది.

అలాగే చించినాడలో ఆర్‌ఎస్ నాయకత్వంలో భూస్వాములను ఎదుర్కొన్న తీరు సామాన్యం కాదు. దళితులు, పేదల మధ్య ఐక్యతకు చిచ్చుపెట్టి భూస్వాములు పార్టీని దెబ్బతీయడానికి తెగబడ్డ కాలంలో దీనిని ధీరోదాత్తంగా ఆర్‌ఎస్ ఎదుర్కొన్నారు. 60వ దశకంలో పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన పోరాటాల గురించి రాసిన పుస్తకం విజయవాడ డివిఎస్ లైబ్రరీ నుంచి శారద సంపాదించితే చదివాం. ఆ పుస్తకం కావాలని ఆర్‌ఎస్‌గారు అడిగితే నేను రాష్ట్ర కమిటీ సమావేశాలప్పుడు స్వయంగా ఆర్‌ఎస్‌కు అందించాను. నీవు ఎలా సంపాదించావు అని నన్ను ప్రశ్నించారు. ఆర్‌ఎస్‌గారి 90వ దశకంలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు స్వయంగా వచ్చి పశ్చిమగోదావరి జిల్లాలోని మన కుటుంబాల నుంచి వచ్చిన స్టీల్ ఉద్యోగులను పిలిపించి పరిచయం చేశారు. వీరిలో అనేక మంది చురుగ్గా స్టీల్‌ప్లాంట్ యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు. సిపిఎం ఆలిండియా 21వ మహాసభ విశాఖలో జరిగినప్పుడు ఆర్‌ఎస్ స్వయంగా మహాసభకు ముందుగా విశాఖ వచ్చి వారికి తెలిసిన వారితో మహాసభకు అనేక రూపాల్లో సహాయం సమకూరేటట్లు తోడ్పడ్డారు. మాకు తెలియని రైతు రంగంలో ఆయన శేష జీవితమంతా ఆర్‌ఎస్ కృషి చేశారు. ఆందోళన, ప్రచారం, నిర్మాణానికి సంబంధించి అన్ని కోణాల్లోనూ ఆయన నైపుణ్యవేత్త. అందుకే వ్యక్తిగా ఆజానుబాహుడే కాకుండా ప్రజా ఉద్యమాలను ఉన్నతస్థాయిలో నడిపిన మహాయోధుడుగా చరిత్రలో చిరస్థాయిగా ఉంటారు.

ఆదర్శ ప్రజానేత ఆర్‌ఎస్

(5వ పేజీ నుంచి)

చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి ఎంతగానో కృషి చేశారు.

అధికార పక్ష నాయకుడు కాకపోయినా జిల్లాలో సిపిఎం బలం రీత్యా చిన్న రాజకీయ పక్షమే అయినా తన చొరవ, పట్టుదల, అంకితభావం, సమరశీలతతో జిల్లాలో ఒక డైనమిక్ లీడర్‌గా ఎదిగి గుర్తింపుపొందారు. 1989లో తెలుగుదేశం సీట్ల సర్దుబాటుతో సిపిఎంకు నర్సాపురం స్థానం ఖరారైంది. ఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేయడానికి పార్టీ రాష్ట్ర కమిటీ ఖరారు చేసింది. దీంతో ఉలిక్కిపడ్డ నాటి తెలుగుదేశం జిల్లా అగ్ర నాయకత్వం, హేమాహేమీలు ఆఘమేఘాలపై రంగంలోకి దిగి ఎన్‌టి.రామారావు వద్దకు రాయబారం నడిపి ఆ స్థానం సిపిఎంకు కాకుండా రద్దు చేయించారంటే ఆర్‌ఎస్ జిల్లా రాజకీయాలను ఎంత ప్రభావితం చేయగల నాయకుడో అర్థమవుతుంది. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా భూమిలేని పేదల విముక్తి కోసం ఆయన చేసిన ఉద్యమ కృషి ఎంతో ఆదర్శవంతమైనది. సంప్రదాయ, ఘోషా కుటుంబం నుండి వచ్చిన సూర్యాకాంతంను వివాహమాడి ఆమెను కూడా మహిళా ఉద్యమ నాయకురాలిగా ప్రోత్సహించి తీర్చిదిద్దగలిగారు.

పార్టీ కోసం నిరంతర తపన

ఐదు సంవత్సరాలుగా అనారోగ్యంతో ఇంటికే పరిమితమైనా ఆర్‌ఎస్ లాంటి పెద్దదిక్కు లేని లోటు జిల్లాలోని సిపిఎంకు స్పష్టంగా కన్పిస్తోంది. శరీరం సహకరించకపోయినా చివరి వరకు ప్రజల పట్ల, పార్టీ పట్ల, కార్యకర్తల పట్ల, నమ్మిన సిద్ధాంతం, ఆశయం, పట్టిన ఎర్రజెండా పట్ల అచంచలమైన నమ్మకం, దృఢ విశ్వాసంతో ఉన్నారు. తమ్ముని కుమారుడు, చించినాడ మాజీ సర్పంచి ఆర్.సత్యనారాయణరాజు, కుమార్తెలు, అల్లుళ్లు, మనుమలు, ఇతర కుటుంబ సభ్యులు నిరంతరం ఆయన పట్ల ఎంతో ఆప్యాయత, అనురాగం, శ్రద్ధ కనబర్చారు. సహాయకురాలిగా ఉన్న విజయ ప్రత్యేక సేవలందించారు. కలగంపూడి, వైవి.లంక, కాజ, గొంది, చించినాడ కామ్రేడ్స్, రైతుమిత్రులు, వివిధపేటల ప్రజలతో ఆయనది ప్రత్యేక ప్రేమపూర్వక ఉద్యమానుబంధం. జిల్లాలోని కామ్రేడ్స్ అందరితోనూ ప్రత్యేక అనురాగంతో ఉండేవారు. పార్టీ నిర్ణయాలను పట్టుదల, దీక్ష, చైతన్యంతో అమలు చేయడం, వెంటపడి అమలు చేయించడం ఆర్‌ఎస్ ప్రత్యేకత. కామ్రేడ్ ఆర్‌ఎస్ లేని లోటు చించినాడ ఉద్యమానికి, జిల్లా పార్టీకి, ప్రజా ఉద్యమాలకు పూడ్చలేనిది. ఆయన పట్టుదలతో సాగించిన కృషిని అందరం మరింత పట్టుదలతో కొనసాగించడం, ఎర్రజెండాను కాంతివంతంగా, సమున్నతంగా నిలబెట్టడం ద్వారా నిజమైన నివాళులర్పిద్దాం. కామ్రేడ్ ఆర్‌ఎస్‌గార్కి సిపిఎం జిల్లా కమిటీ తరపున అరుణాంజలి.

ప్రజాపునాది నిర్మాణం ఆర్ఎస్ నేర్పిన గొప్ప పాఠం

సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి

కమ్యూనిస్టు పార్టీ క్రమేపీ బలహీనపడుతున్న తరుణంలో సిపిఎంకు బలమైన ప్రజాపునాదిని నిర్మించాలంటే కామ్రేడ్ ఆర్ఎస్‌గారి జీవితమే మనకు గొప్ప పాఠం. ప్రస్తుత పరిస్థితుల్లో కమ్యూనిస్టులు బలహీనపడుతున్నారనుకోవడం కంటే కమ్యూనిస్టులు లేకుంటే దేశం ఏమౌతుందనే ఆలోచించాలని కొందరు మార్క్సిస్టు మేధావులంటున్న విషయం అంతా గుర్తించాలి. ఇందుకు కమ్యూనిస్టులు పెరగడం కమ్యూనిస్టుల కర్తవ్యమే కాదు వామపక్ష ప్రజాతంత్ర శక్తులందరిదీనూ. అందుకు ఆర్ఎస్‌గారి ఆశయాలు, కృషిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లి ప్రజాపునాదిని పెంచడం సిపిఎం శ్రేణుల కర్తవ్యం.

యలమంచిలి మండలం చించినాడ గ్రామాన్ని కమ్యూనిస్టుల కంచుకోటగా తీర్చిదిద్దిన ఫలితంగా 55 ఏళ్లుగా గ్రామ సర్పంచి, సొసైటీ, నీటిసంఘం, విద్యా కమిటీలు అన్నింటినీ సిపిఎం సొంతం చేసుకోగల్గింది. అంతకుమించి గ్రామంలోని వ్యవసాయ కార్మిక, పేద, మధ్యతరగతి రైతులు, దళితులు, బలహీనవర్గాల వారికి బలమైన అండగా పార్టీ నిలవడంలో ఆర్ఎస్ పాత్ర అద్వితీయం.

1950లో నాటి కాంగ్రెస్ పార్టీ, పెత్తందారీశక్తుల్ని గడగడలాడించిన కమ్యూనిస్టుల్ని కనిపిస్తే కాల్చివేసింది. ఈ గ్రామంలో ఐదుగురు అమరవీరులు కాంగ్రెస్ కసాయి తుపాకీ గుండ్లకు బలయ్యారు. ఆ స్ఫూర్తితో విద్యార్థి ఉద్యమం నుండి ప్రారంభమైన ఆర్ఎస్ ఉద్యమ ప్రస్థానం పీడితులకు అండగా నిల్చే ఉద్యమాలకు శ్రీకారం చుట్టింది. గోదావరి పెరుగులంక భూములు జిల్లాలో మిగిలిన అన్ని గ్రామాల్లో పెత్తందారుల చేతుల్లో బందీ అయ్యాయి. చించినాడ గ్రామంలో ఆ భూములు గ్రామంలో పేదలకే దక్కాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో ఆర్ఎస్ నాయకత్వంలో ఉద్యమం సాగింది. వ్యవసాయ కార్మికుల కూలీ రేట్ల పెంపునకు నికరమైన ఉద్యమాలు సాగాయి. ఏటిగట్టు, ప్రభుత్వ రహదారులు పక్కనున్న కొబ్బరి చెట్లు గ్రామ పేదలకే దక్కాలంటూ పోరాడారు. ఇవి గ్రామంలోని భూస్వాములు, పెత్తందారులకు కంటగింపయ్యింది. ఈ ఉద్యమాలను అణచివేయాలనుకున్నారు. సిపిఎంను లేకుండా చేయాలనుకున్నారు. ప్రధాన పాత్రధారులు కామ్రేడ్ ఆర్ఎస్, కామ్రేడ్ కేతా సూర్యారావు, సూర్యనారాయణరాజులను అంతమొందించాలని కుట్రలు పన్నారు. ఆ కుట్రలకు ఐదుగురు కార్యకర్తలు బలయ్యారు. వాటిని ఆర్ఎస్ నేతృత్వంలో శక్తివంతంగా తిప్పికొట్టారు. ఈ తరుణంలో అక్రమ కేసులు బనాయించి, అధికార బలంతో యావజ్జీవ ఖైదు విధించేలా చేశారు. గ్రామాన్ని భీతావాహం చేశారు. తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. దాడులు, అక్రమ కేసులతో అణచాలనుకున్నారు. సమరశీలంగా వారి కుట్రలను తిప్పికొట్టారు. అక్రమ కేసుల నుండి బయటపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా విశాల ఐక్యత, సంఘీభావం కూడగట్టారు. ఫలితంగా గ్రామంలో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. కేసుల నుండి బయటపడ్డారు. గ్రామాన్ని బలమైన ప్రజాపునాది గల కంచుకోటగా తీర్చిదిద్దారు.

పార్టీ కార్యకర్తల్ని తన సొంత కుటుంబంగా చూసుకోవడం, కార్యకర్తల్ని పలుకరించడం, కార్యకర్తల క్షేమ సమాచారాలను తెలుసుకోవడం, కార్యకర్తల కష్ట సమయాల్లో అండగా నిలవడం ఆర్ఎస్‌గారి సహజ నైజం. ఈ లక్షణాలు మనమందరం ఆయన నుండి నేర్చుకోవాలి. అంతకుమించి కార్యకర్తల కుటుంబ సభ్యులందరితో ఆయనకున్న పరిచయాలు, పలకరింపులు, కష్టాల్లో ఓదార్పు, అండగా నిలవడం, తమ కుటుంబ పెద్దగా వారంతా భావించేలా చేసింది. కార్యకర్త అంటే కార్యక్రమాలు చేశాడా, లేదా అనే యాంత్రిక పరిశీలనా ధోరణి నుండి కమ్యూనిస్టులంతా ఓ కుటుంబమనే ఆర్ఎస్ శైలిని అందరం నేర్చుకోవాలి. జిల్లా కార్యదర్శిగా రిలీవయ్యి ఏలూరు నుండి నివాసం వదిలి వెళ్లే సందర్భంలో పట్టణంలో కార్యకర్తలందరికీ భోజనాలు పెట్టి ఆప్యాయంగా పలకరించిన తీరు ఏలూరు సభ్యులు నేటికీ మర్చిపోలేరు.

నా 16వ ఏట 1986లో గోదావరి వరదలకు జిల్లా అంతా ముంపునకు గురైంది. నర్సాపురం తాలూకాలో వరద ముంపు సందర్భంగా ప్రజల పరిస్థితులు, సేవా కార్యక్రమాలను పాలకొల్లు కార్యాలయం నుండి పర్యవేక్షించారు. ఆ తరుణంలో బాధితులకు బియ్యం పంచేందుకు స్టాక్ పాయింట్లుగా పార్టీ కార్యాలయాన్ని కూడా రెవెన్యూ శాఖ ఎంచుకుంది. పట్టణంలో వీవర్స్ కాలనీ, పెద్దగోపురం ప్రాంతాలు మినహా అంతా ముంపునకు గురైంది. రెవెన్యూ శాఖ ప్రాధాన్యతల ప్రకారం పంపిణీ చేసుకుంటూ వస్తోంది. వీవర్స్ కాలనీకి పంపిణీ ఆలస్యమైంది. దాంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఆ బియ్యాన్ని ఆర్ఎస్ అమ్మేసుకుంటున్నాడని నిందా ప్రచారం సాగించారు. ఆయనతోపాటే అక్కడే ఉన్న నేను మనస్తాపానికి గురయ్యాను. 'బాధపడకురా.. ప్రజా జీవితంలో మనం ఉన్నాము. ఇలాంటి నిందలకు కుంగిపోకూడదు. గుండెదిటవు చేసుకొని పని చేసుకుపోవాలి' అని చెప్పారు. నేడు చిన్న చిన్న కారణాలకే, మాటలకే ఉలికిపాటుకు గురవుతున్న వారికి ఆయన మాటలే మార్గనిర్దేశం.

ప్రత్యేకించి ఏలూరు జిల్లా ఏజెన్సీ ఉద్యమాన్ని బలంగా నిర్మించడంలో కామ్రేడ్ అల్లూరు సత్యనారాయణ, కామ్రేడ్ మంతెన సీతారాంతోపాటు కామ్రేడ్ ఆర్ఎస్ పాత్ర గుర్తించదగ్గది. నిర్బంధాల కాలంలో గిరిజనులకు అండగా నిలవడం, ప్రజాప్రతినిధులు, అధికారులను నిలదీసి, నిగ్గదీయడం ఆ ప్రాంత ప్రజల్లో ఆర్ఎస్‌గారిది చెరగని ముద్ర. ప్రత్యేకించి మంతెన సీతారాంగారు రాజమండ్రి జైలులో ఉన్నపుడు ఏజెన్సీ ఉద్యమాన్ని అంటిపెట్టుకుని కంటికి రెప్పలా కాపాడారు. ఆపరేషన్ కొల్లేరు పేరుతో కొల్లేరువాసుల గుండెల్లో బాంబులు మర ఫిరంగుల్లా మోగించినప్పుడు వారికి అండగా నిలబడిన తీరు కొల్లేరు వాసులు మరువలేనిది. నిడమర్రు మండలం బువ్వనపల్లి గ్రామంలో దుకాణాల అక్రమ తొలగింపులోనూ వ్యాపారులకు అండగా నిలిచి, అక్రమ తొలగింపులు అడ్డుకున్న సంగతి నేటికీ తలుచుకుంటూనే ఉంటారు. ఏలూరులో వేలాది మందికి ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు నిర్మించే ఉద్యమాలు, ఇళ్ల స్థలాల పోరాటంలోనూ వెన్నుదన్నుగా నిల్చారు. ఏలూరు జ్యూట్‌మిల్లులో సాగిన పోరాటాలు, ఆ తరుణంలో కొన్ని సంఘాల నుండి తలెత్తిన అరాచక ధోరణులు ఎదుర్కోవడం, కార్యకర్తలకు అండగా నిలవడం నాటి సంఘటనలను కార్యకర్తలు గుర్తు తెచ్చుకుంటుంటారు.

బలమైన వర్గ ఉద్యమాలు, కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకోవడం, అండగా నిలవడం వంటి ముఖ్యాంశాలు ప్రస్తుత కార్యకర్తలు వారసత్వంగా స్వీకరించాలి. తద్వారా పార్టీని బలమైన ప్రజాపునాదిని నిర్మించడమే ఆర్ఎస్ గారికి మనమిచ్చే నిజమైన నివాళి.

విప్లవ పథంలో పయనించే వీరయోధులు ప్రతి పరాజయం నుంచీ కొత్త శక్తిని కూడగట్టుకుంటారు.
చరిత్ర ప్రవాహంలో ఎంతగా ఈదులాడితే మనోధైర్యం అంతగా పెరుగుతుంది.

- కార్ల్ మార్క్స్

కుల సమస్య పరిష్కరించబడాలంటే... బూర్జువా, భూస్వామ్య పాలనను తొలగించి...జనతా ప్రజాస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకుని...సోషలిజం వైపు ప్రయాణం ప్రారంభించాలి.

- బి.టి. రణదివే,
భారత కార్మికోద్యమ నిర్మాత.

అనుకున్నది సాధించే వ్యక్తిత్వం, సౌమ్యవాది

చుండూరి వెంకట్రావు, ప్రముఖ పారిశ్రామికవేత్త, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు

ప్రజాశక్తి - ఆకివీడు

కమ్యూనిస్టు నేత ఆర్ఎస్ అత్యంత సౌమ్యులని, అనుకున్నది సాధించే ధీశాలి అని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు, ఆకివీడు అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, ప్రముఖ పారిశ్రామికవేత్త చుండూరి వెంకట్రావు అన్నారు. తాను ఆకివీడులో మిల్లర్స్ అసోసియేషన్ ఏర్పడిన నాటి నుంచి ఆర్ఎస్‌గారితో సత్సంబంధాలు నెరుపుతున్నానన్నారు. కార్మికులకు, మిల్లర్లకు ఒప్పందం కుదరని పక్షంలో ఆయన మధ్యవర్తిగా వ్యవహరించే వారని, అతి చాకచక్యంగా తక్కువ సమయంలో ఒప్పందం కుదిర్చేవారని చెప్పారు. కార్మికునికి లాభం చూపిస్తూ మిల్లర్‌ను ఏనాడు నష్టపెట్టని విధంగా ఆయన నడుచుకున్నారన్నారు. మంచి మనస్తత్వంతో పక్కవాళ్లతో పని చేయించగల సమర్థుడు ఆర్ఎస్ అని కొనియాడారు. రాజకీయాల్లో ఉండదగిన అంశం అదేనని, అందులో ఆర్ఎస్ అందెవేసిన చేయి అని తెలిపారు.

మా అనుబంధం మరిచిపోలేనిది

ఆర్ఎస్ సహచర ఉద్యమ నేత కేతా సూర్యారావు

ప్రజాశక్తి - యలమంచిలి

కాకలు తీరిన కమ్యూనిస్టు యోధుడు, ఉక్కు సంకల్పధారుడు ఆర్ఎస్ లాంటి మహా నాయకునితో తన అనుబంధం మరిచిపోలేనిదని ఆర్ఎస్ ఉద్యమ సహచర నేత, చించినాడ మాజీ సర్పంచి, మాజీ సొసైటీ అధ్యక్షులు, సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు అన్నారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఆర్ఎస్‌తో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఇద్దరం కలిసి సుమారు 18 నెలలపాటు ఉన్నామన్నారు. 1970వ సంవత్సరానికి ముందు రోజుల్లో కల్లుగీత కార్మికునిగా వృత్తి చేసుకుంటూ జీవనం సాగించేవాడినని తెలిపారు. ఖాళీ సమయాల్లో సాంఘిక నాటకాలు ప్రదర్శిస్తూ కాస్త చురుగ్గా ఉండడాన్ని గమనించిన ఆర్ఎస్ 1970లో తనను పార్టీ సభ్యుడిగా తీసుకున్నారని వివరించారు. అనంతరం గ్రామంలో మరికొంత మంది కార్యకర్తలతో కలిసి 1977-80 మధ్యకాలంలో వ్యవసాయ కార్మికుల కూలీ రేట్లు, లంక భూముల కోసం పోరాటంతోపాటు పార్టీ తరపున పేదలందరికీ చౌక ధరకే బియ్యం విక్రయం వంటి కార్యక్రమాలు చేయడంతో సిపిఎం ప్రతిష్ట మరింతగా పెరిగిందని చెప్పారు. దీన్ని ఓర్వలేని భూస్వాములు గ్రామంలో ఏదోకరూపంలో కవ్వింపు చర్యలకు పాల్పడుతూ గొడవలు సృష్టిస్తూ అధికార బలంతో అనేక మంది నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ నరసాపురం కోర్టుకు తిప్పిస్తుండేవారని తెలిపారు. ఈ నేపథ్యంలో నరసాపురం కోర్టు వాయిదా నిమిత్తం వెళ్లాల్సి ఉండగా అదేరోజు ఆర్ఎస్‌ను హత్య చేయాలని భూస్వాములు పథకం రచించారని తెలిసిందని, దీంతో ఆ రోజు ఆర్ఎస్‌ను వాయిదాకు రాకుండా ఆపివేశామని చెప్పారు. అదే రోజు నరసాపురం బస్టాండ్ సమీపంలో జరిగిన దొమ్మీలో అప్పటి చించినాడ మునసబుతోపాటు మరో వ్యక్తి మరణించిన కేసులో ఎటువంటి సంబంధమూ లేకపోయినా ఆర్ఎస్‌ను మొదటి ముద్దాయిగా, తనను రెండో ముద్దాయిగా, మరో 44 మంది నాయకులపై కేసు నమోదు చేశారని తెలిపారు. దీంతో తామంతా ఆరు నెలలపాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీలుగా శిక్షను అనుభవించిన అనంతరం కోర్టు 1977-80 మధ్యకాలంలో ఆర్ఎస్‌తోపాటు తనకూ జీవిత ఖైదు వేసిందన్నారు. ఆర్ఎస్, తాను జైలులో ఒకే సెల్‌లో ఉండేవారమని తెలిపారు. అన్ని రోజులు కలిసున్నా తాను మాజీ ఎంఎల్ఎఅనిగాని, పెద్ద నాయకుడిని అనిగాని ఆర్ఎస్ ఎటువంటి భేదము చూపించేవారు కాదని, భోజనం ప్లేటు సైతం ఆయనే కడుక్కునే వారని వివరించారు. జైలులో మా ఇద్దరి అనుబంధం చూసిన జైలు అధికారులు, ఇతర ఖైదీలు మీరిద్దరూ అన్నదమ్ముల్లా అని అడిగే వారని, దానికి ఆర్ఎస్ తాము అన్నదమ్ములం కాదు.. అంతకంటే ఎక్కువేనని బదులిచ్చేవారని చెప్పారు.

ఇద్దరికీ కలిపి సంకెళ్లు వేసి కోర్టుకు తీసుకెళ్లేవారు

జీవిత ఖైదు పడి రాజమండ్రి సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో పోలీసులు తమను కోర్టుకు వాయిదాలకు తీసుకెళ్లే సమయంలో ఆర్ఎస్ చేతికి, నా చేతికి కలిపి సంకెళ్లు వేసి తీసుకెళ్లే వారన్నారు. కోర్టు వాయిదా రేపనగా ఒక రాత్రి ముందే జైలు నుండి తీసుకొచ్చి స్థానిక రిజర్వు పోలీసు క్వార్టర్స్ వద్ద స్తంభాలకు కట్టి అమానుషంగా ప్రవర్తించడంతో ఆర్ఎస్ న్యాయవాది ద్వారా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిపై జడ్జి అప్పటి జైలు అధికారికి లెటర్ రాస్తూ 'వాళ్లు దొంగతనాలు, దోపిడీలు చేసి జైలుకు రాలేదు. వాళ్లు కమ్యూనిస్టులు.. వాళ్లను కోర్టు దగ్గర వదిలిపెట్టినా ఇంటికి పోకుండా మరలా జైలుకే వస్తారు. అలాంటి వారికి సంకెళ్లు వేసి అమానుషంగా ప్రవర్తించొద్దు' అని సున్నితంగా మందలించిన ఘటన ఇప్పటికీ గుర్తుందని తెలిపారు.

సెంట్రల్ జైలులో వెలుగులు పూయించిన ధీశాలి

ఆర్ఎస్‌తోపాటు మా అందరికీ శిక్ష పడక మునుపు జైలు గదుల్లో ఖైదీలు కఠిన చీకట్లో ఉంటూ జైలు అధికారులు పెట్టిన నాసిరకం భోజనం చేస్తూ కాలం గడిపే పరిస్థితి ఉండేదన్నారు. ఈ పరిస్థితిని స్వయంగా చూసిన ఆర్ఎస్ అసలు జైలులో ఉండాల్సిన సౌకర్యాలు ఏమిటనే విషయంపై అధ్యయనం చేశారని గుర్తు చేసుకున్నారు. అప్పటి జైళ్ల శాఖ మంత్రి జైలు సందర్శనకు వచ్చిన సందర్భంలో ఖైదీలు అనుభవిస్తున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించిన మర్నాడే జైలు అధికారులు లారీల ద్వారా కిరోసిన్ రప్పించి ప్రతి జైలు గదికి లాంతర్లు పెట్టి దీపాలు వెలిగించడంతోపాటు ఖైదీలకు పెట్టే భోజన మెనూలో భారీ మార్పులు చేశారని, దీంతో అక్కడి ఖైదీల ముఖాల్లో వెలుగులు నిండా యని అన్నారు. దీంతో వారంతా కమ్యూనిస్టుల గొప్పతనం గురించి చెప్పుకునే వారన్నారు.

అరవై ఏళ్ల అనుబంధంలో విశ్రమించడం ఎన్నడూ చూడలేదు

తనకు ఆర్ఎస్‌తో 60 సంవత్సరాల అనుబంధం ఉందని, ఆయన ఆరోగ్యంగా ఉన్నంతకాలం విశ్రాంతి తీసుకోవడంగాని, పగటిపూట నిద్రపోవడం అనేది జీవితంలో ఒక్కసారి కూడా చూడలేదని సూర్యారావు తెలిపారు. అటువంటి ఆదర్శ కమ్యూనిస్టులు అరుదుగా ఉంటారని, అలాంటి నాయకునితో కలిసి పని చేయడం గొప్ప విషయమని చెప్పారు.

నరసాపురం, ఎల్‌బి చర్ల సైకిల్‌పై వెళ్లేవాళ్లం..

మాజీ ఎంఎల్ఎగా ఉమ్మడి నరసాపురం డివిజన్‌కు ఆర్ఎస్ ఇన్‌ఛార్జిగా ఉన్న సమయంలో శాఖా సమావేశం నిర్వహించడానికి ఆర్ఎస్‌ను చించినాడ నుండి నరసాపురం, ఎల్‌బిచర్లకు సైకిల్‌పై తీసుకెళ్లే వాడినన్నారు. అనంతరం నరసా పురం డివిజన్‌కు పార్టీ కార్యదర్శిగా తనను, పాలకొల్లు డివిజన్‌కు వలవల శ్రీరామ్మూర్తిని ఎన్నుకున్నారని, ఆ బాధ్యతకు పూర్తిగా న్యాయం చేయడంతోపాటు చించినాడ గ్రామానికి 8 సంవత్సరాలపాటు సర్పంచిగా, రెండు పర్యాయాలు సుమారు 15 సంవత్సరాలపాటు చించినాడ సొసైటీ ప్రెసిడెంట్‌గా పని చేసే అవకాశం కల్గిందని, దీనంతటికీ ఆర్ఎస్ ప్రోత్సాహమే కారణమని వివరించారు.

ఆర్‌ఎస్ పోరాటాలు స్ఫూర్తిదాయకం

ఆయనను ఆదర్శంగా తీసుకుని యువత రాజకీయాల్లోకి రావాలి

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

ప్రజాశక్తి - భీమవరం

1986లో ఆర్‌ఎస్‌తో నాకు పరిచయం ఏర్పడింది. వయసులో చిన్నవాడినైనా నాకు ఆయనతో మంచి స్నేహ సంబంధం ఏర్పడింది. పేదల పక్షాన ఆర్‌ఎస్ చేసిన అనేక పోరాటాలు నాకెంతగానో స్ఫూర్తినిచ్చాయి. నేను కాంగ్రెస్ పార్టీలో ఉండగా ఆర్‌ఎస్ సిపిఎం నేతగా ఇరువురం అనేక కార్యక్రమాల్లో కలిసి పని చేశాం. కార్మికులకు ఎక్కడ అన్యాయం జరిగినా సిఐటియు ఆధ్వర్యంలో అక్కడ ఆర్‌ఎస్ నిలబడేవారు. నేను మున్సిపల్ కౌన్సిలర్‌గా పని చేసిన సమయంలో మా ప్రాంతంలో ప్రజలు ఎక్కువగా కార్మికులే కావటంతో ఏ చిన్న సమస్య వచ్చినా నేను ఒక ప్రజాప్రతినిధిగా వాళ్ల వెంట వెళ్లేవాడిని. ఆ సమయంలో కార్మికులకు జరిగిన అన్యాయంపై ఆర్‌ఎస్ అధికారులను నిలదీసే తీరు నన్ను ఆకట్టుకుంది. ముఖ్యంగా రైస్‌మిల్లు కార్మికులు, ఎఫ్‌సిఐ కార్మికులు, బజార్ జట్టు కార్మికులకు సమస్య వస్తే అధికారులను ఎలా ప్రశ్నించాలో ఆర్‌ఎస్‌ను చూసి ఆ స్ఫూర్తి నాలో కల్పించింది. నేను ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా పని చేసిన సమయంలో ఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా నేతగా ఉండేవారు. టిడిపి ప్రభుత్వ హయాంలో తాము ప్రతిపక్షంగా ఉన్నప్పుడు ఏదైనా ఉద్యమం చేపట్టాలంటే ఇద్దరం చర్చించుకుని నడిచేవాళ్లం. ఆయన కొన్ని సూచనలు చేసేవారు. ఉద్యమం సమయంలో ఆయన నిర్ణయాలు చాలా గొప్పగా ఉండేవి. ఉద్యమ సమయంలోనే కాకుండా నేను ఎప్పుడు ఎక్కడ కన్పించినా ఆప్యాయంగా పలుకరించి యోగక్షేమాలు అడగడం ఆయనలోని మరో గొప్పతనం. ఏదేమైనా రాజకీయాలకు వచ్చే యువత ఆర్‌ఎస్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి. అలాంటి నాయకుడిని కలవడం, ఆయనతో పని చేయడం గొప్ప అనుభూతి. ఆయన చనిపోయిన రోజున నేను విజయవాడలో ఉన్నాను. ఆ వార్త తెలిసిన వెంటనే చాలా దిగ్భ్రాంతికి గురయ్యాను. ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామం చించినాడ తీసుకెళ్లారని తెలియడంతో అక్కడికి వెళ్లి ఆయన భౌతికయానికి నివాళి అర్పించాను. ఏదేమైనా అలాంటి గొప్ప నాయకుడుని కోల్పోవడం బాధాకరం.

గొప్ప వ్యక్తిత్వం ఆర్‌ఎస్ సొంతం

పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), భీమవరం ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం

సాధారణంగానే కమ్యూనిస్టు నేతలు మంచి వ్యక్తిత్వం కలిగి ఉంటారు. వీరిలో ఆర్‌ఎస్ మాత్రం ప్రత్యేకమైన వ్యక్తి. గొప్ప వ్యక్తిత్వం కలిగిన నేతగా ఆర్‌ఎస్‌కు మంచి గుర్తింపు ఉంది. కమ్యూనిస్టు నేతగా ఆర్‌ఎస్ చేసిన పోరాటాలు అభినందనీయం. పేద ప్రజలు, కార్మికులకు అండగా నిలబడి వారి సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేసేవారు. వివిధ సందర్భాల్లో ఆర్‌ఎస్‌ను కలిశాను. రాజకీయంగా చర్చించడమే కాకుండా వివిధ సమస్యలపై మాట్లాడేవారు. ఆర్‌ఎస్ ఎంఎల్‌ఎగా అనేక సేవలందించారు. సమస్యల పరిష్కారమే అజెండాగా పని చేసి అందరి మన్ననలు పొందారు. ఆర్‌ఎస్ అంటే తెలియని వారెవ్వరూ ఉండరు. ఎందుకంటే ఆయన అందించిన సేవలు అటువంటివి. పేదల కోసం జైలు జీవితాన్ని గడపడం మామూలు విషయం కాదు. అన్ని బంధాలనూ పక్కనపెట్టి ప్రజా ఉద్యమాల్లో జీవించడం ఆయన గొప్పతనం. అటువంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం బాధాకరం. కమ్యూనిస్టు పార్టీకే కాకుండా మిగిలిన అందరికీ, అన్ని పార్టీలకూ ఆర్‌ఎస్ మృతి తీరని లోటు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

ఆర్‌ఎస్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకం

టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఆర్‌ఎస్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకం. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రైతాంగ, కార్మిక, సహకార రంగాల్లో ఉన్నవారి కోసం ఆర్‌ఎస్ కృషి చేశారు. రైతాంగ, యువజన, మహిళ, పలు సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేశారు. కార్యకర్తలను ఆ బాటలో పయనించేలా చేయడంలో ఆర్‌ఎస్ సఫలీకృతులయ్యారు. ఉమ్మడి జిల్లాలో అందరి మన్ననలు పొందిన నాయకుడు. జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని విస్తరింపజేయడంలో శత్రువుల ఆటంకాలు ఎదిరించి ఆర్‌ఎస్ ముందుకు తీసుకెళ్లారు.



రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో స్కూల్ నడిపించేవారు

మల్లుల రామారావు, చించినాడ పోరాట నాయకుడు

చించినాడ గ్రామంలో న్యాయపోరాటం చేస్తున్న మాపై అప్పట్లో శత్రువర్గం పెట్టిన అక్రమ కేసుల ద్వారా రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో నెలల తరబడి ఉన్నాం. ఆ సమయంలో ఖాళీగా ఉంటే ఉపయోగం లేదని మాతో పాటే జైలుకు వచ్చిన సహచర ఖైదీలలో ఒక తెలుగు మాస్టారు, మరో హిందీ మాస్టార్లతో జైల్‌లోనే ఆర్‌ఎస్ స్కూల్ నడిపిస్తూ అప్పటి వరకూ బడి గుమ్మం కూడా తొక్కని నిరక్షరాశులకు అక్షరాలు నేర్పించి, సాహిత్య పుస్తకాలను చదివేలా చేసిన ఘనుడు ఆర్‌ఎస్. జైల్‌లో ఆర్‌ఎస్ ద్వారా ప్రతి ఖైదీకు ఎన్నో రకాల సౌకర్యాలు మొదలయ్యాయి, అది ఆర్‌ఎస్ వల్లే సాధ్యమైంది.

సమస్య ఏదైనా వెంటనే పరిష్కరించేవారు

పి.పూర్ణ, ఐద్వా జిల్లా కార్యదర్శి

ఆర్‌ఎస్‌గారితో మా పరిచయం చిన్నప్పటి నుంచి ఉంది. మా నాన్నగారు పోతురాజు కృష్ణారావు ఆర్‌ఎస్‌గారితో కలిసి పని చేశారు. వారంటే భయం గౌరవం, మర్యాద అన్నీ మా కుటుంబంలో ఉండేవి. ఒకసారి ఆర్‌ఎస్‌గారికి అనారోగ్యం కారణంగా మా నాన్నగారు నెల్లూరులో మూడు నెలలు ఉన్నారు. అప్పుడు నేను, మా తమ్ముడు మా నాన్న కోసం చాలా బెంగ పెట్టుకున్నాం. ఆర్‌ఎస్‌గారు వచ్చిన తర్వాత ఏం పూర్ణ మీ నాన్న కోసం బెంగ పెట్టుకున్నావా అని నన్ను అడిగారు. ఎవరికన్నా అనారోగ్య సమస్యలు వచ్చినా, ఇబ్బందులు వచ్చినా వెంటనే ఆయన స్పందించి వారి కోసం మాట్లాడి పరిష్కరించేవారు. అట్లాంటి నాయకుడిని పోగొట్టుకోవడం చాలా బాధాకరం. నా పెళ్లి కూడా ఆర్‌ఎస్‌గారు పొగాకు నారాయణరావుతో నరసాపురంలో చేశారు. నేను వారిని చేసుకున్న తర్వాత పార్టీలోకి వచ్చాను. మా కుటుంబ విషయాలు అన్నీ తెలుసుకునేవారు. ఆయన ఆశయ సాధన కోసం నేను, మా కుటుంబం ఎప్పుడూ ముందే ఉంటాం.

ఆర్ఎస్ సేవలు ఎనలేనివి

మెంటే పార్ధసారధి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సిపిఎం నేత రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) సేవలు ఎనలేనివి. మార్క్సిస్టు పార్టీలో పనిచేస్తూ అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి మాటల్లో చెప్పలేం. నాకు ఆర్ఎస్‌తో మంచి స్నేహ సంబంధం ఉంది. నేను రాజకీయాల్లో ఎంతో ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించేవారు. రాజకీయంగా కొన్ని సలహాలు, సూచనలు కూడా నాకు ఆయన ఇచ్చారు. రాజకీయంగా ఆర్ఎస్ స్ఫూర్తి అని చెబుతాను. ఆయన ఉన్నతవర్గానికి చెందిన వ్యక్తి అయినా ఎప్పుడూ పీడిత ప్రజల పక్షపాతిగా వారికి అనుక్షణం అండగా నిలుస్తూండేవారు. అధికారపక్ష పార్టీల నుండి ఇబ్బందులు తలెత్తినప్పుడు వాళ్ల కోసం ఆయన చేసిన పోరాటాలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా కార్మికులపై యాజమాన్యాలు ఆంక్షలు పెట్టి వేధింపులకు దిగితే వెంటనే అక్కడ ఆర్ఎస్ ఉండేవారు. క్షణాల్లో అటు యాజమాన్యాన్ని, ఇటు అధికారులను నిలదీసి కార్మికులకు న్యాయం జరిగే వరకూ పట్టువీడని విక్రమార్కుడిలా పోరాటం చేసేవారు. అలాంటి ఆర్ఎస్ ఈరోజు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. ఆయన చనిపోయారని వార్త తెలియగానే ఒక్క క్షణం నిర్ఘాంత పోయాను. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను.

ఆర్ఎస్‌తో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది

యుటిఎఫ్, సిపిఎం సీనియర్ నాయకులు పాదిల కృష్ణమూర్తి



ప్రజాశక్తి - మొగల్తూరు

రుద్రరాజు సత్యనారాయణరాజుతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. నేను 1964లో సిపిఎం ఆవిర్భావం నుంచి కొనసాగుతున్నాను. ఆర్ఎస్ 1967 - 72లో ఎంఎల్ఏగా ప్రజలకు విశేషసేవలు అందించారు. ఆ సమయంలో మొగల్తూరు సమితిగా కొనసాగేది. ఆ సమయంలో నేను యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శిగా పని చేశాను. ఆ రోజుల్లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేసిన మహోన్నత వ్యక్తి ఆర్ఎస్. 1995లో ఉపాధ్యాయ ఉద్యోగ విరమణ అనంతరం నేను పూర్తిస్థాయిలో సిపిఎంలో పని చేశాను. దీంతో మా ఇద్దరి మధ్య అనుబంధం మరింత పెరిగింది. సమితి అనంతరం వచ్చిన మండల వ్యవస్థలో కూడా సిపిఎం మండల కార్యదర్శిగా, పాలకొల్లు, నరసాపురం డివిజన్ సభ్యుడిగా ఆయనతో కలిసి పని చేశాను. పార్టీ విస్తరణకు చేపట్టాల్సిన వ్యూహంపై ఆర్ఎస్ ప్రత్యేకంగా చెబుతుండేవారు. నేను 31 ఏళ్ల యుటిఎఫ్ నాయకుడిగా, రైతు సంఘం జిల్లా నాయకుడిగా పనిచేశాను. నేటికీ సిపిఎం సభ్యుడిగా కొనసాగుతున్నాను. ఆర్ఎస్ ఆఖరి క్షణం వరకూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి. అటువంటి ఆయనను కోల్పోవడం బాధగా ఉంది. సమాజానికి ఆయన లేని లోటు తీరనిది.

చిరస్మరణీయులు ఆర్ఎస్

మాజీ మంత్రి చేగొండి హరిరామ జోగయ్య

ప్రజాశక్తి - పాలకొల్లు

జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమంలో మంచి పేరు తెచ్చుకున్న నేత ఆర్.సత్యనారాయణరాజు (ఆర్ఎస్) చిరస్మరణీయులని మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య అన్నారు. జిల్లాలో అనేక ఉద్యమాలలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొని ముందుకు సాగేవారన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాలు, రైతు, కూలీల పక్షాన నిరంతరం పోరాడేవారని కొనియాడారు. యలమంచిలి మండలంలో బ్యాంక్ కెనాల్ ద్వారా సాగునీరు రావడానికి, అలాగే ఎత్తిపోతల పథకం కోసం ఆయన పోరాటం సాగించారని చెప్పారు. ఆయన మరణం రైతులు, రైతు కూలీలకు తీరని లోటని వ్యాఖ్యానించారు.



అమరజీవి, అజాతశత్రువు ఆర్ఎస్

సారంపల్లి మల్లారెడ్డి

కామ్రేడ్ ఆర్ఎస్‌గా పిలువబడుతున్న ఆర్.సత్యనారాయణరాజు (ఆర్ఎస్) పశ్చిమగోదావరి జిల్లా రైతులకు, ప్రజలకు నాయకులే కాదు. రాష్ట్రవ్యాప్తంగా రైతాంగ, ప్రజాసమస్యలపై ఉద్యమించిన చరిత్ర ఉంది. ఆచంట ఎంఎల్ఏగా ఐదు సంవత్సరాలపాటు శాసనసభలో రైతాంగ సమస్యలేకాక ఇతర వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేశారు. సమస్యలపై ఎవరొచ్చినా వాటిని పరిష్కరించి పంపేవారు. తన వద్దకు వచ్చిన వారిని నమ్రతతో పలుకరించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారు. అఖిల భారత కిసాన్ సభ విడిపోయిన తర్వాత 8వ రాష్ట్ర మహాసభ 1974 ఫిబ్రవరి 9-10 తేదీలో గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన సందర్భంగా నాకు ఆర్ఎస్‌తో పరిచయం ఏర్పడింది. రైతు సంఘం రాష్ట్ర కమిటీలోకి ఎన్నికైన ఆర్ఎస్ వరంగల్ జిల్లా కామ్రేడ్స్‌తో అత్యంత సన్నిహితంగా ఉండేవాడు. జిల్లా ఉద్యమం గురించి చర్చించడమే కాక సలహాలు ఇచ్చారు. జిల్లాలో రైతాంగ సమస్యలపై అనునిత్యం కృషి చేశారు. కొన్ని సంఘటనలను ఈ సందర్భంగా గుర్తు చేయాలి. 'పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం తాలూకా వెంప ప్రాంతంలో ఉన్న అటవీ భూమిని 15 సంవత్సరాల నుండి వెంప-శేరేపాలెం ఫీల్డు లేబరు కోఆపరేటివ్ సొసైటీ' సాగు చేస్తోంది. అందులో నుండి 250 ఎకరాలు బినామీ సొసైటీ రిజిస్టర్ పేరుతో తుమ్మీ సాగుకుగాను పెన్మెత్స సోమరాజు అనే భూస్వామికి ప్రభుత్వం మంజూరు చేసింది. దీనిని ప్రతిఘటించిన 17 మంది వ్యవసాయ కార్మికులను, వారి సానుకూలురును ప్రభుత్వం అరెస్టు చేసింది. తణుకు తాలూకా మినహా మిగిలిన అన్ని గ్రామాల్లో బంజరు సమస్య ఉంది. సాగుకు అనుకూలమైన బంజర్లు, అటవీబంజర్లు, కొల్లేరు బంజర్లు, చెర్వులోతట్టు బంజర్లు ఉన్నాయి. భీమవరం తాలూకా లోసరిగూట్లపాడు ఏరియాలో కరపత్రాలు ద్వారా ప్రచారం, సభలు, ప్రదర్శనలు చేసి తహశీల్దార్ వద్దకు యాత్ర నడిపారు. 1710 ఎకరాలున్న ఒక ప్లాటులో మన సంఘం నాయకత్వాన 400 ఎకరాలు స్వాధీనం చేసుకోగా నిత్యం ఘర్షణలను ఎదుర్కొన్నారు. పది గ్రామాల్లో పట్టాలకు దరఖాస్తులు పెట్టించారు. బంజర్లను కాజేసేందుకు మంత్రి రామలింగరాజు, సోదరి పార్వతమ్మ ఇతర భూస్వాములు, భీమవరం షావుకార్లు తప్పుడు రికార్డులు సృష్టించి కుట్రలు చేశారు. ఈ కుట్రలను బహిర్గతం చేస్తూ ఆర్ఎస్ కౌంటర్ పిటీషన్లు పెట్టించారు. విచారణలో భూస్వాములు, షావుకార్లు, మంత్రి సోదరి తప్పుడు రికార్డులను సంఘం రుజువు చేయించింది. మన సాగుదార్ల పేర్లు రికార్డుల్లో నమోదు చేశారు. దీంతో పెచ్చరిల్లిన భూస్వాములు సంఘ నాయకులపైన, కార్యకర్తలపైన తప్పుడు కేసులు పెట్టారు. నర్సాపురం తాలూకా వెంప, ముత్యాలపల్లి, శేరేపాలెం బంజరును ఫారెస్టు నుండి విడదీసేందుకు ఆందోళన సాగింది. దీని ఫలితంగా బోగస్ సొసైటీలను రద్దు చేయించి పేదల పట్టాలకు ఉత్తర్వులు పొందాం. డ్రెయిన్ల మరమ్మతుల్లో అవినీతి జరగకుండా చర్యలు చేపట్టాలని 1991 నవంబర్‌లో అఖిలపక్ష సదస్సు 600 మందితో జరిగింది. పోలవరం ప్రాజెక్టు చేపట్టాలని మన సొంత చొరవతో రెండు వేల మందిని సమీకరించారు. ఇదే సమస్యపై 'చలో హైదరాబాద్'కు రెండు వేల మంది వెళ్లారు'. ఎన్ని నిర్బంధాలు వచ్చినప్పటికీ నవ్వుతూ కార్యకర్తలను ఉత్సాహపరుస్తూ ప్రవర్తించారే తప్ప ఎప్పుడూ ఉద్యమం నుండి వెనకడుగు వేసింది లేదు. చివరికి శత్రు వర్గాలు కూడా ఆర్ఎస్‌ను అజాత శత్రువుగా భావించేవారు. వ్యవసాయ కార్మికులు, కార్మికులు, మత్స్య రంగంలోని రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ముఖ్యంగా పశ్చిమగోదావరి జిల్లా మహిళా సంఘం అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు. రైతుసంఘ బాధ్యతలపై నేను ఏలూరు, భీమవరం వచ్చిన సందర్భాల్లో వారి ఆప్యాయతను, వారు పలకరించే విధానానికి ముగ్ధులయ్యాను. రాష్ట్రవ్యాప్తంగా రైతుసంఘ బాధ్యతలపై పర్యటించినప్పుడు రాష్ట్ర ఉద్యమం అభివృద్ధి గురించి నాకు అనేక సూచనలు చేశారు.

ఆర్ఎస్ జీవితం అనుసరణీయం

వై.కేశవరావు, కె.ప్రభాకరరెడ్డి,ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

గోదావరి జిల్లా ప్రజలు ఆర్ఎస్‌గా ఆప్యాయంగా పిలుచుకునే సత్యనారాయణగారు రైతు నాయకుడిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ్యుడిగా వివిధ సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేసిన నాయకుడు. పేదల పక్షాన నిలిచి భూస్వాములకు వ్యతిరేకంగ పోరాడిన గొప్ప నాయకుడు. అక్రమ కేసులు, జైలు జీవితం గడిపిన నాయకుడు. శాసనసభలో రైతులు, పేదల పక్షాన గళమెత్తిన నాయకుడు. భారతదేశ ధాన్యాగారంగా పేరొందిన గోదావరి డెల్టాలో ధాన్యం ధరలు పడిపోయిన సందర్భాల్లో ధాన్యం మద్దతు ధర కోసం వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టిన ధీశాలి. గోదావరికి ఏటావచ్చే వరదల సందర్భంగానూ, గుండేరు, తమ్మిలేరు, ఎర్రకాలువ, కొల్లేరు వరదల్లో నష్టపడిన సందర్భంగా రైతాంగాన్ని ఆదుకోవడం కోసం, తడిసిన ధాన్యం కొనుగోలు కోసం ఆయన సాగించిన ఉద్యమాలు, పోరాటాలు స్ఫూర్తిదాయకం. అనుసరణీయం. కొల్లేరు లోపల, ఒడ్డున ఉన్న గ్రామాల ప్రజల హక్కుల కోసం జరిగిన ఆందోళనల్లో ముఖ్యభూమిక పోషించారు. ఎర్రనల్లి సోకి కొబ్బరితోటలు దెబ్బతిన్న సందర్భంలో రైతులకు నష్ట పరిహారం కోసం ఆందోళనలు చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగానూ, ఎఐకెఎస్ సభ్యునిగాను సంఘ అభివద్ధికి ఎంతో తోడ్పాటు అందించారు. అందుకే ఆయన కృషి మరపురానిది. అనుసరణీయమైనది. కామ్రేడ్ ఆర్ఎస్‌గారికి ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం తరపున అరుణాంజలి.



సమరశీలుడు.. ఆర్ఎస్

వి.కృష్ణయ్య, ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు

కామ్రేడ్ ఆర్ఎస్ గారు ఎంత ప్రశాంతంగా ఉంటారో అంత గాంభీర్యంగా ఉంటారు. 1977, 1980 పార్లమెంట్ ఎన్నికల్లో నరసాపురం ఎంపీ స్థానానికి కామ్రేడ్ ఉద్దరాజు రామంగారు పోటీ చేశారు. 1977లో కాకినాడ ఇంజినీరింగ్ విద్యార్థులు కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించాలని రూ.18 వేలు సొమ్ము హాస్టల్‌లో వసూలు చేసుకుని నాతో పాటు నరసాపురం తీసుకొచ్చి సిపిఎం అభ్యర్థికి ఎన్నికల ఫండ్‌గా ఆర్ఎస్‌గారికి అందించారు. కాకినాడ నుంచి వచ్చా మని.. మాకు ఏర్పాట్లు ఎలా ఉన్నాయని ప్రతిపూటా విచారించేవారు. ఎన్నికలు దగ్గరకొచ్చేసరికి సముద్రతీర ప్రాంతం కొత్తపాలెం అనే గ్రామం అనుకుంటా మాకు బాధ్యత పెట్టారు. ఎన్నికల రోజు కాంగ్రెస్‌వారు రిగ్గింగ్‌కు ప్లాన్ చేశారు. వారు దొమ్మిగా రాగానే ఆర్ఎస్ గారు మన వాళ్ల అందరినీ లారీలో పంపారు. సాయంత్రం వరకూ మేము లోపల, వారు బయట తగాదా అలా సాగి రిగ్గింగు జరగకుండా ఆర్ఎస్ ఆపించారు. ఇలాంటి సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవడంలో ఆర్ఎస్‌గారు ఆరితేరినవారు.

ప్రతి ఒక్కరినీ కుటుంబ సభ్యులుగా చూసేవారు

డాక్టర్ రావిగోపాల కృష్ణయ్య, వైద్య సలహా నిపుణులు

ప్రతిఒక్కరినీ తన సొంత కుటుంబ సభ్యులుగా భావించేవారు. చక్కని చిరునవ్వుతో అందరి యోగక్షేమాలు తెలుసుకుంటూ.. కష్టాల్లో ఉన్నారని తెలిస్తే చాలు వెంటనే వారికి అండగా నిలిచేవారు. అలుపెరుగని పోరాట యోధుడు ఆర్ఎస్. తన చివరి రక్తపు బొట్టు వరకూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే తన జీవితాన్ని త్యాగం చేసిన ఆదర్శ కమ్యూనిస్టు నేత. శ్రామిక వర్గ రాజ్యం కోసం అహర్నిశలు కృషి చేసిన పీడిత ప్రజల ప్రియతమ నేత కామ్రేడ్ ఆర్ఎస్ గారికి నివాళులర్పిస్తున్నాను.

ఆర్ఎస్‌తో పనిచేసే భాగ్యం కలిగింది

అరటికట్ల నారాయణమ్మ, ఐద్వా సీనియర్ నాయకురాలు, పాలకొల్లు

పాలకొల్లు కేంద్రంగా ఆర్.సత్యనారాయణ రాజు చేసిన పోరాటాలు ఆదర్శం, ఆయనతో పనిచేసే భాగ్యం నాకు కలిగింది. ఆయన అంతిమ సంస్కారాలు పాలకొల్లులో నిర్వహిస్తే బాగుండేది. నాకు తొంబైమూడేళ్లు, ఆర్ఎస్‌కు తొంబైఏడేళ్లు, ఆయన సెంచరీ చేస్తానని చెప్పారు. కాని ముందే వెళ్లిపోయారు. ఆయనకు చేపల కూర అంటే ఇష్టమని పాలకొల్లులో నాతో వండించుకుని తినేవారు. నాది ఆయనది తండ్రి, కూతురు అనుబంధం. నాకు ఏ పోరాటం అప్పగించినా తూచాతప్పకుండా పూర్తి చేసేదాన్ని. పాలకొల్లులో మహిళల సమస్యలపై ప్రాధాన్యత ఇచ్చేవారు, ఆయన కృషితో మహిళా భవన నిర్మాణం జరిగింది.

ఎంఎల్ఏగా నీతివంతమైన పాలన చేశారు

దిగుపాటి రాజగోపాల్, మాజీ ఎంఎల్ఏ, పాలకొల్లు

జిల్లాలో కార్మిక, రైతు, రైస్‌మిల్లు కార్మికుల సమస్యల పరిష్కారానికి మాజీ ఎంఎల్ఏ ఆర్.సత్యనారాయణ రాజు చేసిన కృషి వర్ణించలేనిది. ఎంఎల్ఏగా ఆయన నీతివంతమైన పాలన అందించారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ఎందరో యువకులు సిపిఎంలో చేరారు. పాలకొల్లు కేంద్రంగా ఆయన ఎన్నో పోరాటాలు చేశారు, నాకు ఆయనతో పాటు కలిసి పనిచేసే అవకాశం వచ్చింది. చించినాడలో భూస్వాములకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం ఆదర్శం. ఆయన లేని పోరాటం అనిర్వచనీయమైంది.

అవిశ్రాంత పోరాట యోధుడు ఆర్ఎస్



మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు

నిత్యం పేదల కోసం అవిశ్రాంతంగా పోరాటం చేసిన యోధుడు ఆర్.సత్యనారాయణ రాజు. అధికార పార్టీకి, సామాన్య ప్రజలకు మధ్య వారధిగావుండి పోరాటాల ద్వారా పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించారు. యలమంచిలి మండలంలోని రైతులకు సాగునీరు అందించేందుకు అనేక పోరాటాలు చేశారు. ఆయన జీవితమంతా పోరాటాల మధ్యనే గడిచింది.

జిల్లాలో ఆర్ఎస్ పోరాటం ప్రత్యేకం

మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్

జిల్లాలో అరుణ పతాకం రెపరెపలాడించి, నిత్య పోరాట యోధుడిగా గుర్తింపు పొందిన వ్యక్తి ఆర్.సత్యనారాయణ రాజు. 92 సంవత్సరాల వయసులో కూడా ప్రజల కోసం పోరాటాలలో పాల్గొనడం ఆయనకే సాటి. పాలకొల్లు, నరసాపురం, భీమవరంలో అనేక పోరాటాలు చేసిన కమ్యూనిస్టులలో ఆర్ఎస్‌ది ప్రముఖ పాత్ర. ఆయన మరణం సిపిఎం పార్టీకే కాదు అన్ని పార్టీలకు తీరని లోటు.

రియల్ హీరో ఆర్ఎస్

జి.రఫాయేలు, సిపిఎం జిల్లా ఆఫీసు ఇన్‌ఛార్జి

నేను కంప్యూటర్ టీచర్‌గా పనిచేస్తుండగా సిఐటియు మాకు సంఘాన్ని ఏర్పాటు చేశారు. నేను దానికి అధ్యక్షునిగా ఉండేవాడిని. కనీస వేతనాలకోసం 2011లో ఉద్యమం చేపట్టాము. నాది వీరవాసరం నేను భీమవరంలో పాల్గొనాలి కాని జిల్లా అధ్యక్షుడివి కాబట్టి ఏలూరులో పాల్గొనాలని నాయత్వం అంటే ఏలూరు వెళ్లిపోయాను. సమ్మె 110 రోజులు జరిగింది. అక్కడ వివిధ సంఘాలతోపాటు సిపిఎం నాయకులు కూడా మా ఉద్యమానికి సంఘీభావం తెలపడానికి వచ్చేవారు. ఆ సమయంలో నేను ఆర్ఎస్ గారిని చూసాను కాని ఆయన ఎవరో నాకు తెలియదు. కంప్యూటర్ టీచర్ ఉద్యమం తర్వాత సిపిఎం భీమవరం డివిజన్ కార్యాలయం ఆఫీసు కార్యకలాపాలు నిర్వహించేందుకు రావాలని నాయకత్వం కోరితే 2012లో వచ్చాను. రెండు నెలల తర్వాత నా చేతికి ఆర్ఎస్‌గారి లైఫ్ హిస్టరీని డిటిపి చేయమని పంపారు. అప్పుడు తెలిసింది ఆయన గురించి హీరోలను సినిమాలోనే చూస్తాం కాని రియల్ హీరో ఆర్ఎస్ అని. అప్పటినుంచి ఆయనకు నేను అభిమానిగా మారిపోయాను.

వారి ఆదర్శంతోనే సిపిఎంలో చేరాను

కొత్త విజయకుమార్, సిపిఎం నాయకులు

మా నాన్న చినముత్యాలరావుతో ఆర్ఎస్‌కు మంచి అనుబంధం ఉండేది. వారిరువురూ డివిజన్ కమిటీలో సభ్యులుగా పనిచేశారు. వారిద్దరూ మంచి మిత్రులుగా మెలిగేవారు. వారి ఆదర్శంతోనే నేను సిపిఎంలోకి వచ్చాను. ఆర్ఎస్ అందించిన స్ఫూర్తితోనే ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు విభాగాల్లో కార్మిక, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేశాను.

కుమార్తెలు, అల్లుళ్లతో ఆర్‌ఎస్

సీనియర్ నేతలు చౌదరి తేజేశ్వరరావు, పాటూరు రామయ్యతో..

తెలంగాణ, ఏపి రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, వి.శ్రీనివాసరావుతో ఆర్‌ఎస్


తెలంగాణా కామ్రేడ్స్‌తో ఆర్‌ఎస్


ఆకివీడు కామ్రేడ్స్‌తో ఆర్‌ఎస్

మాజీ మంత్రి, ఎంఎల్‌ఏ పితాని సత్యనారాయణ ఆత్మీయ పలకరింపు

స్వగ్రామం చించినాడ కామ్రేడ్స్‌తో ఆర్‌ఎస్

ఆర్‌ఎస్ జీవన ప్రస్థానం..

ఆర్‌ఎస్‌కు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు ఆత్మీయ పలకరింపు

ఆచంటలో దీక్షలు విరమింపజేస్తూ..

రాఘవులుతో కలిసి వడివడిగా

ఆకివీడులో డివైఎఫ్ఐ ఆటల పోటీల సభలో ఆర్‌ఎస్

అమరవీరులకు నివాళులర్పిస్తూ..

సహకార ఉద్యోగుల ఆందోళననుద్దేశించి మాట్లాడుతున్న ఆర్‌ఎస్

సీతారాం ఏచూరితో ఆర్‌ఎస్ మాటామంతీ

కార్మిక సంఘం వార్షికోత్సవం సందర్భంగా జెండావిష్కరణలో..

ఆర్‌ఎస్‌కు వి.శ్రీనివాసరావు ఆత్మీయ సత్కారం

సిపిఎం రాష్ట్ర మహాసభల్లో జెండావిష్కరణ

చించినాడ అభివృద్ధిలో..

ఆర్ఎస్ పాత్ర అద్వితీయం

ఆఎస్ హయాంలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకులు

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ గ్రామాన్ని రాష్ట్రంలోనే ఒక ఆదర్శవంతమైన గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడంలో సిపిఎం నేత, మాజీ ఎంఎల్ఎ, మాజీ సర్పంచి రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) కృషి అద్వితీయమని గ్రామస్తులు చెబుతుంటారు. చించినాడ గ్రామానికి 1953 నుండి 1965 వరకు సుమారు 12 సంవత్సరాలపాటు సర్పంచిగా బాధ్యతలు నిర్వహించిన ఆర్ఎస్ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గ్రామాభివృద్ధికి బాటలు వేశారు. గ్రామంలో ఎన్నో ఒడిదుడుకులు, ఆటుపోట్లను ఎదుర్కొని అంచెలంచెలుగా ఎదుగుతూ 1967లో అప్పటి కాంగ్రెస్ నేత పరకాల శేషావతారంపై నరసాపురం ఎంఎల్ఎ స్థానానికి సిపిఎం తరపున పోటీ చేసి విజయం సాధించారు. సిపిఎం నరసాపురం పూర్వపు డివిజన్ ఇన్ఛార్జిగా, ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికైనప్పటికీ పుట్టిన గడ్డను, రాజకీయ ఓనమాలు నేర్పిన సొంత గ్రామాన్ని ఆర్ఎస్ ఎన్నడూ విస్మరించకుండా జీవనం సాగించారు. ఆయన తర్వాత ఆయన సోదరుడు రుద్రరాజు సూర్యనారాయణరాజు, కేతా సూర్యారావు, రుద్రరాజు సత్యనారాయణరాజు (అజంతా రాజు), పెచ్చెట్టి సత్యనారాయణమ్మ సర్పంచులుగా బాధ్యతలు నిర్వరించినా గ్రామానికి ఏమేమి అవసరమో తెలుసుకొని రాజకీయ నేతలతో తనకున్న పరిచయాలు, పలుకుబడిని ఉపయోగించి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు.

ఆర్ఎస్ సర్పంచిగా పని చేస్తున్న కాలంలోనే అప్పటి వరకు ఇతర ప్రాంతాల్లో ఎక్కడా లేనివిధంగా గ్రామానికి నడిబొడ్డున ఎంతో సుందరంగా పంచాయతీ భవనాన్ని నిర్మింపజేశారు. గ్రామం అభివృద్ధి చెందాలంటే దానికి తగిన వనరులు సమకూర్చుకోవాలనే సంకల్పంతో ఆర్ఎస్ ఆధ్వర్యంలో గ్రామంలోని ఆర్అండ్బి రహదారుల వెంబడి, పంచాయతీ పోరంబోకు స్థలాలు, చెరువుగట్టు వెంబడి ఆయన హయాంలోనే వందలాది కొబ్బరి మొక్కలు నాటించారు. దీనిద్వారా ప్రస్తుతం చించినాడ గ్రామ పంచాయతీకి ఏటా లక్షలాది రూపాయలు ఆదాయం సమకూరుతుందంటే అది ఆర్ఎస్తోపాటు తదనంతరం సర్పంచిగా పని చేసిన ఆయన

పంచాయతీ ఆదాయం కోసం గట్లపై నాటిన కొబ్బరి చెట్లు

సోదరుడు రుద్రరాజు సూర్య నారాయణరాజు కృషి ఫలితమేనని గ్రామస్తులు చెబుతారు.

లంక భూముల పంపిణీతో పేదల జీవితాల్లో వెలుగులు

ఆర్ఎస్ హయాంలో చించినాడ గ్రామంలో అప్పటివరకు సెంటు భూమి కూడా లేని నిరుపేదలు సుమారు 300 మందికి 60 ఎకరాల లంక భూములను పంపిణీ చేయించి ప్రభుత్వం ద్వారా పట్టాలు మంజూరు చేయించడంతో పేద కుటుంబాలకు భరోసా దొరికింది. దీంతో ఆ భూముల్లో ఇతర పంటలు, ఫలసాయాలు పండించుకోవడం ద్వారా సగర్వంగా బతికే పరిస్థితి ఏర్పడింది.

సామాజిక భవనాల నిర్మాణంతో బడుగు, బలహీన వర్గాల్లో ఆత్మస్థయిర్యం

అప్పట్లో చించినాడ గ్రామంలో దళితులు, బిసిలు నివశించే ప్రాంతాల్లో కుల సంఘాలు పెట్టుకుని మాట్లాడుకోవడానికి కూడా అవకాశం లేని పరిస్థితులున్న నేపథ్యంలో ఆర్ఎస్ కృషి ఫలితంగా పెదపేట, శెట్టిబలిజపేట అరుంధతీపేట, విప్పర్తివారిపేట, ఆర్లపాడు పేటల్లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఎంపీలుగా ఉన్న వై.రాధాకృష్ణమూర్తి, చేగొండి హరిరామజోగయ్య ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో లక్షలాది రూపాయల నిధులతో ఆయా సామాజిక భవనాలను నిర్మించారు. దీంతో ఆయా ప్రాంత ప్రజల్లో ఆత్మస్థయిర్యం పెరిగింది.

చించినాడకు రేవును సాధించడంలో ఆర్ఎస్ కృషి అమోఘం

చించినాడ గ్రామానికి చెందిన గోదావరి రేవు పాట తూర్పుగోదావరి జిల్లా దిండి గ్రామానికి చెందినదిగా ఉండటంతో అది చించినాడ గ్రామానికి చెందాలని అప్పటి సిపిఎం ఎంపీ ఉద్దరాజు రామం ద్వారా గట్టి ప్రయత్నం చేశారు. ఆ రేవును చించినాడకు తెచ్చుకోవడంతో రేవుపాట ద్వారా చించినాడకు మంచి ఆదాయం లభిస్తోంది. ఆ ఆదాయంతో అప్పటి వరకు మండలంలో ఎక్కడా లేనివిధంగా చించినాడ గ్రామంలోని అన్ని ఏరియాల్లో సీసీ రోడ్లు నిర్మించి గ్రామాన్ని రాష్ట్రంలోనే ఒక రోల్మోడల్గా తీర్చిదిద్దారు. దీంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అయితే తదనంతర కాలంలో చించినాడలో గోదావరిపై బ్రిడ్జిని నిర్మించడంతో ఆ ఆదాయానికి గండి పడింది.

అరుంధతీ పేటలో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనం

గ్రామస్తుల దాహార్తిని తీర్చిన మహానుభావుడు

గోదావరి చెంతనే ఉన్న తాగునీటికి మాత్రం కటకటలాడే ప్రాంతంగా చించినాడ సతమతమయ్యేది. ఈ తరుణంలో ఆర్ఎస్ అప్పటి ఎంపీలు చేగొండి హరిరామజోగయ్య, యువి.కృష్ణంరాజుల నిధులు, మ్యాచింగ్ గ్రాంట్లు తీసుకొచ్చి, గ్రామంలోని పెదవర్మ, చినవర్మ, ఇతర రైతుల నుండి ప్రజా విరాళం కట్టించి సుమారు రూ.50 లక్షలతో గ్రామానికి సరిపడా రెండు ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మింపజేశారు. తద్వారా గ్రామ ప్రజల దాహార్తిని తీర్చారు. మొత్తంగా పరిశీలిస్తే చించినాడ గ్రామాభివృద్ధిలో ఆర్ఎస్ పాత్ర అద్వితీయమైనదని ఘంటాపథంగా చెప్పొచ్చు.

ఆలోచనల యుద్ధంలో పుస్తకాలే సలైన అస్త్రాలు

-జార్జి బెర్నార్డ్ షా

హింస ప్రతిహింసకు దారితీస్తుంది. అందుచేత పరమత సహనం కావాలి. మతాన్ని అనుసరించడం, అనుసరించకపోవడం ప్రజల ఇష్టాయిష్టాలకు వదిలి వేయాలి.

-పీరీ బాయల్, ఫ్రెంచ్ తత్వవేత్త, రచయిత





నేటి, భవిష్యత్ తరాలకు ఆర్‌ఎస్ రోల్ మోడల్

వి.ఉమామహేశ్వరరావు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, విజయవాడ

గత తరానికి, నేటి తరానికి, భవిష్యత్ తరానికి ఆర్‌ఎస్ సిద్ధాంతం రోల్ మోడల్. విద్యార్థి దశ నుంచే నమ్మిన సిద్ధాంతం కోసం అలుపెరగని పోరాటం చేశారు ఆర్‌ఎస్. చించినాడలో నేటికీ వందమంది పార్టీ సభ్యత్వం ఉందంటే ఆయన గొప్పతనమే. 50 ఏళ్లపైగా గ్రామంలో సహకార బ్యాంకులో, పంచాయతీ పాలనలో కమ్యూనిస్టులు ఉన్నారంటే ప్రజలతో మమేకమై పార్టీ నిలబడడంతో ఆర్‌ఎస్ పాత్ర ఎంతో ఉంది. మానవత విలువలు కమ్యూనిస్టులే ఎక్కువ పాటిస్తారు. ఆర్‌ఎస్ మృతికి సిఐటియు రాష్ట్ర కమిటీ తరఫున సంతాపం ప్రకటిస్తున్నాను. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

ఉద్యమాల్లో సమయస్ఫూర్తిగా ఉండేవారు

కర్రి నాగేశ్వరరావు

కామ్రేడ్ ఆర్‌ఎస్ కార్యకర్తలకు కష్టంవస్తే కుటుంబంలోని తండ్రిలా చలించిపోయేవారు. ఆయన ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా ఉన్నప్పుడు నేను జిల్లా కమిటీ సభ్యునిగా ఎన్నిక అయ్యాను. సమస్యల పరిష్కారం పట్ల, ఉద్యమాలలో సమయస్ఫూర్తిగా వ్యవహరించేవారు. కార్యకర్తలను చైతన్యం చేసేవారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని రైస్‌మిల్లు కార్మికుల సమస్యల సందర్భంగానూ, గణపవరం మండలంలోని కేశవరం ఇళ్ల స్థలాల సమస్య సందర్భంగానూ ఆయనతో ప్రత్యక్షంగా పాల్గొన్నాను. ఆర్‌ఎస్‌గారు కార్యకర్తల కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకునేవారు. జిల్లాలో ఒక పెద్ద దిక్కును కోల్పోయాము.

మహిళలను ప్రోత్సహించిన నేత ఆర్‌ఎస్

గారపాటి విమల, రిటైర్డ్ టీచర్, సీనియర్ ఐద్వా నాయకులు

మహిళలపై అపార గౌరవం, మహిళా నమన్యలం, వారి ఉద్యమాలకు వెన్నంటి వుండి ప్రోత్సహించే పితామహుడు ఆర్‌ఎస్ గారు. ఆయన జీవితకాలంమంతా ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ ఆర్‌ఎస్ గారికి నివాళులు అర్పిస్తున్నాను.

అలుపెరుగని పోరాట యోధుడు ఆర్ఎస్

మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

అలుపెరుగని పోరాట యోధుడు, ఉద్యమ నేత రుద్రరాజు సత్యనారాయణ (ఆర్ఎస్) అని, ఆయన మృతి బాధాకరమని ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉన్నా వెరవకుండా శ్రామిక, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆర్ఎస్ కృషి చేసేవారన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా ప్రజలకు అండగా నిలిచేవారని కొనియాడారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ధర్నాలు, దీక్షలు చేపట్టి అలుపెరగని పోరాటం చేసేవారన్నారు. వారి కుటుంబంతో తమ తల్లిదండ్రులు మంచి బాంధవ్యాలు కలిగి ఉండేవారన్నారు. తాను ఏ పార్టీలో ఉన్నా ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు తనతో చర్చించేవారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన యోధుడు ఆర్ఎస్ అని కొనియాడారు. కేసులు, పోలీసులతో అనేక ఇబ్బందులు ఏర్పడినా వెరవకుండా ధైర్యంతో కమ్యూనిస్టు ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించిన మహనీయుడని అభివర్ణించారు. పీడిత ప్రజలకు అండగా నిలబడి వారి సమస్యల పరిష్కారంలో ఆర్ఎస్ కృషి అభినందనీయమన్నారు. మంచి మనిషిని కోల్పోవడం బాధాకరంగా ఉందని చెప్పారు.

ఆర్ఎస్ అందరికీ ఆదర్శప్రాయులు

ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఆర్ఎస్ అంటే ఒక చరిత్ర. ఆయన చేసిన పోరాటాలు, ఉద్యమాలను ఆదర్శంగా తీసుకోవాలి. ఆయన చివరి శ్వాస వరకూ బడుగు, బలహీన వర్గాల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారు. ఆర్ఎస్ నమ్మిన సిద్ధాంతం కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం విశేష కృషి చేశారు. ఆయనలాంటి వారు అరుదుగా ఉంటారు.

ఆదర్శ నేత ఆర్ఎస్

తోట సీతారామలక్ష్మి, మాజీ ఎంపీ, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు

ప్రజాశక్తి - భీమవరం

నాటి తరానికే కాదు.. నేటి తరానికీ సిపిఎం సీనియర్ నేత రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) ఆదర్శ నేత. నేను రాజకీయాల్లోకి రంగప్రవేశం చేయకముందే ఆర్ఎస్ కమ్యూనిస్టు నేతగా తెలుసు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత అనేక సందర్భాల్లో ఆర్ఎస్‌ను కలిశాను. ఆప్యాయంగా పలకరించటమే కాకుండా మంచి మర్యాదలకు ఆర్ఎస్ పెట్టిన పేరు. ఎప్పుడూ ప్రజల పక్షాన వారి సమస్యల పరిష్కారం కోసమే ఎక్కువగా మాట్లాడుతుండేవారు. నేను మున్సిపల్ ఛైర్‌పర్సన్ అయిన తర్వాత కూడా అనేక సందర్భాల్లో సమస్యలపై ఆర్ఎస్‌తో మాట్లాడటం జరిగింది. ఆయన విలువైన సూచనలు, సలహాలు ఇస్తుండేవారు. భీమవరంలోని సమస్యలపై చర్చించేవారు. కార్మికులకు, రైతులకు, సామాన్య ప్రజానీకానికి ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వారికి అండగా నిలబడి ఆ ఇబ్బందుల్లో తొలగించడంలో చురుకైన పాత్ర పోషించేవారు. నీతి నిజాయతీ నిబద్ధత కలిగిన నేత ఆర్ఎస్. అటువంటి మహోన్నతమైన వ్యక్తి లేకపోవడం అత్యంత బాధాకరం. ఆర్ఎస్ మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

మహోన్నత వ్యక్తి ఆర్ఎస్

వేగేశ్న కాశీ విశ్వేశ్వరరాజు (అభిరుచి కాశీ)

ప్రజాశక్తి - కాళ్ల

బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహోన్నత వ్యక్తి రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్). అతి చిన్న వయసులోనే ప్రజా సమస్యలను అవగాహన చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసిన వ్యక్తి ఆర్ఎస్. ఆయన ఉద్యమ నాయకుడిగా ఉనప్పుడు ఎక్కువమంది యువత కమ్యూనిజం వైపు ఆకర్షితులై చేరారు. ఆయన పార్టీకి పునాది వేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఇప్పటి వరకు పార్టీ పటిష్టంగా ఉంది. ప్రస్తుతం ఆయన శిష్యులు మంతెన సీతారాం, బి.బలరాం వంటివారు అగ్ర నాయకులుగా ఉన్నారు.

పోరాటయోధుడు ఆర్ఎస్

వేగేశ్న రామకృష్ణంరాజు (శ్రీఅభిరుచి రామకృష్ణంరాజు)

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజల కోసం కష్టపడే వ్యక్తి ఆర్ఎస్. అటువంటి పోరాట యోధుడిని కోల్పోవడం అత్యంత బాధాకరంగా ఉంది. పేద ప్రజల కోసం నిరంతరం పనిచేసిన వ్యక్తి ఆర్ఎస్. పార్టీకి ఆయన చేసిన కృషి మాటల్లో వర్ణించలేం. ఆర్ఎస్‌ను ఆదర్శంగా తీసుకుని వారి ఆశయ సాధన కోసం సిపిఎం నాయకులు కృషి చేయాలి.

మహిళా ఉద్యమాలకు ఆర్ఎస్ వెన్నుదన్ను

పెచ్చెట్టి సత్యనారాయణమ్మ, చించినాడ గ్రామ మాజీ సర్పంచి

చించినాడ గ్రామంలో 1977–1980 మధ్యకాలంలో భూస్వాములపై పేదలు పోరాటం సాగించిన సమయంలో గ్రామంలోని మగవారంతా జైళ్లల్లోనూ, అజ్ఞాతంలోనూ ఉన్న సమయంలో ఆర్ఎస్ మహిళలకు వెన్నుదన్నుగా నిలిచారు. అనసూయమ్మ లాంటి మహిళా నేతలను చించినాడ గ్రామానికి పంపించి మహిళలకు చైతన్యం నింపడంతోపాటు పోరాటాల్లో వెనకడుగు వేయకుండా ధైర్యం నింపడమే కాకుండా ఎవరికీ ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఆదరించే వారు. మొదటి నుంచి మా తల్లిదండ్రులది కాంగ్రెస్ పార్టీ నేపథ్యం కలిగినప్పటికీ గ్రామంలో ఆర్ఎస్ పేద ప్రజల పక్షాన నిలిచి ఎన్నో మంచి పనులు చేయడం ద్వారా కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితురాలినయ్యాను. అన్ని పోరాటాల్లోనూ మిగతా మహిళా నేతలతో కలిసి ఎంతో చురుగ్గా పాల్గొనడం వంటి విషయాలను పరిగణనలోకి తీసుకుని గ్రామంలో ఎప్పుడూ జరగని విధంగా సర్పంచి పదవిని ఏకగ్రీవం చేసి నన్ను సర్పంచిగా చేయడంలో ఆర్ఎస్ఎస్ కీలకపాత్ర వహించారు. దాని ద్వారా గ్రామంలో నా హయాంలో ఎన్నో అభివృద్ధి పనులు చేయడానికి అవకాశం లభించింది.

పోరాట యోధుడు ఆర్ఎస్

పి.మధు, మాజీ ఎంపీ, సిపిఎం పూర్వపు రాష్ట్ర కార్యదర్శి

కామ్రేడ్ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) మంచి పోరాటయోధుడు. మంచి స్నేహశీలి. అలుపెరుగకుండా జీవితాంతం ఎంతో సాహసంతో ఉద్యమాన్ని నడిపిన నాయకుడు. ఉన్నత కుటుంబంలో పుట్టినా అహర్నిశలు పేదల కోసం పోరాడిన యోధుడు. జైలు జీవితంలోగాని, నిర్బంధాల్లోగాని పార్టీని ధీరోదాత్తంగా ముందుకు నడిపిన నాయకుడు. నాకు అత్యంత ఆప్తుడు. రాజకీయంగాను, వ్యక్తిగతంగాను ఎన్నో సందర్భాల్లో భావాలు పంచుకున్నప్పుడు ఎంతో ఉత్తేజాన్ని ఇచ్చే అంశాలు గుర్తున్నాయి. రాజమండ్రి జైల్లో ఉన్నప్పుడు మోటూరు హనుమంతరావుగారు ఆర్ఎస్ గారిని చూసి కన్నీళ్లు పెట్టుకున్న సందర్భం గుర్తుంది. ఆర్ఎస్‌గా పిలవబడే ఈ కామ్రేడ్ కమ్యూనిస్టుపార్టీ నిర్మాణంలో చూపే నిబద్ధత పలువురు కామ్రేడ్స్‌కు మార్గనిర్దేశకం వంటిది. ఆయనకు నేను, నా కుటుంబం తరపున తలొంచి శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం.

కమ్యూనిస్టు సవ్యసాచి.. కామ్రేడ్ ఆర్ఎస్

మంతెన సీతారాం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

'పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది' తెలుగు సామెత ఇది. అందరి విషయంలో ఈ సామెత వర్తించదు. కొందరి విషయంలోనే వర్తిస్తుంది. ఆర్ఎస్ ఈ కోవకు చెందిన వారు. ఆయన ఉద్యమ తొలి జీవితం పరిశీలిస్తే ఎవరికైనా ఇదే అభిప్రాయం కలుగుతుంది. చిన్ననాటి నుంచి అన్యాయాలు, అక్రమాలు సహించని మనస్తత్వం. నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా స్పందించేతత్వం ఆర్ఎస్‌గారిది. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా పేదల పక్షపాతిగా జీవితాంతం స్పందించి పోరాడిన కమ్యూనిస్టు నేత ఆర్ఎస్. 1950లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్ఎస్ స్వగ్రామం చించినాడలో ఐదుగురు కమ్యూనిస్టులను అమానుషంగా కాల్చి చంపింది. ఈ ఘోర ఘటన ఆర్ఎస్‌ను తీవ్రంగా కలిచివేసింది. కమ్యూనిస్టు కావాలని ప్రేరేపించింది.

పార్టీకి వయస్సు ఎక్కువ చెప్పి 17 ఏళ్లకే పార్టీ సభ్యత్వం పొందారు. ఆ రోజుల్లో ఇంటర్ చదివారు. ఉద్యోగం కోసం ఆలోచించకుండా ఉద్యమం కోసం ఆలోచించి పార్టీ పూర్తి కాలం కార్యకర్తగా పని చేయడం ప్రారంభించారు. 80 ఏళ్లపాటు పూర్తికాలం కార్యకర్తగానే కొనసాగారు. ఆర్ఎస్ అంతిమయాత్రలో చించినాడ యువకులు పెద్దఎత్తున పాల్గొని 'చించినాడ చేగువేరా' అని గ్రామమంతా నినదించారు. అవును ఆర్ఎస్ 'చించినాడ చేగువేరా' అనడంలో అతిశయోక్తి లేదు. ఎందుకంటే 'దొడ్డిపట్ల ఫిర్కా' ప్రాంత ఆర్గనైజరుగా ఆయన పనివిధానం అలాగే ఉండేది. గ్రామగ్రామాన వర్గ ఉద్యమాలను ప్రజ్వరిల్లింపజేయడంలో సమరశీల యువనేతగా సమర్థనేతగా ఎదిగారు.

విద్యార్థి నేతగా ఉన్న కాలంలోనే చదువుపై కన్నా, ఉద్యమాలపైనే ధ్యాస చూపించారు. చదువు చాలించి కమ్యూనిస్టు ఉద్యమంలోకి వెళ్లాలనే తపనతో ఉండేవారు. ఆర్ఎస్ ఉద్యమ ప్రస్థానం.. ఉత్సాహపూరితం.

ఉత్తేజితం

జీవిత చరమాంకంలో చివర ఐదు సంవత్సరాలు మినహా 75 సంవత్సరాలు రేయింబవళ్లూ పార్టీ, ప్రజా ఉద్యమాలే శ్వాసగా, ధ్యాసగా పని చేశారు. పార్లమెంటరీ, పార్లమెంటరీయేతర కార్యక్రమాలు రెండింటిలో ప్రతిభావంతుడిగా నిరూపించుకున్నారు. అనేక ప్రజా ఉద్యమాల్లో రాటుదేలిన ఆర్ఎస్ జైళ్లు, నిర్బంధాలను సైతం లెక్క చేయకుండా విజయపథం వైపునకు దూసుకుపోయేవారు. 75 ఏళ్ల ఉద్యమ జీవితంలో ఎన్నో కష్టాలు, బాధలు అనుభవించినా ఎప్పుడూ నిరాశ, నిస్పృహలను దరి చేరనీయలేదు. 'స్థితప్రజ్ఞుడు'గా పార్టీ కార్యకర్తలు, సహచరుల మన్ననలు పొందారు.

ఆర్ఎస్‌లోని ఉత్తమ కమ్యూనిస్టు లక్షణాలు, ఉద్యమాల నిర్మాణంలో ప్రతిభాపాటవాలు, పనిశైలిని జిల్లాలోని పార్టీ, ప్రజారంగాల కార్యకర్తలు అలవర్చుకుని పార్టీని, ప్రజాఉద్యమాలను అభివృద్ధి చేయడమే ఆర్ఎస్‌కు నిజమైన నివాళి.

కామ్రేడ్ ఆర్ఎస్ నాకు రాజకీయ గురువు

సిపిఎం సీనియర్ జిల్లా నేత జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి – వీరవాసరం

1977 నుంచి కామ్రేడ్ ఆర్ఎస్‌గారు నాకు రాజకీయ గురువు. సిపిఎంలో ఎలా పని చేయాలో వారి వద్దే నేర్చుకున్నాను. నిస్వార్థంగా, నిజాయతీగా ప్రజా సమస్యలపై ఎలా పని చేయాలో బోధించేవారు. పార్టీలో ఆయన పని చేస్తూ కామ్రేడ్స్‌తో పని చేయించేవారు. సిపిఎంలో పని చేసే ప్రతి కార్యకర్తకూ ఆయన రోల్ మోడల్. క్రమశిక్షణతో పని చేయడం, సమయపాలనతో పని పూర్తి చేయడం ఆయన ప్రత్యేకత. ఆయన ఆలోచనలు నేటి తరం నాయకులు అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏదైనా సమస్య తీసుకుంటే దానిపై ఎలా పని చేస్తే పరిష్కారమవుతుందో తన స్వీయ అనుభవం ద్వారా చెప్పేవారు. ఆయన పోరాట పటిమ, క్లిష్ట సమయాల్లో ఏ విధమైన ధైర్యం కలిగి ఉండేవారో ఇతరులకు అంతే ధైర్యం ఇచ్చేవారు.

ఆర్ఎస్ సొంత బిడ్డల్లా ఆదరించేవారు

తెన్నేటి సంపతరావు, చించినాడ పోరాట నాయకుడు

ప్రజాశక్తి - యలమంచిలి



ఆర్ఎస్ గ్రామానికి చేసిన సేవలు మాటల్లో వర్ణించలేం. పేదలను ఆయన సొంత బిడ్డల్లా చూసేవారు. చించినాడ పోరాటకాలంలో ఆర్ఎస్‌తో కలిసి రాజమండ్రి సెంట్రల్ జైల్లో సుమారు ఆరు నెలలపాటు ఉన్నాము. అక్కడ కూడా ఎవరికీ ఎటువంటి లోటూ లేకుండా జైలు అధికారులతో పోట్లాడి అనేక హక్కులను సాధించారు.

మనుషుల్లో దేవుడు ఆర్ఎస్..

చెల్లుబోయిన నరసింహమూర్తి, చించినాడ పోరాట నాయకుడు

ఆర్ఎస్ భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ ఆయనకు పేదలంటే మొదట నుంచి ఎనలేని ప్రేమ. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన ఎటువంటి పోరాటానికైనా సిద్ధపడేవారు. ఒక రకంగా చెప్పాలంటే ఆయన మనుషుల్లో పుట్టిన దేవుడు.

ఆర్ఎస్ ప్రాణాలకు తెగించి పోరాడేవారు

యాండ్ర సత్యనారాయణ, చించినాడ పోరాట నాయకుడు

ప్రజా సమస్యలపై ఎటువంటి పోరాటానికైనా ఆర్ఎస్ ప్రాణాలకు తెగించేవారు. ఆయన పేదలన్నా, పేద ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నా ఎంతో చొరవ చూపించేవారు. అటువంటి నాయకునితో కలసి పోరాటాల్లో పాల్గొనడం ఎప్పటికీ మర్చిపోలేం.

ఆదర్శ నాయకుడు.. ఆర్ఎస్

కేతా నాగేశ్వరరావు, చించినాడ పోరాట నాయకుడు

ప్రజా సమస్యలపై ప్రజలందరినీ చైతన్యపరిచి ఎన్నో సమస్యలను పరిష్కరించడానికి అలుపెరగని పోరాటం చేసిన మహా నాయకుడు ఆర్ఎస్. ఆయన చించినాడ గ్రామానికి చేసిన సేవలు ఎప్పటికీ మర్చిపోలేము.

మహిళలను చైతన్యపర్చేవారు

యాండ్ర అన్నపూర్ణ, చించినాడ మహిళా నేత

గ్రామంలో మహిళా సంఘాలను ఏర్పాటు చేసి, మహిళల సమస్యలపై అందరినీ ఐక్యపరచి చైతన్యపర్చేవారు. మహిళలను ఎంతగానో ప్రోత్సహిస్తూ ప్రతి ఒక్కరితోనూ ఆప్యాయతతో మెలిగే వారు.

ఆర్ఎస్ ఒక వ్యక్తి కాదు.. ఒక శక్తి

చీకరమిల్లి కృష్ణమూర్తి, చించినాడ పోరాట నాయకుడు

అప్పట్లో ఆర్ఎస్‌ను ఒక వ్యక్తిగా కాకుండా ఒక శక్తిగా చూసేవారు. ఎందుకంటే ఆయన గ్రామానికి ఎనలేని సేవలు చేశారు. పేద ప్రజలంతా ఆకలి లేకుండా జీవించాలని ఆయన గ్రామంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. అటువంటి నాయకులు అరుదుగా జన్మిస్తారు.

యువకులకు ఆర్ఎస్ ఎంతో ఆదర్శంగా ఉండేవారు



బూసి రాజబాబు, చించినాడ పోరాట నాయకుడు

చించినాడ ఉద్యమంతో పేదలకు ఎన్నో హక్కులు రావడం ద్వారా ఆ రోజుల్లో ఆర్ఎస్‌ను యువకులు ఎంతో ఆదర్శంగా తీసుకునేవారు. తదనంతర కాలంలో ఎంతోమంది నాయకులుగా తయారయ్యారు.

ఆర్ఎస్ జీవితం భావితరాలకు ఆదర్శం

జిల్లెల్ల ఆదిలక్ష్మి, చించినాడ మహిళా నేత

పేదల కోసం ఎన్నో నిర్బంధాలు, ఆటుపోట్లు ఎదుర్కొని జైలు జీవితం కూడా గడిపిన ఆర్ఎస్‌ను భావితరాల వారు ఆదర్శంగా తీసుకోవాలి. ఆయన ఆశయ సాధనకు ఇప్పటి తరం కృషి చేయాలి.

దుర్మార్గుల కోరలు పీకిన ధీశాలి ఆర్ఎస్

ముదునూరి కృష్ణంరాజు (మీసాల రాజు), చించినాడ పోరాట నేత

చించినాడలో పేదలపై పెత్తనం చేస్తూ, అన్యాయాలు, అక్రమాలకు పాల్పడుతున్న కొంతమంది దుర్మార్గుల కోరలు పీకిన ధీశాలి ఆర్ఎస్. వారికి సరైన బుద్ధి చెప్పిన ఆర్ఎస్ గ్రామంలో అందరికీ సమానత్వం చూపిన మహానుభావుడు. అటువంటి నాయకుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి.

ఆర్ఎస్ గ్రామానికి చేసిన సేవలు మరువలేం

అల్లూరి రామకృష్ణంరాజు, చించినాడ పోరాట నాయకుడు

ఆర్ఎస్ చించినాడ గ్రామానికి చేసిన సేవలు ఎప్పటికీ మర్చిపోలేం. ఆయన గ్రామానికి సర్పంచిగా పనిచేసిన కాలంలోనే గ్రామాభివృద్ధి కోసం ముందుచూపుతో ఎన్నో నిర్ణయాలు తీసుకున్నారు. ఆ ఫలాలనే నేడు చించినాడ గ్రామస్తులు అనుభవిస్తున్నారు.

ఆర్ఎస్ వంటి గొప్ప నాయకులు అరుదుగా పుడతారు

రుద్రరాజు విజయ వెంకట లక్ష్మీనరసింహవర్మ (పెదవర్మ), ప్రముఖ ఆక్వా రైతు, చించినాడ

తన కోసం, తమ కుటుంబం కోసమే కాకుండా ప్రజల కోసం జీవించే నాయకులు అరుదుగా ఉంటారు. అటువంటి కోవకు చెందిన ఆర్ఎస్ తన జీవితమంతా ఉద్యమాలకే అంకితమై మరోపక్క చించినాడ అభివృద్ధిలో కీలపాత్ర పోషించారు. అనేక సందర్భాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మమ్మల్ని కూడా భాగస్వాములను చేసి స్ఫూర్తిగా నిలిచేవారు. ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

అభివృద్ధి ప్రదాత ఆర్ఎస్

రుద్రరాజు సత్యనారాయణరాజు (వైజాగ్ రాజు), చించినాడ మాజీ ఉప సర్పంచి

చించినాడ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మహానాయకుడు ఆర్ఎస్. పైస్థాయిలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా చించినాడ గ్రామాభివృద్ధికి కావాల్సిన నిధుల కోసం గట్టి కృషి చేసేవారు. ఆర్ఎస్‌ను చిన్నతనం నుంచి దగ్గరుండి చూసిన వ్యక్తిగా సేవాభావం ఆయన నుంచే నేర్చుకున్నాను.

చించినాడ గ్రామ ప్రతిష్టను పెంచిన నేత ఆర్ఎస్

రుద్రరాజు విశ్వనాథ గోపాలకృష్ణ వర్మ(చిన వర్మ), రైతు నాయకులు

65 సంవత్సరాలపాటు చించినాడ గ్రామాన్ని ఒకే తాటిపై నిలిపి పంచాయతీ పరిపాలనను అప్రతి హతంగా సాగించడానికి ఆర్ఎస్ చేసిన కృషి చిన్న విషయం కాదు. దాని వెనుక ఆయన కష్టం చాలా ఉంది. అటువంటి నాయకుడిని ఆదర్శంగా తీసుకుని పని చేయాలి.

ఆర్ఎస్ ఆశయాలు గొప్పవి

పొత్తూరి వెంకట నరసింహరాజు(పొత్తూరి మాస్టారు) చించినాడ పోరాట నాయకులు

ఆర్ఎస్ పెంచుకున్న కమ్యూ నిస్టు ఆశ యాలు గొప్పవి. సమాజంలో ఎటువంటి తారతమ్యాలూ లేకుండా అందరికీ సమానత్వం కోసం ఆయన సాగించిన పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకం.

ఎర్రజెండా ముద్దుబిడ్డకు విప్లవ జోహార్లు...
పేదప్రజల అభ్యున్నతికోసం తుదిశ్వాస వరకు అలుపెరగని పోరాటం చేసిన బహుముఖ ప్రజ్ఞశాలి మాజీ ఎంఎల్ఏ కామ్రేడ్ "రుద్రరాజు సత్యనారాయణరాజు"(ఆర్.ఎస్) గారికి విప్లవ జోహార్లు...
కామ్రేడ్ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్.ఎస్)
జననం: 06-06-1927
మరణం: 05-09-2024
కొారు వెంకటేశ్వర్లు
Advocate Ex. Public Prosecutor,
తణుకు, ప॥గో॥జిల్లా

ఎర్రజెండా ముద్దుబిడ్డకు
విప్లవ జోహార్లు...
అలుపెరగని విప్లవ వీరుడు, మా చించినాడ ఎర్రజెండా ముద్దుబిడ్డ కామ్రేడ్ "రుద్రరాజు సత్యనారాయణరాజు"(ఆర్.ఎస్) గారి మృతి తీరనిలోటు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి.
కామ్రేడ్ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్.ఎస్)
జననం: 06-06-1927
మరణం: 05-09-2024
మైల రామమూర్తి వర్మ
జిల్లా జడ్జి రిటైర్డ్
భీమవరం, ప॥గో॥జిల్లా

ఎర్రజెండా ముద్దుబిడ్డకు విప్లవ జోహార్లు...
పేదప్రజల అభ్యున్నతికోసం తుదిశ్వాస వరకు అలుపెరగని పోరాటం చేసిన బహుముఖ ప్రజ్ఞశాలి మాజీ ఎంఎల్ఏ కామ్రేడ్ "రుద్రరాజు సత్యనారాయణరాజు"(ఆర్.ఎస్) గారికి విప్లవ జోహార్లు...
కామ్రేడ్ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్.ఎస్)
జననం: 06-06-1927
మరణం: 05-09-2024
మొగల్తూరు సొసైటీ పి.ఎ.సి.స
సీతారామపురం సొసైటీ పి.ఎ.సి.స
కాళీపట్నం సొసైటీ పి.ఎ.సి.స
మొగల్తూరు మండలం, ప॥గో॥జిల్లా

ఎర్రజెండా ముద్దుబిడ్డకు విప్లవ జోహార్లు...
తమ కోసం, తమ కుటుంబాల కోసం అనేక మంది జీవిస్తారు...
కాని ప్రజల కోసం జీవించేవారు మరణించినా, ప్రజల హృదయాలలో చిరస్థాయిగా జీవించే ఉంటారు.
అలాంటి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని చివరి శ్వాస వరకు ఆదర్శ కమ్యూనిస్టు నాయకునిగా, జీవించిన సి.పి.యం.
జిల్లా సీనియర్ నాయకులు, కామ్రేడ్ "రుద్రరాజు సత్యనారాయణరాజు"(ఆర్.ఎస్) గారి విప్లవ జోహార్లు తెలియజేస్తున్నాం...
కామ్రేడ్ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్.ఎస్)
జననం: 06-06-1927 మరణం: 05-09-2024
ప॥గో॥జిల్లా సహకార సంఘముల మరియు రూరల్ బ్యాంకు ఉద్యోగుల యూనియన్
రి.నెం.జి-2122 ఏలూరు (సి.ఐ.టి.యు. అనుబంధ సంస్థ)
కె. రాజారామ్మోహనరాయ్ - గౌరవ అధ్యక్షులు - సి.ఐ.టి.యు
పి. విజయ భాస్కరరావు - అధ్యక్షులు - సి.ఇ.ఒ. వైవి.లంక, పి.ఎ.సి.ఎస్
పి. కృష్ణశాస్త్రి - ప్రధాన కార్యదర్శి - సి.ఇ.ఒ. బల్లిపాడు, పి.ఎ.సి.ఎస్
పి.వి.ఎల్. నరసింహరాజు - కన్వీనర్ - పాలకోడేరు, ఎల్.ఎస్.సి.ఎస్
ఇ.ఎన్. పెద్దిరాజు - ట్రెజరర్ - సి.ఇ.ఒ. ఇరగవరం, పి.ఎ.సి.ఎస్

ఉద్యమాల రథసారధి ఆర్ఎస్

గుబ్బల చక్రపాణి, కలగంపూడి పోరాట నాయకుడు

ఉద్యమాల రథసారధిగా జిల్లావ్యాప్తంగా ఆర్ఎస్ నిర్వహించిన అనేక పోరాటాలు విజయవంతమయ్యేవి. వీటిని స్ఫూర్తిగా తీసుకుని జిల్లావ్యాప్తంగా అనేక మంది కార్యకర్తలు సిపిఎంకు ఆకర్షితులై ఉద్యమాల్లోకి వచ్చారు.

ఆర్ఎస్ ఆశయ సాధనకు కృషి చేస్తా

రుద్రరాజు సత్యనారాయణరాజు (అజంతా రాజు), మాజీ గ్రామ సర్పంచి, ఆర్ఎస్ సోదరుని కుమారుడు

ఆర్ఎస్ ప్రజా ఉద్యమాల ద్వారా గ్రామ సర్పంచి స్థాయి నుంచి ఎంఎల్ఎగాను, అనంతర కాలంలో సిపిఎం రాష్ట్ర నాయకులుగా ప్రముఖ పాత్ర పోషించడం మా కుటుంబానికే కాకుండా చించినాడ గ్రామానికి గర్వకారణం. అలాంటి ప్రజాభిమానం కలిగిన నాయకుడు మృతి చెందడం బాధాకరం. ఆయన ఆశయ సాధన కోసం ఎల్లవేళలా కృషి చేస్తాను.

అలుపెరగని అరుణతార ఆర్ఎస్

కానేటి బాలరాజు, సిపిఎం మండల కార్యదర్శి

చించినాడ గ్రామం అంటే ఆర్ఎస్‌కు ప్రాణం. అనునిత్యం గ్రామాభివృద్ధికి, ప్రజల కోసం పరితపించే వారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడేవారు. ఎలాంటి ఎదురుదెబ్బలు తగిలినా ఎదురు నిలిచి పోరాడాలని అనునిత్యం చెప్పేవారు. సంఘాల ఐక్యత, అభివృద్ధి కోసం జీవితాంతం కృషి చేశారు. తుదిశ్వాస విడిచే వరకు నమ్మిన ఆశయాల కోసం అలుపెరగని పోరాటం సాగించిన అరుణతార.



అలుపెరగని పోరాటయోధుడు ఆర్ఎస్

పొత్తూరి నరసింహరాజు, రిటైర్డ్ టీచర్, కలగంపూడి

తాను నమ్మిన సిద్ధాంతాల కోసం తుదిశ్వాస విడిచే వరకు ప్రజల కోసమే జీవించిన అలుపెరగని కమ్యూనిస్టు యోధుడు ఆర్ఎస్. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి.

పేదల పక్షపాతి ఆర్ఎస్

బొల్లా నరసింహమూర్తి, సిపిఎం నాయకుడు, చించినాడ

ఎల్లప్పుడూ పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే ఆర్ఎస్ పాటుపడే వారు. ఆయన సాగించిన పోరాటాలు చిరస్మరణీయం. ఆయన ఆశయ సాధన కోసం ఇప్పటి తరం ముందుకు రావాలి.

పేదలంటే ఆర్ఎస్‌కు ప్రాణం

బూసి రత్నంరాజు, అర్లపాడు, చించినాడ

భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ తన జీవితమంతా పేద ప్రజలకే అంకితం చేసిన ఆర్ఎస్ లాంటి నాయకులు అరుదుగా ఉంటారు. ఆర్ఎస్ మృతి గ్రామానికి తీరని లోటు.

ఆర్ఎస్ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

గుబ్బల సత్యనారాయణ, కలగంపూడి పోరాట నాయకుడు

జిల్లాలో పేదలకు ఎక్కడ అన్యాయం జరిగినా వెంటనే అక్కడ వాలిపోయి ఆ సమస్యను పరిష్కరించే వరకు ఆర్ఎస్ విశ్రమించేవారు కాదు. ఇప్పటి తరం ఆ స్ఫూర్తిని కొనసాగించాలి.

ఐద్వా నిర్మాణానికి ఆర్ఎస్ కృషి అమోఘం

సరిపల్లి జయప్రభ, ఐద్వా జిల్లా నాయకులు

జిల్లాలో ఐద్వా నిర్మాణానికి ఆర్ఎస్ ఎంతగానో కృషి చేశారు. ఆ సంఘంలో పని చేసే ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సంఘం చేస్తున్న కార్యకలాపాల వివరాలు అడిగి తెలుసుకునే వారు. ఆయన మృతి బాధాకరం. వారి ఆశయ సాధనకు కృషి చేస్తాం.

ఆకలితో ఉన్నవారి కడుపు నింపారు..

మల్లుల ఆంజనేయులు, చించినాడ పోరాట నాయకుడు, యలమంచిలి

1980వ సంవత్సరం ముందు గ్రామంలో పేదలకు తినడానికి తిండి కూడా లేని పరిస్థితి ఉండేది. ఆ సమయంలో అపరిచితుల నుంచి ప్రజలను కాపాడింది ఆర్ఎస్ మాత్రమే. సిపిఎం తరపున ఆ రోజుల్లో రైతుల నుంచి తక్కువ ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేసి, నిల్వచేసిన ధాన్యాన్ని వర్షాకాలం కరువు రోజుల్లో గ్రామంలోని ప్రజలందరికీ అతి తక్కువ ధరకే పంపిణీ చేసేవారు. పేదలంతా ఆకలి నుంచి బయటపడే పరిస్థితి వచ్చింది, ఆరోజుల్లో ఆర్ఎస్ లేకుంటే గ్రామంలో అసలు కూడు కూడా దొరికేది కాదు.

సుఖం కాని, దు:ఖం గాని ఒంటరిగా అనుభవించజాలరు. పంచుకునేవారు కావాలి. అందుకే కుటుంబం-సమాజం.

- డా|| దాశరథి రంగాచార్య, సాహితీవేత్త.

ఉద్యమాలే ఊపిరిగా ఆర్ఎస్ జీవితం

తమ్మినేని వీరభద్రం, సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, హైదరాబాద్

సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) మృతి బాధాకరం. ఆత్మీయులంతా ఆర్ఎస్ అని పిలుచుకునే ఆయన తన జీవితకాలం ఉద్యమాలే ఊపిరిగా జీవించారు. పుట్టడం, మరణించడం సహజం. ఈ రెండింటి మధ్య గడిపిన జీవితం ఎవరి కోసం జీవించమో ఆలోచించాలి. తన కోసం పుట్టి తన కుటుంబం కోసం పనిచేయడం గొప్ప కాదు. ఆర్ఎస్‌లా అంతా జీవించాలి. సమాజ హితం కోసం కమ్యూనిస్టులు నిరంతరం పాటుపడుతుంటారు. నిబద్ధత నిజాయతీకి నిదర్శనం కమ్యూనిస్టులే. తన తుదిశ్వాస విడిచేవరకు ఆర్ఎస్ ఆ విధంగానే బతికారు. సమాజంలో దోపిడీని అవగాహన చేసుకుని భూస్వాములకు వ్యతిరేకంగా జీవితాంతం ఎర్రజెండా నీడలో ఆర్ఎస్ నిలిచారు. ఆర్ఎస్ వ్యక్తిత్వ స్ఫూర్తి ఎంతోగొప్పది. నువ్వు నా దగ్గరికి వస్తే నేను ఎక్కువ కాలం బతుకుతానని ఆర్ఎస్ నాతో అనేవారు. కష్టాలు, నిర్బంధాలు, కొట్లాటలు, కేసులు ఇలా అనేకం ఎదుర్కొన్న ఆర్ఎస్ స్థితప్రజ్ఞుడు. కమ్యూనిస్టులు దేశానికి ఎంతో అవసరం. ఎర్రజెండాపై విశ్వాసంతో ఆర్ఎస్ స్ఫూర్తితో కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగుతాం. తెలంగాణ రాష్ట్ర కమిటీ తరఫున ఆర్ఎస్ మృతికి సంతాపం ప్రకటిస్తూ, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

అందమైన బాహ్య రూపం ఎప్పుడైనా మోసం చెయ్యవచ్చు. కానీ విప్లవం పట్ల నిబద్ధత గల ఆత్మ సౌందర్యం ఏనాటికీ మోసం చెయ్యదు. - మావో

నాయకత్వ లక్షణాలు మూర్తీభవించిన మహోన్నతుడు ఆర్ఎస్

బి.వెంకట్, ప్రధాన కార్యదర్శి, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం

నాయకుడంటే ఎలా ఉండాలో మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య చెప్పినట్లు ఆర్ఎస్ సంపూర్ణత్వం మూర్తీభవించిన మహోన్నతుడు. శ్రామికవర్గ పోరాటాలు సాగించడంలో, సామాజిక ఉద్యమాలు నిర్వహించడంలోనూ, వాటికి మద్దతు కూడగట్టడంలో, కార్యకర్తల్ని గుర్తించడంలో, అభివృద్ధి చేయడంలోనూ, వారి లోపాలు సరిదిద్దడంలోనూ ఆర్ఎస్ కమ్యూనిస్టుల్లో ఉన్నతశ్రేణి నాయకుడు. తాను చేయగల్గిందే చెప్పడం.. చేయలేని దానికి దూరంగా ఉండడం ఇందులో నిక్కర్చితనం.. అందర్నీ ఆకట్టుకునే ఉత్తమ లక్షణాలు పుణికి పుచ్చుకున్న నాయకుడు.

లంక భూముల పోరాటం, కూలిరేట్ల ఉద్యమం, ప్రభుత్వ స్థలాల్లో కొబ్బరిచెట్లు పేదలకు ఇవ్వాలని సాగించిన తదితర పోరాటాల ద్వారా వర్గ పోరాటాల ప్రాధాన్యతను గుర్తించి నడిపారు. ఇదే చించినాడ గ్రామాన్ని కమ్యూనిస్టుల కోటగా నిర్మించింది. ఆ ఒరవడి జిల్లా అంతటా కృషి చేశారు. ఇదే ఆయన్ని జిల్లా అంతటా ప్రజానేతగా గుర్తింపు తెచ్చింది. అంతేకాదు రైతు సమస్యలపైనా, కార్మికుల సమస్యలపైనా అంతేస్థాయిలో ఉద్యమాలు సాగించారు. శ్రామిక వర్గాలందరి కోసం ప్రత్యక్ష ఉద్యమాలు, నిర్మాణ కృషి సాగించిన నేతలు కొద్దిమందే. వారిలో ఆర్ఎస్ ఒకరు. పార్టీ జిల్లా కార్యదర్శిగా ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన భూ ఉద్యమాన్ని నడపడంలోనూ క్రియాశీల పాత్ర వహించారు. ముఖ్యంగా నిర్బంధ కాలంలో కొండంత అండగా నిల్చారు. నాటి కాలంలో దళితుల పట్ల తీవ్రస్థాయిలో అంటరానితనం అమలౌతున్నప్పుడు సామాజిక పోరా టాలు సాగించడంలోనూ, వారికి అండగా నిలవడంలోనూ ఆర్ఎస్ దిట్ట. ఆయన భూస్వామ్య, ఆధిపత్య తరగతిలో పుట్టినా భూస్వాములకు వ్యతిరేక పోరాటాలు సాగించారు. సామాజిక పోరాటాలు సాగించారు. తద్వారా ఏవర్గం, తరగతిలో పుట్టినా శ్రామికులు, దళిత, గిరిజనుల ప్రక్షాన్నే నిలిచి నికార్సైన కమ్యూనిస్టుగా నిల్చారు. ఈ పోరాటాలకు ఇతర వర్గాల మద్దతు కూడగట్టడంలో గణనీయ కృషి సాగించారు. నేటితరానికి వర్గ పోరాటాల ప్రాధాన్యత, వాటికి మద్దతు కూడగట్టాల్సిన ఆవశ్యకత చక్కటి పాఠాలు. సాదాసీదా కార్యక్రమాలకు ఇబ్బందులు, త్యాగాలతో పని లేదు. శ్రామికవర్గ పోరాటాల నిర్వహణకు ఎంతటి నిర్బంధాలు, ఒత్తిళ్లు తట్టుకుంటూ త్యాగాలు అవసరమో గుర్తెరిగిన వారు ఆర్ఎస్. శ్రామికవర్గ పోరాటాల అవసరాన్ని చెప్పడం సులభం. అచరణలో పెట్టడం కత్తిమీద సాములాంటిది. ఆ పని ఆర్ఎస్ జీవితమంతా సాగింది. విద్యార్థి దశ నుండి రాజకీయాల్లో అడుగుపెట్టి ఎన్నో నిర్బంధాలు, కేసులు ఎదుర్కొని, జైలు జీవితం అనుభవించి తుదిశ్వాస వరకూ పని చేసిన ధన్యజీవి. 98 ఏళ్లపాటు సంపూర్ణ జీవితం అనుభవిస్తూనే కమ్యూనిస్టుగానూ సంపూర్ణత్వం సాధించారు. ఎంఎల్ఎగా, పార్టీ, వర్గ సంఘాల జిల్లా కార్యదర్శిగా అన్నింటికీ మించి ప్రజానేతగా జిల్లా అంతటా గుర్తింపు పొందారు. ఐనా ఉన్నతస్థాయి వారి పట్ల గౌరవభావంతో వ్యవహరించినట్లే కిందిస్థాయి కార్యకర్తల పట్ల అంతే ఆప్యాయతను చూపేవారు. కార్యకర్తల్ని గుర్తించడం, ప్రోత్సహించడం తోపాటు వారి యోగక్షేమాలు పట్ల శ్రద్ధ వహించేవారు. అంతకుమించి వారి లోపాల పట్ల కరకుగా వ్యవహరిస్తూనే వారి తప్పులు గుర్తింపజేసి సరిదిద్దడంలోనూ దిట్ట. తద్వారా పోరాటాలు సాగించడంలోనూ, కార్యకర్తల పట్ల కుటుంబ పెద్దగా మెలగడం ద్వారా సంపూర్ణతత్వం కల్గిన మహోన్నతుడు.

నేను 1991లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుని బాధ్యతల నిర్వహణకు విజయవాడ కేంద్రం నుంచి పని చేస్తున్నప్పటి నుండీ ఆయన చనిపోయే వరకూ ఆర్ఎస్‌తో ప్రగాఢమైన అనుబంధం సాగింది. తదనంతరం వ్యవసాయ కార్మిక సంఘం బాధ్యతల్లోనూ ఆయన నుండి విలువైన సూచనలు పొందాను. ఆయనతోపాటు ప్రత్యక్ష పోరాటాల్లో పాల్గొన్నాను. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఆయనతో కలిసి గడిపిన సందర్భాలు అనేకం. నేను ఖమ్మం జిల్లా వాసిని కావడంతో తెల్దారుపల్లి, చించినాడ గ్రామాలకున్న పోలికలను గుర్తు చేసేవారు. తెల్దారుపల్లిలో తమ్మినేని వీరభద్రంగారి తండ్రి సుబ్బయ్యగారు సాగించిన పోరాటాలు, చించినాడలో తమ ముందు తరం నుండి తన కాలంలో సాగిన పోరాటాలు కమ్యూనిస్టుల కంచుకో టగా మార్చాయని చెబుతుండేవారు. ఇది అక్షర సత్యం. రెండూ పంచాయతీలు ఏర్పడిన నాటి నుండి దశాబ్దాల తరబడి సిపిఎం వారే ప్రజాప్రతి నిధులుగా గెల్చిన విషయాన్ని అంతా గుర్తెరగాలి. ఆయన వయోభారంతో ఇంటి వద్దే ఉన్నప్పుడు రెండుసార్లు కలిశాను. ప్రత్యేకించి తమ్మి నేని వీరభద్రం, నువ్వు రావాలని పలుసార్లు అడిగా రు. వారి కోరిక సమంజసం. అందుకే తమ్మినేని వీర భద్రంగారితోపాటు నేను, సాయిబాబా కల్సి రెండేళ్ల క్రితం పరామర్శించాం. ఆయన ఆనందం వర్ణనా తీతం. ఆ స్థితిలోనూ ఉద్యమాలు, పార్టీ పట్ల ఆయన నిబద్ధతను చూసి ఉత్తేజం పొందాను. ఓ కమ్యూని స్టు అంటే ఆర్ఎస్‌లా ఉండాలని, అలాంటి జీవితం గడపాలని, తిరుగు ప్రయాణంలో చర్చించుకున్నాం. ఆ తరుణంలో ఆయన నుండి పొందిన స్ఫూర్తి అంతా ఇంతా కాదు. చివరగా ప్రజారక్షణ భేరి యాత్ర సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా ఢిల్లీ నుండి వచ్చాను. ఆ సందర్భంగా జిల్లా నాయకులతో పోస్టర్ ఆవిష్కరించాం. తీవ్ర అనారో గ్యంతో ఉన్నా.. ఆయనలోని ఉత్తేజం మాకు నూతన శక్తినందించింది. ఈ సందర్భం గా ఆయన నా నుదుటిపై ముద్దుపెట్టి నేను చేయలేకపోతు న్నాననే ఆవేదన.. మీరైనా బాగా చేయండన్న మాటలు.. ఆ సందర్భంగా పొందిన ఆనందం అనిర్వచనీయం.

ఆయన నుండి వర్గ పోరాటాలు, సామాజిక పోరాటాలు, కార్యకర్తల పట్ల వైఖరి, నిక్కర్చిగా వ్యవహరిం చడం అన్నింటి కలబోతగా సంపూర్ణత్వం మూర్తీభవించిన మహోన్నతు డుగా ఆర్ఎస్ నిల్చారు. అందుకే ఆయన ఈ తరానికి ఆదర్శం.







పేదల పోరాట యోధుడు ఆర్ఎస్

నిమ్మల రామానాయుడు, రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి

పాలకొల్లు: పీడిత ప్రజల కోసం అనేక పోరాటాలు చేసిన కామ్రేడ్లలో ఆర్.సత్యనారాయణరాజు (ఆర్ఎస్) ముందుంటారు. ఆయన మరణం కమ్యూనిస్టులకే కాకుండా అన్ని పార్టీలకూ, పేదలకు నష్టదాయకం. ఇటీవల దేశంలో సీతారాం ఏచూరి మరణం అందరినీ కలిచి వేసింది. నా నియోజకవర్గంలో వలవల శ్రీరామ్మూర్తితోపాటు, ఆర్ఎస్‌ను కోల్పోవడం దురదృష్టకరం. వీరు జీవిత కాలమంతా పేద, పీడిత ప్రజల కోసం పోరాటాలు చేశారు. పాలకొల్లు నియోజకవర్గంలో రైతులకు సాగు నీరు రావడానికి ఉద్యమించారు.

నమ్మిన సిద్ధాంతంపై ఆర్ఎస్‌కు విశ్వాసం

మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

ఆర్ఎస్ మంచి వ్యక్తి. తాను నమ్మిన సిద్ధాంతం మీద విశ్వాసం, స్పష్టత సంపూర్ణంగా ఉండేవి. 97 ఏళ్ల వయసులో కూడా సిపిఎంలో కొనసాగి గ్రామ సర్పంచిగా, ఎంఎల్ఏగా రైతు, కార్మిక ఉద్యమంలో పాల్గొని అందరి మన్ననలు పొందారు. జిల్లాలో సిపిఎం బలోపేతానికి ఆయన చేసిన పోరాటాలు మరువలేనివి. అలుపెరుగని పోరాటాలు చేసి కార్మికులను ఆ బాటలో ప్రయాణించేలా చేయడంలో ఆయన సఫలీకృతమయ్యారు. జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు పార్టీ సభ్యులను తయారు చేయడంలో ఆయన ప్రధాన పాత్ర పోషించారు. పీడిత ప్రజలకు తెల్ల రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో ముందుండేవారు. ఆయన నిత్యం కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేసేవారు. ఆర్ఎస్ మృతి కుటుంబ సభ్యులకు, పార్టీకి తీరనిలోటు.

మన జననం సాధారణమైనదే కావచ్చు. కానీ, మన మరణం మాత్రం ఒక చరిత్రను సృష్టించేలా ఉండాలి.

- ఏ.పి.జె. అబ్దుల్ కలాం, భారత పూర్వ రాష్ట్రపతి.

పీడిత ప్రజల ముద్దుబిడ్డ ఆర్ఎస్

ఎం.ఈశ్వరయ్య, జనసేన నేత, జంగారెడ్డిగూడెం

తమ కోసం, తమ కుటుంబాల కోసం జీవించే వారిని చూస్తున్నాం. కాని ప్రజల కోసం, ప్రజా ఉద్యమాల్లో కొనసాగుతూ మరణించిన నాయకులు ప్రజల హృదయాల్లో జీవించి ఉంటారడానికి కామ్రేడ్ ఆర్ఎస్గారి జీవితమే నేటి తరానికి ఒక ఉదాహరణ. స్ఫూర్తిదాయకం. సిపిఎంలోకి ఎంతో మంది కార్యకర్తలను ఆకర్షించి, వాళ్లను ప్రోత్సహించి, నాయకులుగా తీర్చిదిద్ది, వాళ్ల కుటుంబాలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉంటూ, పార్టీలో పూర్తి కాలం పనిచేసే నాయకులు, కార్యకర్తల వెంట ఎల్లవేళలా అన్ని సందర్భాల్లో నేను ఉన్నాను అనే భరోసా కల్పించడంలో ఆర్ఎస్గార్కి ఎవరూ సాటిరారు. ప్రతిఒక్కరి పట్ల వ్యక్తిగత శ్రద్ధ కనబరుస్తూ నిరంతరం ప్రోత్సహించే నేత ఆర్ఎస్. ఈ తరానికి అటువంటి నాయకుల అవసరం ఎంతైనా ఉంది. ఆ బాటలో నేటితరం యువత, నేతలు ముందుకు సాగటమే కామ్రేడ్ ఆర్ఎస్గార్కి మనం ఇచ్చే ఘనమైన నివాళులు. 'మనం పుట్టేటప్పుడు పేరుండదు.. ఊపిరి మాత్రమే ఉంటుంది. కానీ పోయేటప్పుడు ఊపిరి ఉండదు.. పేరు మాత్రమే ఉంటుంది. ఎవరూ ఊపిరిని నిలుపుకోలేరుగాని కనీసం కామ్రేడ్ ఆర్ఎస్గారిలా ప్రతిఒక్కరూ పేరునైనా నిలుపుకునేలా పని చేయడమే ఆయనకు నిజమైన నివాళి.

కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా చూసేవారు

పి.కిషోర్, సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి

నేను చిన్నతనంలో మా నాన్నగారితో కలిసి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉండేవాడిని. ఆ సమయంలో ఆర్ఎస్ అంటే టైగర్ అని మా నాన్న చెప్పడం ఇప్పటికీ నాకు గుర్తుంది. ఆయన శృంగవృక్షం అట్టల ఫ్యాక్టరీ, రైస్మిల్ వర్కర్స్ యూనియన్ అగ్రిమెంట్ మీటింగ్లకు హాజరైనప్పుడు యజమానులు హడలిపోయేవారు. ఆర్ఎస్ వస్తే ఒక మీటింగ్తోనే అగ్రిమెంట్ పూర్తయ్యేది. నేను పూర్తికాలం కార్యకర్తగా వచ్చి సిఐటియు బాధ్యతలు చూస్తున్నప్పుడు ఆర్ఎస్గారు ఎప్పటికప్పుడు వ్యక్తిగతంగా నాకు సలహాలిస్తూ ఉండేవారు. ప్రత్యేకించి పార్టీ కుటుంబాల్లో మహిళలు, పిల్లలను ఆప్యాయంగా పలకరించేవారు. నా వివాహాన్ని కుటుంబ సభ్యులు వ్యతిరేకించినా నాకు ధైర్యాన్నిచ్చి వివాహం జరిపించారు. ఆర్ఎస్ లేని లోటు పార్టీతోపాటు నాకు వ్యక్తిగతంగా పూడ్చలేనిది.



మా ఇంటిని ప్రారంభించింది ఆర్ఎస్

డి.కళ్యాణి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు

భీమవరం: ఆర్ఎస్ పార్టీ నాయకుడే కాదు. మా కుటుంబానికి పెద్దదిక్కు. మా తాతయ్యని కోల్పోయాం. మా కుటుంబం నిర్మించుకున్న ఇంటిని కూడా రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించింది ఆయనే. ఆర్ఎస్ తాతయ్యను కోల్పోవడం చాలా బాధాకరం.

పట్టుదలకు, ధైర్యానికి మారుపేరు ఆర్ఎస్

జెఎన్‌వి గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, భీమవరం

భీమవరం: చిన్నపిల్లలను బెదిరిస్తే మా నాన్నతో చెబుతాను అంటారు. పెద్దవారిని బెదిరిస్తే మా వాళ్లని తీసుకొస్తానని చెబుతారు.. కానీ గ్రామాల్లో, పరిశ్రమల్లో ఘర్షణవస్తే ఎర్రజెండాకు ప్రతిరూపంగా ఉన్న మా ఆర్ఎస్‌ను తీసుకొస్తామని పార్టీశ్రేణులు, కార్మికవర్గం అవతలి వారిని కౌంటర్ ఎటాక్ చేసేవారు. నేను డిగ్రీ చదువుతున్న సమయంలో ఆర్ఎస్ డివిజన్ కార్యదర్శిగా ఉండేవారు. ఆనాడు విద్యార్థి సంఘాల మధ్య ఘర్షణ ఉండేది. ఆ సమయంలో పార్టీ, దానికి ప్రతిరూపంగా ఉన్న ఆర్ఎస్ ఉన్నారనే ధైర్యం ఉండేది. ఆర్ఎస్ అంటే పార్టీ శ్రేణులకు ఒక ధైర్యం. జిల్లాలో ఆనాటి నెహ్రూ సైన్యాలు, తెలంగాణా రైతాంగ సాయుధపోరాటాన్ని అణచివేసే దానిలో భాగంగా జిల్లాలోని అనేకమంది కమ్యూనిస్టులను పిట్టల్ని కాల్చినట్టు కాల్చిచంపారు. ఆర్ఎస్ స్వగ్రామం చించినాడలోని ఆయన సమీప బంధువులను కూడా కాల్చి చంపారు. అయినా ఆర్ఎస్ ఏమాత్రం వెనుకంజ వేయకుండా ప్రతికూల పరిస్థితులను అధిగమించే పట్టుదలతో పోరాడే తత్వం ఆయనది. గెలుపు అవకాశాలన్నింటినీ ఉపయోగిస్తూ ప్రత్యర్థుల బలహీనతలపై దెబ్బకొట్టగల నేర్పరి. సమావేశమైనా, సభ అయినా, ఏ కార్యక్రమమైనా నిర్ణయించుకున్న సమయానికంటే ఆర్ఎస్ ముందుండేవారు. సమయపాలన ఆయన నుంచి నేర్చుకునే ముఖ్య విషయం.

జిల్లా ఉద్యమ నిర్మాతల్లో ముఖ్యులు

చింతకాయల బాబూరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

తాడేపల్లిగూడెం: ఆర్ఎస్‌గా పిలుచుకునే రుద్రరాజు సత్యనారాయణరాజు జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమానికి, కార్మిక, రైతాంగ, వ్యవసాయ కార్మిక ఉద్యమాలకు దీర్ఘకాలం పాటు మార్గదర్శిగా ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని, శక్తిని నింపారు. ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనడమే కాక వాటి నిర్మాణంలో, సంఘాల ఏర్పాటులో కీలకపాత్ర వహించారు. ఆయన కృషి నేటి యువతరానికి ఎంతో ఆదర్శవంతమైంది. ఆర్ఎస్‌గారు ప్రజా ఉద్యమాలను నిర్మించడంలో దిట్ట. ఒక ప్రజాప్రతినిధిగా ప్రజాసమస్యల పరిష్కారంలో ఆయా ప్రాంతాల ప్రజా ఉద్యమాలు అభివృద్ధిలో ఏవిధంగా తోడ్పాటు అందించవచ్చో ఆయన ఒక మోడల్‌గా చేసి చూపించారు. అన్ని రాజకీయ పార్టీలతో మంచి సంబంధాలు ఉండేవి. కార్యకర్తలకు చేదోడు వాదోడుగా కుటుంబ పెద్దగా వ్యవహరిస్తూ వారి వ్యక్తిగత, కుటుంబంలోని సమస్యలు, కార్యకర్తల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని సలహాలు, సహకారం సంపూర్ణంగా అందించేవారు. విధానాల పట్ల ఎంత కఠినంగా ఉండేవారో కార్యకర్తల సంక్షేమం పట్ల అంతకంటే ఎక్కువ ఆదరణతో తోడ్పాటును అందించేవారు. వారు లేని లోటు పార్టీకి, పార్టీ కార్యకర్తలకి తీర్చలేనిది. ఆయన ఆశయ సాధనకు ముందుకు సాగుతాం.

నిరంతరం స్ఫూర్తిదాయకం.. ఆర్ఎస్ ఉద్యమప్రస్థానం

కేతా గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

నేను పదో తరగతి చదువుతున్న రోజుల్లో కామ్రేడ్ రుద్రరాజు సత్యనారాయణ రాజు(ఆర్ఎస్) పోలమూరు వచ్చారు. అప్పుడు పేరంటాలు చిరిగిన దుస్తులతో ఉంటే ఆ దుస్తులను చూసి నాపై మండిపడ్డారు. వెంటనే కొత్త దుస్తులు కొనివ్వమని నాకు డబ్బులు ఇచ్చారు. పేరంటాలుకు కొత్త దుస్తులు కొనివ్వడంతో అతని కళ్లల్లో ఆనందం చూసి నా కళ్లంట గిర్రుమంటూ నీళ్లు తిరిగాయి. నేను ఇంటర్ వీరవాసరం కాలేజీలో చదువుతున్న రోజుల్లో ఆర్ఎస్ పనివిధానం కళ్లారా చూసిన ఘటనలు కళ్లకు కట్టినట్లు కనిపించాయి. ఆచంట నియోజకవర్గంలో సమస్యలపై సైకిల్ యాత్ర 2003లో నియోజకవర్గం అంతటా 74 సంవత్సరాల వయసులోనే సైకిల్‌పై కూర్చుని పాల్గొనడం ఎన్నటికీ మర్చిపోలేనిది. ఆచంట మండలంలో సైకిల్ యాత్ర సందర్భంగా అయోధ్య లంక వెళ్లిన సందర్భంలో మధ్యాహ్నం భోజనం లేకపోవడంతో దళితపేటలో అక్కడికి వెళ్లిన తరువాత స్థానికులు ఇంటింటికి తిరిగి కామ్రేడ్ ఆర్ఎస్, ఇతర కార్యకర్తల ఆకలి తీర్చారు. పార్టీ జిల్లా మహాసభ నిడదవోలులో జరుగుతున్నప్పుడు పోలమూరు గ్రామంలో పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయని, మహాసభకు సమయానికి చేరుకోని కారణంగా ఆర్ఎస్ నాకు అప్పుడే పార్లమెంటరీ జబ్బులు వచ్చేసాయని గట్టిగా మందలించారు. నాకు వ్యక్తిగతంగా మా పిల్లలు అనారోగ్యాలకు గురైనప్పుడు ఆర్ఎస్ తీసుకున్న శ్రద్ధ అంతాఇంతా కాదు. 2011లో హైదరాబాద్ ఆస్పత్రిలో న్యూరో డాక్టర్ వద్దకు 85 సంవత్సరాల వయసులో.. అనారోగ్యంగా ఉన్నా ఆర్ఎస్ వచ్చి దగ్గరుండి నాకు వైద్య పరీక్షలలో సహకారం అందించి, పాలుపంచుకున్న జ్ఞాపకాలు ఇంకా కదులుతున్నాయి.

విశ్వాసం కలిగించేలా పని చేయడం ఆర్ఎస్ స్టైల్

బి.వాసుదేవరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, భీమవరం

భీమవరం: కార్యకర్తల పట్ల ఆర్ఎస్ వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని వారి అభివృద్ధికి తోడ్పడేవారు. కార్యకర్తలకు విశ్వాసం కలిగించేలా పనిచేయడం ఆర్ఎస్ స్టైల్. అట్టల ఫ్యాక్టరీ పోరాట సమయంలో ఆర్ఎస్ తన అనుభవాలను ఉపయోగించి చాలా సమస్యలు పరిష్కరించారు. రైస్‌మిల్లు కార్మికుల అగ్రిమెంట్ సందర్భంగా ప్రజాస్వామ్య పద్ధతులపై కీలక సూచనలు చేసేవారు. పాములపర్రు ఘటనలో ఆర్ఎస్ చూపిన చొరవ నేటికీ స్ఫూర్తిదాయకం. కార్యకర్తల కుటుంబాల పట్ల వ్యక్తిగత బాధ్యత తీసుకునేవారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు పట్టు వదలకుండా క్రమశిక్షణ, పార్టీ ఆశయం, ప్రజలతో మమేకం అవ్వడం, తక్కువ సమయంలో కార్మికులతో కలిసిపోయే విధానం మాటలతో చెప్పలేనిది. అటువంటి గొప్ప యోధుడి అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

కార్యకర్తల పట్ల వాత్సల్యం.. ప్రజల పట్ల నిబద్ధత

ఆర్ఎస్ సొంతం

బి.తులసీదాస్, ప్రజాశక్తి ఎడిటర్

కార్యకర్తలందరమూ ఎంతో గౌరవం, ప్రేమతో కామ్రేడ్ ఆర్ఎస్ అని పిలుచుకునే రుద్రరాజు సత్యనారాయణరాజు సెప్టెంబర్ 5న కన్నుమూయడం ఎంతో బాధ కలిగించింది. ఎప్పుడూ తెల్లటి బట్టలతో స్వచ్ఛంగా కనిపించే ఆయన మనసు వెన్నలాంటిది. కార్యకర్తలపట్ల ఆయన ఆప్యాయత, వాత్సల్యం ఎల్లప్పుడూ మన మనోఫలకంపై నిలిచి ఉంటాయి. రైతుసంఘ రాష్ట్ర కార్యవర్గంలో ఆయనతో పరిచయం ఉన్నా సాన్నిహిత్యం ఏర్పడింది మాత్రం భీమవరంలో జరిగిన రైతుసంఘం రాష్ట్ర మహాసభ అనంతరమే. మహాసభ నిర్వహణలో అన్ని విషయాల్లోనూ ఆయన ముద్ర స్పష్టంగా కన్పిస్తోంది. ముఖ్యంగా ప్రతినిధులకు ఆహార వసతి సౌకర్యాల కల్పనలో ఏ చిన్న ఇబ్బందీ కలగకుండా చూడటం గొప్ప విషయం. భోజన సమయంలో కామ్రేడ్ ఆర్ఎస్ వ్యవహరించిన తీరు ఆనాటి ప్రతినిధులకు జీవితాంతం గుర్తుండిపోతుంది. ప్రత్యేకమైన వంటకాలను ఆయా జిల్లాలవారిని వ్యక్తులనూ పేరు పేరునా పిలిచి మరీ కొసరి కొసరి వడ్డించిన ప్రత్యేకత ఆయనదే. ఇంటిలో అమ్మ లేదా పిన్నమ్మ, మేనత్త, మేనమామలు తిన్పించిన ఫీల్ కలిగింది. మా కుటుంబం పట్ల ఆర్ఎస్‌గారు ఎంతో వాత్సల్యం చూపేవారు. శ్రీకాకుళం జిల్లాలో సిపిఎం పునర్నిర్మాణ దశలో నేను పాల్గొనడం, నా భార్య రోజా ఉమ్మడి పార్టీ రోజుల్లో ఆయనతో కలిసి యువజన రంగంలో పని చేసిన అమరులు పంచాది కృష్ణమూర్తి, నిర్మల కుమార్తె కావడం వల్ల ప్రత్యేకమైన ఆప్యాయత, అందులో ఆర్ద్రత కనబర్చేవారని మా భావన. అప్పుడప్పుడు పాత విషయాలు చెబుతుండేవారు కూడా!

ప్రజా సమస్యలను పరిశీలించడం, వాటిపై ఆందోళనలు సాగించడం మాత్రమేగాక వాటికి పరిష్కారాలు చూపడం, అందుకోసం ప్రజలను భాగస్వాములను చేయడం, ప్రభుత్వాలు కూడా చర్యలు తీసుకోవాల్సిన తప్పనిసరి పరిస్థితిని సృష్టించేందుకు ప్రయత్నించడం ఆర్ఎస్ ప్రత్యేకత. నేను రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న కాలంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించిన మూడు ప్రధాన సమస్యలపై పని చేసే అవకాశం కలిగింది. అందుకు ఆనాడు కొరటాల గారి మార్గదర్శకత్వం కీలకమైంది. 2006లో రబీ సాగుకు నీటి ఎద్దడి ఏర్పడిన సందర్భంలో కొరటాల ఆయా మండలాల్లో పర్యటించి, ప్రత్యామ్నాయ అనుబంధ నీటి వనరులు, అందుకు ప్రభుత్వమూ, రైతాంగం కూడా తీసుకోవాల్సిన చర్యలు సూచించారు. అప్పుడు నేను కూడా ఆయనతోపాటు ఉన్నాను. సాగునీటి కోసం ఉద్యమం సాగించడం, ప్రత్యామ్నాయ వనరును సాధించడంలో జిల్లాలో రైతు ఉద్యమాన్ని ముందుకు నడపడంలో, పార్టీ నాయకునిగా ఆర్ఎస్ కీలక పాత్ర పోషించారు. కొబ్బరికి తెగులు వచ్చి తీవ్ర నష్టం జరిగిన సందర్భంలో ఆ జిల్లా రైతాంగాన్ని రాజకీయ అభిమానాలకు అతీతంగా కదిలించడంలో రైతు ఉద్యమానికి అన్ని దశల్లోనూ ఆయన మార్గదర్శనం చేశారు. కొల్లేరు ప్రాంతంలోని స్థానికులకు, అక్కడి సాంప్రదాయ జీవనానికి ఎలాంటి నష్టమూ జరగకుండా సమస్యకు శాస్త్రీయ పరిష్కారం సాధించాలని ఆర్ఎస్ కోరుకునేవారు. పెత్తందార్లు ఏ పార్టీ అధికారంలో ఉంటే దాన్ని ఉపయోగించుకొని వారి ప్రయోజనాలు నెరవేర్చుకుంటున్న తీరును ఆర్ఎస్ ఎండగట్టేవారు. ప్రజాశక్తి పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపర్చేవారు. ఎక్కడికీ కదలలేని స్థితిలో కూడా రోజూ ప్రజాశక్తి చదివించుకొని విషయాలు తెలుసుకోవడం అందరికీ స్ఫూర్తిదాయకం.

ప్రజా ఉద్యమాలు నిర్మించడంలో దిట్ట ఆర్ఎస్

కాటం నాగభూషణం, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి

ఏలూరు అర్బన్: అమరజీవి కామ్రేడ్ ఆర్ఎస్ ప్రజా ఉద్యమాలు నిర్మించడంలో దిట్ట. తన యావత్తు జీవితాన్ని శ్రమ జీవులకు అంకితం చేసిన ఆదర్శ కమ్యూనిస్టు. పార్టీలో ఓల్డ్ టైమర్ వ్యవస్థను బలోపేతంగా నడిపిన నిస్వార్థ జీవి. సిపిఐ(ఎం)లో వారి శిష్యునిగా సహచరునిగా పనిచేసినందుకు గర్వపడుతున్నాను. ప్రస్తుత రాజకీయ పరిణామాల్లో వారి అమరత్వం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు. ప్రతిఒక్కరూ వారి అడుగుజాడల్లో నడవాలని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కమిటీ కోరుకుంటుంది. నేను పార్టీ ఓల్డ్ టైమర్‌గా పనిచేసిన సమయంలో వారు నా కుటుంబ సభ్యుల పట్ల చూపిన వాత్సల్యం మరువరానిది. ఓల్డ్ టైమర్ పట్ల వారు చూపిన శ్రద్ధ వారి కమ్యూనిస్టు లక్షణానికి తార్కాణం. వారి మరణం పట్ల ఎంసిపిఐ(యు) రాష్ట్ర కమిటీ తరపున తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తూ, వారికి విప్లవ జోహార్లు అర్పిస్తూ, పార్టీ నాయకత్వానికి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నాం.

దేవుడు మానవ కల్పితం. స్వర్గ నరకాలు లేనే లేవు. మతం, గుళ్లు, గోపురాలు అక్కర్లేదు. కావలసింది మానవత్వం.

- లూథర్ బర్‌బాంక్, ప్రముఖ వృక్ష శాస్త్రజ్ఞుడు.

మహానాయకుడు కామ్రేడ్ ఆర్ఎస్

డిఎన్‌విడి.ప్రసాద్, సిఐటియు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి

కామ్రేడ్ ఆర్ఎస్ గారితో 30 సంవత్సరాల నుండి పరిచయం ఉంది. నా చిన్నతనంలో భీమవరం డివిజన్ పార్టీ కార్యదర్శిగా ఉన్న సమయంలో నా స్వగ్రామం ఆకివీడు ఆయన తరచూ వచ్చేవారు. అప్పటి నుంచే ఆయనను ఒక మహానాయకుడిగా అభిమానించేవారం. ఆయన పార్టీ జిల్లా కార్యదర్శిగా ఉండగా నేను ఎస్ఎఫ్ఐ జిల్లా బాధ్యతలు చేపట్టాను. ఏలూరు జిల్లా కేంద్రంలో ఆయనతో కలిసి పనిచేసే అవకాశం కలిగింది. విద్యార్థి సంఘాన్ని ఎలా అభివృద్ధి చేయాలో అనేక సలహాలు, సూచనలు ఇస్తుండేవారు. 2007లో నేను సిఐటియు బాధ్యతల్లోకి వచ్చేసరికి ఆయన సిఐటియులోనే ఉన్నారు. జిల్లా విభజన వరకు సిఐటియులో ఆయనతో కలిసి పని చేశాను. కామ్రేడ్ ఆర్ఎస్‌గారు ప్రతిరోజూ 14 గంటలకుపైగా పని చేస్తూ కేడర్‌కు ఆదర్శంగా నిలబడేవారు. సమస్యలపై ఉద్యమాలు చేపట్టడం, ఉద్యమాల్లో ఎత్తుగడలు రూపొందిస్తూ పార్టీని ఏకోన్ముఖంగా నడపడంలో ఆయనకు ఆయనే సాటి. జిల్లాలో ఏజెన్సీ భూ పోరాటాలు, కార్మిక వర్గ పోరాటాల సందర్భాల్లో ఆయన కృషి చెప్పుకోదగినది. పార్టీ కుటుంబాల యోగక్షేమాలు తెలుసుకోవడం వారికి సలహాలు, సూచనలు ఇవ్వడం ద్వారా వారికి అండగా ఉండేవారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు.

ఆర్ఎస్ ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలి

మొడియం నాగమణి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు, బుట్టాయగూడెం

కామ్రేడ్ ఆర్ఎస్‌గారు ఏజెన్సీ ప్రాంతంలో భూపోరాటాలు నడపడంలో కీలకపాత్ర పోషించారు. అంతేకాకుండా పార్టీ కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించడం, కుటుంబ యోగ క్షేమాలు అడిగి తెలుసుకోవడం చేసేవారు. ఈ తరం యువత ఆర్ఎస్‌గారి ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి.

ఆర్ఎస్ అంటే డేరింగ్ అండ్ డేషింగ్

ఆర్.లింగరాజు, సిఐటియు ఏలూరు జిల్లా అధ్యక్షులు

ఆర్ఎస్ గారు పార్టీ నిర్ణయాలను తీసుకోవడంలో వేగం, వాటిని అమలు చేయడంలో పడే తపన నేటి నాయకత్వ స్థానాల్లో ఉన్నవారికి, యువతరానికి ఆదర్శం. డేరింగ్ అండ్ డాషింగ్ స్వభావం కూడా ఆర్ఎస్ గారి ప్రత్యేకత. పార్టీ నిర్మాణ విషయాల్లో కచ్చితత్వం కోసం చేసే పోరాటం అనుసరణీయం. కార్యకర్తల పట్ల, వారి కుటుంబాల పట్ల, ఆర్థిక విషయాల్లోనూ, కుటుంబ ఇబ్బందుల్లోనూ ఆప్యాయతగా మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించడంలో నేర్పరి. ప్రతి కార్యకర్తకూ తండ్రితో సమానమైన ప్రేమాభిమానాల్ని పంచిన నాయకుడు. క్లిష్ట సమయాల్లో పార్టీని నడిపించడంలో, ఉద్యమాలను నడిపించడంలో దిట్ట. ధైర్యం, సాహసం, పార్టీ సిద్ధాంతం పట్ల అచంచల విశ్వాసం, చివరి వరకూ ఆత్మస్థయిర్యం కామ్రేడ్ ఆర్ఎస్ గారి గొప్పతనం. ఆయన జీవితం నేటి యువతకు అనుసరణీయం.

ఏజెన్సీ భూపోరాటంలో కామ్రేడ్ ఆర్ఎస్ పాత్ర కీలకం

తెల్లం రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంత భూపోరాటాలు, నిర్బంధ సమయంలో ధైర్యం చెప్పడంతోపాటు ఆ ప్రాంతాల్లో పర్యటించేవారు. గిరిజన నాయకత్వానికి ధైర్యం చెప్పేవారు. ఎంతో ఆప్యాయంగా పలకరించడంతోపాటు ఏజెన్సీ ప్రాంతాల్లో భూపోరాటాలు ఎలా జరుగుతున్నాయో తెలుసుకునేవారు. ఆర్‌డిఒ, డిఎస్‌పి, అధికారులతో భూ సమస్యల గురించి వివరించే సందర్భంలో గిరిజనులపై తప్పుడు కేసులు బనాయించి వేధిస్తున్నారని గట్టిగానే మాట్లాడేవారు. జిల్లా కమిటీ సమావేశం సందర్భంగా వచ్చినప్పుడు చాలా ఆప్యాయంగా మాట్లాడి కుటుంబ యోగక్షేమాలను తెలుసుకునేవారు. ఏజెన్సీ పోరాటంలో ఆర్ఎస్‌గారి పాత్ర చాలా కీలకమైంది. గిరిజనులు, ఆర్ఎస్‌గారి మధ్య విడదీయలేని అనుబంధం ఉంది. కిందిస్థాయి సభ్యులతోసహా అందరినీ ఆప్యాయంగా పలకరించే ఆర్ఎస్‌గారు భౌతికంగా దూరం కావడం చాలా బాధాకరం.

ఆర్ఎస్ ధీశాలి

జి.రాజు, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

స్వాతంత్ర సమరయోధుడు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సిపిఎం ఉద్యమ నిర్మాత, రైతు కార్మిక నేతగా ఉమ్మడి జిల్లాలో ఆర్ఎస్‌గా అందరికీ సుపరిచితమైన గొప్ప నేత. ప్రజా ఉద్యమాల్లో యావజ్జీవ జైలు శిక్ష అనుభవించిన ఆర్ఎస్ దీశాలి. పార్టీ కార్యకర్తల వెన్నంటి నిలిచిన గొప్ప నాయకుడు. వర్గ పోరాటాల్లోనే కాకుండా ప్రజాప్రతినిధిగా, నరసాపురం ఎంఎల్‌ఎగా గెలుపొంది పేదలు, వ్యవసాయ కూలీలు, రైతు కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తిన నేత. నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు నిలిచిన గొప్ప వ్యక్తి కామ్రేడ్ ఆర్ఎస్‌గారికి నూజివీడు ఏరియా పార్టీ కమిటీల నుంచి ఘన నివాళులు అర్పిస్తున్నాం.

ఆర్ఎస్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు

కె.శ్రీనివాస్, రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి

సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎంఎల్‌ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) (97) మృతి ప్రజాఉద్యమాలకు తీరని లోటు. ప్రజాతంత్ర ఉద్యమాల్లో మాలాంటి కార్యకర్తలకు ఆర్ఎస్‌గారు ఎంతో అండ, స్ఫూర్తి, ఒక ధైర్యం. కార్యకర్తలను, వారి కుటుంబ సభ్యులను తన కుటుంబం కంటే ఎక్కువగా అక్కున చేర్చుకోవడం, వారి బాగోగులు, మంచి చెడ్డలూ ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ఆయన ప్రత్యేకత. ఏ చిన్న సమస్య వచ్చినా తనదిగా భావించి పరిష్కరించి వారికి అండగా నిలవడం కామ్రేడ్ ఆర్ఎస్‌గారి నైజం. నేను ప్రజాఉద్యమాల్లో పని చేయడానికి ఆర్ఎస్‌గారి ప్రోత్సాహమే ఒక ప్రధాన కారణం. ప్రజా ఉద్యమాల్లో రాటుదేలిన ఒక కమ్యూనిస్టు యోధుడు, నిస్వార్థంగా తన జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన ధన్యజీవి కామ్రేడ్ ఆర్ఎస్ గారు భౌతికంగా మనకు దూరమైనా మరణించినా ప్రజల హృదయాల్లో జీవించే ఉంటారు. ఆర్ఎస్‌గారికి విప్లవ జోహార్లు,

నేనెరిగిన ఆర్ఎస్

గుడిపాటి నరసింహారావు, సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ సభ్యుడు

నాకు 12 ఏళ్ల వయసులో 1978లో ఒకరోజు ఉదయాన్నే మా ఊరు ఫత్తేపురంలో అనేకమంది ఇళ్లకు పోలీసులు తిరుగుతున్నారు. నరసాపురంలో హత్య జరిగిందని, దాని గురించి చించినాడ, కలగంపూడి గ్రామాల వారి బంధువుల ఇళ్లకు పోలీసులు తిరుగుతున్నారని చెప్పారు. అప్పుడు అదేంటో నాకు తెలియదు. ఆర్ఎస్‌గారిని 1985 జులైలో భీమవరంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశానికి వెళ్లినప్పుడు చూశాను. భీమవరం డిఎన్ఆర్ కాలేజీలో ఎంకామ్ చదువుతున్న రోజుల్లో నాలుగు నెలలు ఆర్ఎస్‌గారి ఇంటిలోని ఒక గదిలో ముగ్గురం అద్దెకి ఉండేవాళ్లం. ఆయనను ఇంటి నుంచి భీమవరం పార్టీ ఆఫీసుకు సైకిల్ మీద తీసుకొచ్చిన సందర్భాలూ ఉన్నాయి. తర్వాత ఆర్ఎస్‌గారు జిల్లా కార్యదర్శి అయ్యాక ఆయనతో సన్నిహితంగా కలిసి పనిచేసే అవకాశం దక్కింది. నూతన కార్యకర్తలను, యువతరాన్ని అన్ని కోణాల్లోనూ అభివృద్ధి చేయడం ఆర్ఎస్‌లో చూశాను. ధైర్యం చెప్పడంలో, చొరవ చూపడంలో జిల్లాలో అందరికీ మార్గదర్శి. జిల్లాలో ఉక్కు మనిషిగా ఆర్ఎస్‌ను అనేకమంది ప్రశంసించడం విన్నాను. ఉద్యమాల్లో ఎన్ని ఆటుపోట్లు వచ్చినా, కుటుంబంలో ఎన్ని ఆటుపోట్లు వచ్చినా తట్టుకొని నిలబడాలని, తన జీవిత అనుభవాలను జోడించి చెప్పేవారు. ఏ సభ, కార్యక్రమం, మీటింగైనా ఆర్ఎస్ గారు ఉంటే అది ఒక భరోసా అనే విధంగా అందరికీ అనిపించేది. ఆర్ఎస్ గారి త్యాగం, నిబద్ధత అసమాన్యం, ఆదర్శనీయం. ఆయన చూపిన బాటలో ప్రజా ఉద్యమాలు బలపర్చడం కోసం ప్రతినబూనాల్సిన అవసరం ఉందని భావిస్తూ.. కామ్రేడ్ ఆర్ఎస్‌గారికి జోహార్లర్పిస్తున్నాను.

ఆర్ఎస్ మృదుస్వభావి

దేవకు సీతారామయ్య, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు

తణుకు: ఆర్ఎస్ పైకి కఠినంగా కనిపించినా మృదుస్వభావం కలిగిన వ్యక్తి. నేను 1983 నుంచి పార్టీలో పనిచేస్తున్నాను. 1988లో హైదరాబాద్ నుంచి తణుకు వచ్చి ఇక్కడ సభ్యత్వం పొందాను. అప్పటికి రుద్రరాజు సత్యనారాయణరాజు(ఆర్ఎస్) గారు తణుకు, భీమవరం డివిజన్ కార్యదర్శిగా ఉన్నారు. అల్లూరు సత్యనారాయణ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆయనకు రాష్ట్ర బాధ్యతలు అప్పగించడంతో ఆర్ఎస్‌కు జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. నేను ఆడిట్ సభ్యులుగా ఉన్నాను. ఆయన పార్టీ కార్యక్రమాలతో పాటు వయోభారంతో మంచాన పడ్డ కార్యకర్తల ఇంటికి వెళ్లి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకునేవారు. వాళ్లకి ఆర్థిక సాయం చేసేవారు. అదేవిధంగా స్థానిక నాయకులు రెండో వ్యక్తి ప్రమేయం లేకుండా నిధి వసూలు చేసేందుకు వెళ్లేవారు కాదు. సేకరించిన నిధికి తప్పకుండా రశీదు ఇప్పించేవారు. నేను ఆయనతో 36 సంవత్సరాలు కలిసి పనిచేశాను. తణుకులో సిటి బస్సులు ఉండేవి అప్పుడు కార్మికుల పనివేళలు, వేతనాలపై సమ్మె చేశారు. అది చాలా కాలం కొనసాగింది. అప్పుడు ఆర్ఎస్ జోక్యంతో సమస్యలకు పరిష్కారం లభించింది. ఆ సమ్మెలో భాగంగా పెట్టిన కేసులు కూడా లోక్ అదాలత్‌లో రాజీ అయ్యాయి. పోరాటం చేయడం ద్వారానే పార్టీ మనుగడ మరింత పెరుగుతుందని నమ్మిన వ్యక్తి ఆర్ఎస్. తణుకులో కోస్టల్ ఆగ్రో పరిశ్రమ కార్మిక, ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆయన పెద్దపులి లాంటి వ్యక్తి, ఆర్ఎస్ మృతి పార్టీకి తీరని లోటు.

నిత్య కృషీవలుడు ఆర్ఎస్

కౌరు వెంకటేశ్వర్లు, అడ్వకేట్, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్, తణుకు

ప్రజాశక్తి - తణుకు రూరల్

కార్మిక, కర్షక, పీడిత ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి కామ్రేడ్ ఆర్ఎస్ గారు. నాకు ఆయనతో 30 ఏళ్ల అనుబంధం ఉంది. తణుకు డివిజన్‌లో జరిగిన మహాసభలకు జిల్లా కార్యదర్శి హోదాలో ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన స్థానిక నాయకుల్లో పోరాట స్ఫూర్తిని నింపారు. 1990లో తణుకులో సిఐటియు ఆవిర్భవించింది. కోస్టల్ ఆగ్రో పరిశ్రమలో కార్మికులంతా యూనియన్‌గా ఏర్పడ్డారు. అప్పుడు యాజమాన్యానికి, కార్మిక సంఘానికి జరిగిన పోరాటంలో మాకు ఆర్ఎస్‌గారు అండగా నిలిచారు. ఈ పోరాటం సుమారుగా ఆరు నెలలు కొనసాగింది. నాయకులపై కేసులు పెట్టారు. లాఠీ ఛార్జి కూడా చేశారు. సుమారు వంద మందిని అరెస్టు చేశారు. కార్మికులు, నాయకులు గాయపడినా యాజమాన్యానికి వ్యతిరేకంగా పోరాటం సడలిపోకుండా అండగా ఉండి ముందుకు నడిపించారు. సిపిఎం జిల్లా కార్యదర్శిగా ఉన్న ఆయన మాకు తగిన సలహాలు సూచనలిస్తూ మాలో మనోధైర్యం దెబ్బ తినకూండా పోరాటంలో విజయం సాధించేలా ప్రోత్సహించారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య తర్వాత అంతస్థాయిలో ప్రజా ఉద్యమాలు నిర్మించారు ఆర్ఎస్. మతోన్మాదానికి, కులతత్వానికి వ్యతిరేకంగా మానవత్వానికి, సమసమాజ స్థాపనకు తన జీవితాన్ని అంకితం చేసిన నిత్యకృషీవలుడు ఆర్ఎస్. జూనియర్ అడ్వకేట్‌గా ప్రాక్టీస్ ప్రారంభించిన నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. ఆయన చాలా ఆత్మీయంగా పలకరించేవారు. ఆయన ఆశయ సాధన కోసం నేటి కామ్రేడ్‌లు కృషి చేయాలి.

జిల్లా ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు

పివి ప్రతాప్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

తణుకు: జిల్లాలో రుద్రరాజు సత్యనారాయణరాజు(ఆర్ఎస్) ఉద్యమాన్ని నిర్మించడంలో కీలక పాత్ర వహించారు. ప్రతీ కుటుంబంతో మంచి సంబంధాలు ఉండేవి, ప్రతీ కార్యకర్తకి ఆర్ఎస్ ఉన్నారనే భరోసా ఉండేది. సమస్యలపై వెంటనే కార్యాచరణ చేసేవారు. నా వరకు స్టూడెంట్ ఆర్గనైజ్ ఎస్ఎఫ్ఐ బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి ఎన్నో విషయాలు, సహాయ, సహకారాలు అందించేవారు. ప్రజల సమస్యలు, పార్టీ సమస్యల్లో అదే చొరవ చూపించేవారు. వారి ఉపన్యాసాలు కూడా వాళ్లకి అర్థం అయ్యేది. బాగా ప్రోత్సహించేవారు. పార్టీ బాగా పెరగడానికి కారణం ఆర్ఎస్. నా పెళ్లి విషయంలో కూడా చొరవ చూపి చేశారు. ఎంఎల్‌ఎగా పనిచేశాననే ఆలోచన, గర్వం ఆయనకి ఉండేది కాదు. ఇన్ని పద్ధతులు ఉండటం వల్లనే పార్టీ పట్ల విశ్వాసం పెరిగింది.

ఆర్ఎస్ జీవనప్రస్థానం ఉత్తేజకరం

బివి.రాఘవులు, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు

ఉద్యమ జీవితంలో ఎన్ని అవాంతరాలొచ్చినా, ఎన్ని ఆటుపోట్లు వచ్చినా, ఎంత నిర్బంధాన్ని, జైలు జీవితాన్ని ఎదుర్కోవాల్సి వచ్చినా మొక్కవోని దీక్షతో కమ్యూనిస్టు ఉద్యమం కోసం కామ్రేడ్ ఆర్ఎస్ (రుద్రరాజు సత్యనారాయణరాజు) తన జీవితాన్ని ధారపోయటం అందరికీ ఉత్తేజకరం, ఉత్ప్రేరకం. ప్రజల కోసం ఎంతటి కష్టాలకైనా ఎదురొడ్డే కమ్యూనిస్టులను ఎంత ఆదరిస్తారో, కడుపులో పెట్టుకుని రక్షించుకుంటారో ఆర్ఎస్ ఉద్యమ ప్రస్తానమే నిదర్శనం. ఆర్ఎస్ జీవితం అనుభవాల గని. ప్రజా ఉద్యమాలకు ఆర్ఎస్ అనుభవాలు ప్రేరణనిస్తాయి.

అవిశ్రాంత కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ ఆర్ఎస్

వి.శ్రీనివాసరావు,
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి



స్వాతంత్ర పోరాట కాలంలోనే విద్యార్థి ఉద్యమ నేతగా ఉద్యమ ప్రస్థానం ప్రారంభించి 75 ఏళ్లు పార్టీ, ప్రజాఉద్యమాల్లో అవిశ్రాంతంగా పని చేసిన సమరశీల కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ ఆర్ఎస్. కొనఊపిరి వరకూ పార్టీ పట్ల, సిద్ధాంతం పట్ల, ప్రజల పట్ల అచంచల విశ్వాసంతో, చైతన్యంతో తుదిశ్వాస విడిచిన ఉత్తమశ్రేణి కమ్యూనిస్టు నేత ఆర్ఎస్. సుదీర్ఘకాలం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యునిగా, పది సంవత్సరాల పాటు పార్టీ జిల్లా కార్యదర్శిగా పని చేశారు.

పశ్చిమగోదావరి జిల్లాలో సిపిఎం నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో విద్యార్థి, యువజన, వ్యవసాయ కార్మిక, రైతు, కార్మిక రంగాలకు జిల్లా ప్రధాన నేతగా ఉద్యమాల నిర్మాణం, పోరాటాల్లో సమర్ధ నేతగా పార్టీలో, జిల్లా ప్రజానీకంలో మంచి గుర్తింపు పొందారు. వర్గ పోరాటాల్లో ఎన్ని నిర్బంధాలు వచ్చినా చెక్కు చెదరని ధైర్యసాహసాలతో పార్టీలో, ప్రజా ఉద్యమాల్లో ప్రజానాయకునిగా చిరస్మరణీయుడయ్యారు. రైతు రంగంలో ఆయనతో కలిసి పనిచేసే అవకాశం నాకు లభించింది. సమస్యలపై ఆయనకున్న పట్టు అపారం. కార్యకర్తలను ప్రోత్సహించి అనుకున్న లక్ష్యాన్ని సాధించడంలో దిట్ట. ఏ కార్యక్రమం తీసుకున్నా అది జయప్రదమయ్యేదాకా విశ్రమించని ఆయన స్వభావం యువతరానికి ఆదర్శం. పోరాటాలు, ఉద్యమాల్లోనే కాదు చట్టసభల్లో సమర్థవంతంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందారు. ఉద్యమ జీవిత తొలికాలంలో స్వగ్రామం చించినాడ గ్రామ సర్పంచిగా పెద్ద మెజారిటీతో గెలిచి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దడంలో ప్రతిభావంతంగా పని చేశారు. శాసనసభ్యునిగా గెలుపొంది జిల్లాలో, శాసనసభలో ప్రజలవాణిని వినిపించడమే కాకుండా సమస్యల పరిష్కారమయ్యే వరకూ ప్రజల వెన్నంటి ఉండి ప్రజా ఉద్యమాలు నిర్వహించిన 'పీపుల్స్ ఎంఎల్ఎ ఆర్ఎస్'. ఆర్.ఎస్ ధన్యజీవి.